www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



పోక్సో కేసులో 23 ఏళ్ల జైలు శిక్ష

వెలువరించిన నల్లగొండ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు

రెండు నెలల్లో పది తీర్పులు ఇచ్చిన న్యాయాధికారి రోజా రమణి

ఒకరికి ఉరి శిక్ష, మరొకరికి 51 ఏళ్ల జైలు

10

బుధవారం | 17-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 170

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా.11.40 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పునర్వసు ఉ.6.26 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.2.28-4.04; దుర్ముహూర్తం: ఉ.11.45-12.33; అమృతఘడియలు: రా.12.06-1.42; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.12

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమెరికా, భారత్.. వాణిజ్య చర్చలు మళ్లీ షురూ!

2

ట్రంప్ అద్దగోలు సుంకాలతో నిలిచిన ప్రక్రియ

తాజాగా ఆరో దశ చర్చలు పునః ప్రారంభం

రాకేశ్ అగర్వాల్ నేతృత్వంలోని భారత బృందంతో ఢిల్లీలో భేటీ అయిన అమెరికా ప్రతినిధి బృందం



నరేంద్రుడి జైత్రయాత్ర

- నేడు ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం
- చాయ్‌వాలా నుంచి ప్రధాని స్థాయికి ఎదిగిన నేత
- గుజరాత్ సీఎంగా 13.. దేశ ప్రధానిగా 11 ఏళ్లు
- 40 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ప్రశంసలు, విమర్శలు
- మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాలలో ఆయనను కోట్లాదిమంది తమ ఆరాధ్య దైవంగా భావిస్తారు. ఆయన దేశభక్తికి తిరుగులేదని, కుటుంబంతో సహా సర్వస్వాన్నీ త్యాగం చేసి దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చేందుకు అహర్నిశలూ కృషి చేస్తుంటారని వారు భావిస్తుంటారు. అదే సమయంలో.. ఆయన దేశంలో ప్రజల మధ్య చిచ్చు పెడతారని, విద్వేష భావాలు రెచ్చగొడతారని అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకుని దేశాన్ని వెనక్కు నడిపిస్తారని మరికొంత మంది తీవ్రంగా విమర్శిస్తుంటారు. ఆయనెవరో కాదు.. పదమూడేళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వర్తించి, గత పదకొండు సంవత్సరాలుగా దేశ ప్రధానిగా వ్యవహరిస్తున్న నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. దేశ రాజకీయాలపైనే కాదు.. ప్రజల మనోభావాలపై

మిగతా 2వ పేజీలో...

మన పోరాట చరిత్రకు ప్రతీక తెలంగాణ విమోచన దినోత్సవం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ

ముఖ్య అతిథిగా పాల్గొననున్న రాజ్‌నాథ్

ఇప్పటికే నగరానికి చేరుకున్న రక్షణ మంత్రి

11



ఏసీబీ అధికారుల దాడుల్లో బయటపడ్డ నోట్ల కట్టలు

విద్యుత్ ఏడీఈ అక్రమాస్తులు 100 కోట్లు

సొంతంగా పదెకరాల్లో రసాయన పరిశ్రమ


బినామీ ఇంట్లో రూ.2.18 కోట్లు స్వాధీనం

అక్రమ సంపాదనతో రియల్ ఎస్టేట్ దందా

ఏసీబీకి చిక్కిన ఇబ్రహీంబాగ్ ఏడీఈ

హైదరాబాద్ శివార్లలో విద్యుత్ అధికారుల అక్రమాలు.. బినామీ పేర్లతో కాంట్రాక్టులు

అంచనాలు పెంచి అక్రమాలు.. లంచాలు



ఏడీఈ అంబేడ్కర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విద్యుత్ శాఖ ఏడీఈని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలోని ఆపరేషన్స్ విభాగంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ)గా పనిచేస్తున్న ఏరుగు అంబేడ్కర్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఇబ్రహీంబాగ్‌లోని ఏడీఈ కార్యాలయం, మణికొండలోని అంబేడ్కర్ ఇల్లు, బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లలో మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు మంగళవారం

మిగతా 14వ పేజీలో...

లంచం కేసులో తహసీల్దార్‌కు ఏడాది జైలు శిక్ష

14

అవినీతి సొమ్ము అందరం పంచుకుంటాం

స్పై కెమెరాలో మణిహారిక సంభాషణ రికార్డు

డిజిటల్ ఫైల్‌ను కోర్టులో సమర్పించిన ఏసీబీ

సర్కారీ పథకాలకు డిస్కమ్!

వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతలన్నీ దాని పరిధిలోకే..



ఇంధన శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తర్వాత ఏర్పాటు!

కొత్త డిస్కమ్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటు పూర్తి కావాలి

కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అధ్యయనం చేయండి

డిసెంబరులోగా పూర్తిస్థాయి ప్రణాళికలు

సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించండి

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్కారీ పథకాల కరెంటు కనెక్షన్ల కోసం కొత్తగా విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణలో ప్రస్తుతం దక్షిణ ప్రాంతం కోసం హైదరాబాద్ కేంద్రంగా ఎస్పీడీసీఎల్, ఉత్తర ప్రాంతం కోసం హనుమకొండ కేంద్రంగా ఎన్పీడీసీఎల్ ఉన్నాయి. ఇవిగాక కొత్తగా ఒక డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కొద్ది రోజుల కిందట ఇంధన శాఖను ఆదేశించిన సంగతి తెలిసిందే. 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, గ్రామీణ తాగునీటి సరఫరా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ వంటి పథకాల విద్యుత్తు కనెక్షన్ల కోసం కొత్తగా డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తోంది. ఈ క్రమంలో కొత్త డిస్కమ్ ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం దీనిపై

మిగతా 13వ పేజీలో...

ఏపీకి విద్యుత్ బకాయిలు చెల్లించాలని మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

ఇరు పక్షాల వాదనలు విన్నాకే నిర్ణయం: సుప్రీం

సర్వోన్నత న్యాయస్థానంలో తెలంగాణకు ఊరట

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించండి

- నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కితీసుకోండి
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు మంత్రి దామోదర విజ్ఞప్తి
- రాజకీయ దురుద్దేశంతోనే కొందరి కుట్రలని వెల్లడి

13



సర్ఫరాజ్ అహ్మద్



ఎస్వీఎస్ రెడ్డి

మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

ప్రభుత్వ సలహాదారుగా ఎస్వీఎస్ రెడ్డి నియామకం

ఆయనకు పట్టణ రవాణా వ్యవస్థ అప్పగించిన సర్కార్

మహిళా శిశు సంక్షేమం డైరెక్టర్‌గా శృతి ఓఝా

పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నియమితులయ్యారు. హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం మెట్రో ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకూ మెట్రో ఎండీగా ఉన్న ఎస్వీఎస్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించి ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్)గా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్ (ఐఆర్ఏఎస్) అధికారి అయిన ఎస్వీఎస్ రెడ్డి 2017లో పదవీ విరమణ చేశారు. అయినా.. మెట్రో రైలు ఎండీగా ప్రభుత్వాలు ఆయన సర్వీసును పలుమార్లు పొడిగిస్తూ వచ్చాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 వరకు ఆయన మెట్రో రైలు ఎండీగా కొనసాగాల్సి ఉంది. కానీ.. ప్రభుత్వం ఆయనను ఆ పోస్టు నుంచి రిలీవ్ చేసి, పట్టణ రవాణా వ్యవస్థ సలహాదారుగా నియమించింది. ఇక, రాష్ట్రంలోని ముగ్గురు ఐఏఎస్‌లకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. స్టడీ లీవ్ నుంచి తిరిగి వచ్చిన శృతి ఓఝాకు పోస్టింగ్ ఇచ్చింది. ఆమెను మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. ఇక, ఇంటర్మీడియట్ విద్య

మిగతా 11వ పేజీలో...

ఆర్థిక మోసగాళ్ల వలలో ఐఏఎస్‌లు.. ఐపీఎస్‌లు!



ప్రైవేటు సంస్థల్లో రూ.కోట్లలో కొందరి పెట్టుబడి.. బినామీల పేరుతో పెట్టుబడి పెట్టిన అధికారులు

తమ గార్మెంట్ ఫ్యాక్టరీలో పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించి కోట్లు కొల్లగొట్టిన మహిళ

సీసీఎస్‌లో కేసు నమోదు.. మహిళ అరెస్టు?.. అన్ని కోట్లు వారికెలా వచ్చాయనే కోణంలో దర్యాప్తు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసగాళ్లు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. ప్రీ లాంచ్ ఆఫర్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు, తమ వెంచర్‌లో పెట్టుబడులు పెడితే ప్రతి నెలా 15 శాతం రిటర్నులు ఇస్తామని, బంగారంపై పెట్టుబడి పెడితే ఏడాదిలో డబుల్ రేటుతో బంగారం పొందవచ్చని, తమ కంపెనీలో, ఫ్యాక్టరీలో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభాలు ఇస్తామని.. ఇలా కల్లబొల్లి మాటలతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. రూ.వందల కోట్లు మూటగట్టుకొని బిచాణా ఎత్తేస్తున్నారు. ఈ కేటుగాళ్ల వలలో కొందరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కూడా చిక్కుకొని మోసపోయినట్లు తెలుస్తోంది. అయితే వీరిని ఇలా మోసం చేసింది ఓ మహిళ కావడం గమనార్హం. తన గార్మెంట్ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి.. పదుల సంఖ్యలో వ్యక్తులతో పెట్టుబడులు పెట్టించి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలిసింది. పెట్టుబడులు పెట్టిన వారిలో ఓ ఐఏఎస్, ఆర్డీవోలు సహా.. పలువురు రెవెన్యూ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వారంతా అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంపాదించిన సొమ్మును బినామీల పేరుతో పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. కలెక్టర్ సహా.. పెద్ద పెద్ద అధికారులతో పరిచయాలు ఉన్న సదరు మహిళ.. తమకు వివిధ గార్మెంట్ ఫ్యాక్టరీల్లో భాగస్వామ్యం ఉందని, వివిధ నగరాలు, పట్టణాలకు లక్షల సంఖ్యలో స్కూలు యూనిఫామ్‌లు సరఫరా చేస్తున్నామని నమ్మబలికింది. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పింది. నకిలీ ఇన్వాయిస్‌లు చూపించింది. అంతా నిజమని నమ్మి పలువురు

మిగతా 11వ పేజీలో...

ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు మార్గదర్శకాలు



జీవో 190 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకే..


స్థానికతకు సంబంధించిన బదిలీలకు అనుమతి

గరిష్ఠంగా మూడేళ్లు.. ఆ తర్వాత పాత స్థానానికే

పదోన్నతులు, భాగస్వామి, మ్యూచువల్ విభాగాల్లో లబ్ధి పొందిన వారికి అవకాశం లేదు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు మార్గం సుగమమైంది. ఇతర జిల్లాలు, జోన్లకు బదిలీ అయి ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం కల్పించేలా మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. జీవో 317 ద్వారా ఒక జోన్ నుంచి మరో జోన్‌కు, ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన వారికి న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో 190 విడుదల చేశారు. 2021 డిసెంబరులో ఇచ్చిన 317 ఉత్తర్వుల ప్రకారం కొంత మంది ఉద్యోగులను బలవంతంగా ఇతర జిల్లాలకు, ఇతర జోన్లకు బదిలీ చేశారనే అంశంపై నాలుగేళ్లుగా వివాదం కొనసాగుతోంది. స్థానికత కోల్పోయామని ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక, వారి సమస్యపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. 2018లో ఇచ్చిన జీవో 124, 2021లో ఇచ్చిన జీవో 317, 2022లో ఇచ్చిన జీవో 46 ప్రకారం ఉద్యోగుల క్యాడర్ కేటాయింపులపై చాలా మంది ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. వీరి సమస్యలపై 2024లో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగుల నుంచి

మిగతా 14వ పేజీలో...



'సిందూర్'తో మసూద్ కుటుంబం చిన్నాభిన్నం

జైషే మొహమ్మద్ టాప్ కమాండర్ ఇలియాస్ అంగీకారం

సోషల్ మీడియాలో వీడియో వైరల్

2

విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్!

సమీకృత గురుకులాలకు రూ.21వేల కోట్లు

ఉన్నత స్థాయి, టెక్నికల్, డిజిటల్ విద్య కోసం మరో రూ.9 వేల కోట్లు అవసరం

11

మొత్తం 30వేల కోట్ల రుణాలకు సర్కార్ ప్లాన్

దీని కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు

రుణాలు ఎఫ్ఆర్‌బీఎంలోకి రాకుండా ఏర్పాట్లు

కేంద్రం ఆమోదిస్తే అసెంబ్లీలో బిల్లు

ఆలయాలకు భక్తులు డబ్బులు ఇచ్చేది కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు

ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించకూడదు: సుప్రీంకోర్టు

2

అది నేలకొండపల్లి ఎందుకు కాకూడదు!?

14

కాకర్తి ఎక్కడుందో గుర్తించకుండానే ఊహలా?

స్థపతి నాగిరెడ్డి ప్రతిపాదన ఆశ్చర్యకరం

'కొండపల్లి సీమలో కాకతీయం' కథనంపై చరిత్ర పరిరక్షణ వేదిక స్పందన

hmda Growing Global

14

హెచ్ఎండీఏలో రెండు రీజియన్లు

ఔటర్‌ను సరిహద్దుగా చేసుకుని కోర్ అర్బన్, సబర్బన్‌గా విభజన

తాజాగా వీటికి జాయింట్ కమిషనర్లు

పాల ప్యాకెట్లకే డబ్బుల్లేవు!

రూ. 3 కోట్లు ఎక్కడి నుంచి తెస్తాం?

గ్రూప్-1 ర్యాంకర్లపై అసత్య ప్రచారం వద్దు

వారి జీవితాలను రాజకీయం చేయొద్దు

అమ్మిందెవరు, కొన్నదెవరు? ఆధారాలేవీ?

సమాజంలో తిరగలేకపోతున్నాం

10

గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రుల ఆవేదన



'జూబ్లీహిల్స్' అభ్యర్థి ఎవరో?

అంజన్‌కుమార్ పేరిట జూబ్లీహిల్స్‌లో పోస్టర్

11

తేల్చడంలో కాంగ్రెస్ డైలమా!.. పెరుగుతున్న ఆశావహులు

ప్రచారంలో పలువురు నేతల పేర్లు

మాజీ ఎంపీ అంజన్ కుమార్, పలువురి పేరిట పోస్టర్లు

ఆలయాలకు భక్తులు డబ్బులు ఇచ్చేది కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం

» మద్రాసు హైకోర్టు తీర్పునకు సమర్థన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఆలయాలకు భక్తులు డబ్బులిచ్చేది కల్యాణ మండపాల నిర్మాణం కోసం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించకూడదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సమర్థించింది. కాగా, ఐదు ఆలయాల నిధులతో తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ గతనెల 19న కొట్టివేసింది. కల్యాణ మండపాలు నిర్మించి, వాటిని వివాహ వేడుకల నిర్వహణ నిమిత్తం అద్దెకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం 'మతపరమైన నిమిత్తం' నిర్వచనం కిందకు రాదని హైకోర్టు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. 'భక్తులు తమ డబ్బును ఇలాంటి కల్యాణ మండపాల ఏర్పాటు కోసం ఆలయాలకు ఇవ్వరు. అవి ఆలయాలను మెరుగుపరిచేందుకై ఉండొచ్చు' అని తెలిపింది. విద్య, వైద్య సంస్థల ఏర్పాటు తదితర దాతృత్వ కార్యక్రమాలకు ఆ డబ్బును వినియోగించాలని ధర్మాసనం సూచించింది.

ట్రైబ్యునళ్లు స్టేషనరీ కోసం అడుక్కోవాలా?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పించకపోవడం వల్లనే ట్రైబ్యునల్ పదవులను చేపట్టడానికి మాజీ న్యాయమూర్తులు ముందుకు రావడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సౌకర్యాలు కలిగించలేకపోతే వాటిని మూసివేయాలంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖాళీగా ఉన్న ట్రైబ్యునళ్ల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎన్‌జీటీ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం ధర్మాసనం విచారణ జరిపింది. ట్రైబ్యునళ్లలో స్టేషనరీ నుంచి నివాస భవనం, కారు ప్రతిదానికీ అడుక్కొనే పరిస్థితి కల్పిస్తున్నారని విమర్శించింది. ఒకవేళ ఇచ్చినా డొక్కు కారు ఇస్తారని వ్యాఖ్యానించింది. మాజీ న్యాయమూర్తులను గౌరవించే పద్ధతి ఇలాగేనా అని ప్రశ్నించింది.

రాజకీయ పార్టీలకు 'పోష్' వర్తించదన్న సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: రాజకీయ పార్టీలకు 'పని స్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిరోధక, పరిహార చట్టం (పీఓఎస్‌హెచ్-పోష్)-2013 వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు పని స్థలాలు కాదని, అందులో చేరిన వారు ఉద్యోగులు కాదని తెలిపింది. ఆ కారణంగా 'పోష్'ను వర్తింపజేయలేమని ధర్మాసనం తెలిపింది. పార్టీలో చేరిన వారు ఉద్యోగులు కారని, వారంతా స్వచ్ఛందంగా చేరుతారని పేర్కొంది. ఒకవేళ అమలు చేస్తే ఆ చట్టం దుర్వినియోగమవుతుందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు పెరుగుతాయని వ్యాఖ్యానించింది. తేనెతుట్టెను కదిలించినట్టవుతుందని తెలిపింది. మహిళా కార్యకర్తలపై జరిగే వేధింపులను పరిష్కరించడానికి ఈ చట్టాన్ని ప్రయోగించాలని కోరుతూ కేరళకు చెందిన యోగమాయ ఎం.జి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. పార్టీలో యజమాని-ఉద్యోగి సంబంధం ఉండదంటూ ఆ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిపై ఆమె సుప్రీంలో అప్పీలు చేశారు.

ఉత్తరాఖండ్‌లో వరదలు..10మంది గల్లంతు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తింది. మంగళవారం డెహ్రాడూన్‌లో మేఘవిస్ఫోటం జరిగి, మెరుపు వరదలు వచ్చాయి. దీంతో వికాస్‌నగర్ ప్రాంతంలో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో 10 మంది వరదలో కొట్టుకుపోయారు. మరోచోట స్వర్ణ నదికి సమీపంలో వరదల్లో చిక్కుకున్న ఓ చిన్నారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. భారీ వర్షాలకు డెహ్రాడూన్, ముస్సోరీ మాల్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. సహాయక బృందాలు దాదాపు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. భారీ వర్షాల వల్ల అన్ని నదులు పొంగి పొర్లుతున్నాయని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు.

తగ్గిన మదర్ డైరీ ఉత్పత్తుల ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: జీఎస్టీ తగ్గింపును తన ఉత్పత్తులకు వర్తింప చేస్తూ మదర్ డైరీ ధరలను తగ్గించింది. కనిష్ఠంగా రూ.2 నుంచి గరిష్ఠంగా రూ.30 వరకూ ధరలు తగ్గినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. టోన్డ్ పాలు, నెయ్యి, ఆవు నెయ్యి, పన్నీరు, బట్టర్, చీజ్ ధరలపై ఈ తగ్గింపు వర్తిస్తుందని వివరించింది. యూహెచ్‌టీ టోన్డ్ పాలపై రూ.2 తగ్గింది. పన్నీరు 200 గ్రాములపై రూ.3, 400 గ్రాములపై రూ.6, మలాయ్ పన్నీరు 200 గ్రాముల ప్యాక్‌పై రూ.3 ధర తగ్గింది. బట్టర్ 500 గ్రాముల ప్యాక్‌పై రూ.20 తగ్గగా, 100 గ్రాములపై రూ.4 తగ్గింది. 1లీటరు నెయ్యిపై రూ.30 తగ్గింది. కాగా, 500 మి.లీ.ల ఆవు నెయ్యిపై రూ.15 తగ్గిందని సంస్థ ప్రకటించింది.

ఆపరేషన్ సిందూర్ సమయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది

» పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ ధర్ ఒప్పుకోలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: తన మధ్యవర్తిత్వం వల్లే భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆగిందన్న ట్రంప్ ప్రచారాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, డిప్యూటీ పీఎం ఇషాక్ ధర్ పరోక్షంగా కొట్టిపారేశారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది" అని ఒప్పుకొన్నారు. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి మార్కో రుబియో తనకు చెప్పారని వివరించారు. మే నెలలో పహల్గాం దాడి, ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ జరిగిన సంగతి తెలిసిందే. జూలైలో ఇషాక్ ధర్ రుబియోతో సమావేశం అయ్యారు. "జూలై 25న నేను రుబియోతో సమావేశం అయినప్పుడు.. ఆపరేషన్ సిందూర్ సమయంలో యుద్ధ విరమణపై భారత్‌తో ఏం చర్చించారు అని రుబియోను అడిగాను. దానికి ఆయన.. ఈ వ్యవహారంలో భారత్ మూడో దేశం జోక్యాన్ని కోరుకోలేదు. ఈ అంశాన్ని భారత్ ద్వైపాక్షిక అంశంగా చూసిందని చెప్పారు" అంటూ ధర్ వివరించారు. పాకిస్థాన్‌పై యుద్ధం విరమణలో ట్రంప్ ప్రమేయం ఏమీ లేదని భారత్ ఇప్పటికే ఎన్నో సార్లు స్పష్టం చేసింది. ఇషాక్ ధర్ వ్యాఖ్యలతో అది మరింత స్పష్టమైంది.

'ఖతార్'పై నెతన్యాహు నాకేం చెప్పలేదు: ట్రంప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఖతార్‌లో దాడి చేసే ముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తనకు చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. దాడులకు కొద్ది సేపటి ముందు నెతన్యాహు ట్రంప్‌కు సమాచారం ఇచ్చారన్న వార్తా కథనాల నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పష్టతనిచ్చారు. క్షిపణులు గాల్లోకి ఎగిరిన తర్వాత తమకు సమాచారం అందిందని, దాడులను ఆపేందుకు ట్రంప్‌కు అవకాశం లేకుండా పోయిందని వైట్ హౌస్ వివరించింది. అంతకుముందు యాక్సియస్ వార్తా సంస్థ.. "ఖతార్‌లో దాడులపై ఇజ్రాయెల్ ముందే అమెరికా అధ్యక్ష కార్యాలయానికి సమాచారం తెలియజేసింది" అని ఇజ్రాయెల్ రక్షణ అధికారులను ఉటంకిస్తూ కథనం రాసింది. దోహాలో హమాస్ రాజకీయ నేతలు ఉన్నారంటూ ఇజ్రాయెల్ ఈ నెల 9న దోహాలో క్షిపణి దాడులు చేసింది.

నరేంద్రుడి జైత్రయాత్ర



(మొదటి పేజీ తరువాయి)

కూడా బలమైన ముద్ర వేసిన మోదీ 75 ఏళ్లు పూర్తి చేసుకుని బుధవారం 76వ పడిలో అడుగుపెట్టారు. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో 1950లో పుట్టి.. బాల్యంలోనే తండ్రితో పాటు చాయ్ అమ్మిన మోదీ.. ఎనిమిదేళ్ల వయస్సులో ఆరెస్సెస్‌లో చేరారు. దాదాపు 15 ఏళ్ల పాటు సంఘ్‌లో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. 1987లో బీజేపీ గుజరాత్ యూనిట్ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గుజరాత్‌లో పార్టీని ఆయన సంస్థాగతంగా బలోపేతం చేయడం వల్ల.. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ అత్యధిక సీట్లు సాధించింది. అద్వాణీ గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి చేపట్టిన రథయాత్రను సక్సెస్ చేయడంలో మోదీ పాత్ర కీలకం. అప్పుడే ఆయనపై జాతీయ నాయకుల దృష్టి పడింది. దీంతో 1990-91లో మురళీ మనోహర్ జోషి కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు చేపట్టిన ఏక్తా యాత్రను నిర్వహించే బాధ్యతను మోదీకి అప్పజెప్పారు. జోషీతో పాటు 15 వేల కిలోమీటర్లు దేశమంతటా తిరగడంతో గుజరాత్‌లో కూడా ఒక ప్రధాన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారు. 1991 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఎన్నికల వ్యూహాన్ని రూపొందించే బాధ్యతలు చేపట్టిన మోదీ.. గాంధీనగర్ నుంచి అద్వాణీ విజయానికి తీవ్రంగా తీవ్ర కృషి చేశారు. అంచలంచెలుగా పార్టీలో ఎదుగుతూ వచ్చారు. గుజరాత్ రాజకీయాలలో శంకర్‌సింగ్ వాఘేలా, కేశుభాయ్ పటేల్ మధ్య ఘర్షణలు తీవ్రతరం కావడంతో వాజ్‌పేయి స్వయంగా ఫోన్ చేసి మోదీకి గుజరాత్ సీఎంగా పట్టం కట్టారు. సీఎంగా మోదీ ఒక సమర్థుడైన పరిపాలకుడిగా వ్యవహరించి గుజరాత్ నమూనాను ప్రపంచానికి పరిచయం చేశారు. గుజరాత్‌ను తాను పరిపాలించిన 13 ఏళ్లలో.. బలమైన పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థగా మార్చారు. బీజేపీలో వాజ్‌పేయి, అద్వాణీ తర్వాత అతివేగంగా గుర్తింపు పొందిన నాయకుడైన మోదీ.. తాను సీఎంగా ఉండగానే పార్టీకి జాతీయస్థాయిలో స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేశారు. వాజ్‌పేయి తర్వాత అద్వాణీకి 10 సంవత్సరాలు పార్టీని నిర్వహించే అవకాశం వచ్చినప్పటికీ.. బీజేపీని అధికారంలోకి తీసుకురాలేకపోవడంతో 2013లో మోదీని ప్రధాని అభ్యర్థిగా పార్టీ రంగంలోకి దించింది. 2014లో దేశమంతటా మోదీ ప్రభంజనం వీయడంతో మొట్టమొదటిసారి బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా మోదీ పార్టీకి విజయం సాధించి బీజేపీలో తనకు మరో ప్రత్యామ్నాయం లేదని నిరూపించుకున్నారు. ఆయన హయాంలో బీజేపీ బలమైన పార్టీగా అవతరించి సొంతంగా దాదాపు 18 రాష్ట్రాలలో అధికారంలోకి రావడమే కాకుండా మొత్తం 21 రాష్ట్రాలలో ఎన్డీయే సారథ్యంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

ఎన్నో విమర్శలు..

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిన మోదీ.. పలు వైఫల్యాలను, విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే గుజరాత్ అల్లర్లు జరిగి వేలాది మంది ఊచకోత జరగడం ఆయన రాజకీయ జీవితంలో చెరిగిపోని మచ్చ. ప్రధానిగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదం అయ్యాయి. పెద్ద నోట్ల రద్దు, సాగుచట్టాలు, లాక్‌డౌన్ సమయంలో పేదల మరణాలు, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలు, మణిపూర్‌లో రెండేళ్లపాటు జరిగిన హింసాకాండ, రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు, ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు ఈడీ, సీబీఐ లాంటి వ్యవస్థలను దుర్వినియోగపరచడం, అనేక సందర్భాలలో అప్రజాస్వామిక వైఖరి ఆయన నాయకత్వాన్ని ప్రశ్నార్థకం చేశాయి. పుల్వామా, పహల్గాం ఉగ్రదాడులు.. 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌తో ప్రారంభించిన యుద్ధాన్ని అంతర్జాతీయ ఒత్తిడితో 4రోజుల్లోనే ముగించాల్సి రావడం ఆయనకు అప్రతిష్ఠను తెచ్చిపెట్టాయి. ఒకప్పుడు మోదీ అత్యంత స్నేహితుడిగా భావించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనకు వ్యతిరేకంగా మారి భారత్‌పై టారిఫ్‌ల దాడి చేసినప్పటికీ చైనా, రష్యాలతో సంబంధాలు పునరుద్ధరించుకోవడం మోదీ దౌత్యనీతికి నిదర్శనం.

సాహసోపేత నిర్ణయాలు..

ప్రధానిగా మోదీ తన 11 ఏళ్ల పదవీకాలంలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారు. జన్‌ధన్ యోజనతో దేశంలో 51 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిపించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజనతో 10 కోట్లకు పైగా మహిళలకు ఉచితవంట గ్యాస్ కనెక్షన్లు అందించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో 2014 నుంచి 2024 వరకు 4.2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. దేశాన్ని అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మార్చడానికి 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టి.. 'ఒకే దేశం- ఒకే పన్ను' కలను సాకారం చేశారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని 2019లో రద్దు చేశారు. అదే ఏడాది చివరిలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. సర్జికల్ స్ట్రైక్స్, 2019 ఎన్నికల ముందు బాలాకోట్ దాడులు.. తాజాగా ఆపరేషన్ సిందూర్‌తో.. దాయాది పాక్‌కు గట్టి బుద్ధి చెప్పగల నేతగా మన్ననలు అందుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం, కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏటా రూ.6 వేలు ఇవ్వడం ద్వారా ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఇరకాటంలో పడేశారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని మోదీ ఇచ్చిన పిలుపునకు ఐరాసలో 177 దేశాల మద్దతు లభించింది.

లోకం తీరు



16వేల మంది విదేశీయులను తిప్పి పంపించే యోచన?

» అక్రమంగా వచ్చినట్టు కేంద్రం గుర్తింపు

» నూతన చట్టం కింద చర్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: దేశంలోకి అక్రమంగా వచ్చిన 16వేల మంది విదేశీయులను తిప్పి పంపించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. అక్రమంగా రావడంతో పాటు, నేరాలు చేసినందుకు వారు ప్రస్తుతం దేశంలోని పలు చోట్ల నిర్బంధంలో ఉన్నట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'వలసలు, విదేశీయుల చట్టం-2025' ప్రకారం వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వీరిలో చాలా మందికి మాదక ద్రవ్యాల సరఫరా, క్రిమినల్ చర్యలతో సంబంధం ఉండడంతో వారిని నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డు (ఎన్‌సీబీ) అదుపులోకి తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. వారిని తిప్పిపంపించే విధానాలను ఖరారు చేసే పనిలో కేంద్ర హోం శాఖ ఉన్నట్టు సమాచారం. ఈ నెల రెండో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టం ప్రకారం దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారిపై కఠిన చర్యలు ఉంటాయి. తప్పుడు పత్రాలతో అక్రమంగా వచ్చేవారికి 2 నుంచి 7 సంవత్సరాల వరకు శిక్ష ఉంటుంది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా కూడా విధిస్తారు. వారి స్వదేశాలకు తిప్పి పంపిస్తారు. వారిని స్వదేశాలకు తిప్పి పంపించే విషయమై కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తోంది. అక్రమంగా వలస వస్తున్నవారి కారణంగా తలెత్తుతున్న వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు అనుసరించే దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా తొలుత వలసదార్లను తిప్పిపంపనుంది. తొలుత ఇప్పటికే నిర్బంధంలో ఉన్నవారిని పంపించే అవకాశం ఉందని తెలిపింది. అక్రమంగా వలస వచ్చిన వారు ప్రభుత్వ పథకాలను కూడా పొందుతుండడంతో నిజమైన పేదలకు అన్యాయం జరుగుతున్నట్టు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మోదీకి ట్రంప్ బర్త్‌డే విషెస్.. థ్యాంక్యూ మై ఫ్రెండ్ అన్న మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు16: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 75వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారని ప్రధాని మోదీ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. థ్యాంక్యూ మై ఫ్రెండ్ అంటూ ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు. " భారత్-అమెరికా దేశాల మధ్య భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చేందుకు మీలాగే(ట్రంప్) నేను కూడా కట్టుబడి ఉన్నాను" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, ఉక్రెయిన్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ట్రంప్ చేస్తున్న కృషికి తమ మద్దతు ఉంటుందని మోదీ తెలిపారు. కాగా, అదనపు సుంకాల నేపథ్యంలో ట్రంప్, మోదీ మధ్య దూరం పెరగ్గా.. ఇరువురు నేతలు మాట్లాడుకోవడం జూన్ 17 తర్వాత ఇదే తొలిసారి.

న్యూయార్క్‌టైమ్స్‌పై లక్ష కోట్లకు ట్రంప్ పరువు నష్టం దావా

వాషింగ్టన్, సెప్టెంబరు 16: తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ ట్రంప్ సోమవారం న్యూయార్క్ టైమ్స్ పత్రికపై పరువు నష్టం దావా వేశారు. ఫ్లోరిడా కోర్టులో 15 బిలియన్ డాలర్ల(సుమారు రూ.1.32 లక్షల కోట్లు)కు దావా వేసినట్టు చెప్పారు. చట్టవ్యతిరేక ప్రచారానికి ఆ పత్రిక ఏకైక అతిపెద్ద భాగస్వామిగా మారిందని ఆరోపించారు. రాడికల్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీకి బాకాగా మారిందని విమర్శించారు. దేశ చరిత్రలో దిగజారుడు పత్రికగా మారిందంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తన కుటుంబానికి, వ్యాపారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు.

గే డేటింగ్ యాప్ చేసిన ఘోరం

» కేరళలో బాలుడిపై 14 మంది లైంగిక దాడి

తిరువనంతపురం, సెప్టెంబరు 16: లైంగిక దాడుల నుంచి బాలికలకే కాదు.. ఇటీవల బాలురకు కూడా రక్షణ లేకుండా పోతోంది. కేరళలో అలాంటి దారుణమే జరిగింది. 14 మంది రెండేళ్ల పాటు 16 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనలో 9 మందిని పోలీసుల అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఓ రాజకీయ నాయకుడు, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఓ ఫుట్‌బాల్ కోచ్ ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10వ తరగతి చదువుతున్న ఆ బాలుడు రెండేళ్ల క్రితం ఓ గే డేటింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. అప్పటి నుంచి ఆ బాలుడిపై లైంగిక దాడి జరుగుతోంది. ఆ బాలుడి ఇంటితో పాటు కేరళలోని కాసర్‌గాడ్, కన్నూర్, కోజికోడ్, ఎర్నాకులం తదితర ప్రాంతాల్లో 14 మంది ఆ బాలుడిపై లైంగిక దాడి చేశారు. ఇటీవల ఒక రోజు ఓ అపరిచిత వ్యక్తి తమ ఇంట్లోంచి బయటకు వెళ్లడం గమనించిన బాలుడి తల్లి.. ఆ బాలుడిని ప్రశ్నించగా ఈ ఘోరం వెలుగుచూసింది. బాలుడి ఫిర్యాదు మేరకు 14 మందిపై విడివిడిగా పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

అరబ్-ఇస్లామిక్ 'నాటో' ఏర్పాటు దిశగా అడుగులు

» ఖతార్‌లో ముస్లిం నేతల అత్యవసర భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: నాటో తరహా సైనిక కూటమిని ఏర్పాటు చేయాలని అరబ్, ఇస్లామిక్ దేశాలు ప్రతిపాదించాయి. ఖతార్ రాజధాని దోహాలో జరిగిన ఒక అత్యవసర సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ కూటమికి "అరబ్ నాటో" అనే పేరు పెట్టాలని ఈజిప్టు ప్రతిపాదించింది. దీనికి పాకిస్థాన్, తుర్కియే వంటి దేశాలు కూడా మద్దతు తెలిపాయి. గత వారం ఖతార్‌పై హమాస్ అగ్రనాయకత్వమే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ నేపథ్యంలో అరబ్, ఇస్లామిక్ దేశాలు సోమవారం దోహాలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సమావేశంలో 40కి పైగా ముస్లిం దేశాల నేతలు పాల్గొన్నారు. అరబ్ సైనిక కూటమి ఏర్పాటు చేయాలని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు.

మహాకూటమిలో సిగపట్లు

బిహార్లో కీలక సీట్ల కోసం కాంగ్రెస్ పట్టు!.. 2020లో ఓడిన 51 స్థానాల్లో 37 చోట్ల పోటీకి విముఖత

» ససేమిరా అంటున్న ఆర్జేడీ



పట్నా, సెప్టెంబరు 16: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో 'ఇండీ' కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్(మహాకూటమి)లో సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఎవరికి వారు ఎక్కువ సీట్లలో పోటీచేయాలని తహతహలాడుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్.. ఈసారి సీట్ల సంఖ్య కంటే గెలిచే స్థానాల కోసం కన్నేసింది. గత ఎన్నికల్లో 70 చోట్ల బరిలోకి దిగి.. 19 సీట్లే గెలిచింది. ఈ నేపథ్యంలో ఈ సారి తక్కువ స్థానాలు తీసుకోవాలని ప్రధాన పార్టీ అయిన ఆర్జేడీ సూచిస్తోంది. అయితే ఓడిపోయిన 51 స్థానాల్లో 37 చోట్ల పోటీచేసేందుకు కాంగ్రెస్ కూడా విముఖంగా ఉంది. ఎందుకంటే వాటిలో 21 స్థానాల్లో గత 15 ఏళ్లలో మహాకూటమి పార్టీలేవీ గెలవలేదు. దీంతో ఈ దఫా తక్కువ సీట్లలో పోటీచేసినా.. అవి గెలిచే అవకాశాలు ఉన్నవై ఉండాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార యాత్రతో తమ బలం పెరిగిందని.. దళితులు, ముస్లింలు, ఈబీసీలు, అగ్రవర్ణాల ఓటర్లు నిర్ణయాత్మకంగా ఉన్న సీట్లు తమకివ్వాలని చర్చల సందర్భంగా పట్టుబడుతోంది. 70 స్థానాలకు తగ్గేది లేదని అంటోంది. ఇందుకు ఆర్జేడీ అంగీకరించడం లేదు. బీజేపీతో నేరుగా తలపడిన స్థానాల్లో ఎక్కువ చోట్ల ఆర్జేడీ గత రెండు ఎన్నికల్లోనూ ఓడిపోయింది. ఈసారి వీటిలో కొన్నిటిని కాంగ్రెస్‌కు ఇవ్వజూపుతోంది. 150 స్థానాలకు తక్కువగా తాను పోటీచేసేది లేదని అంటోంది. మిగతా 93 సీట్లను మిగతా మిత్రులు పంచుకోవాలని సూచిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్, ఆర్జేడీ ద్వైపాక్షిక సమావేశాలు జరిపాయి. మిత్రపక్షాలైన సీపీఐ-ఎంఎల్ లిబరేషన్, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, వీఐపీ, ఆర్‌ఎల్‌ఎల్‌పీలను కూడా సర్దుబాటు చేయాల్సి ఉన్నందున.. వాటికి బలహీన స్థానాల్లో కొన్నిటిని కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆయా పార్టీలు ఇందుకు అంగీకరించేందుకు సిద్ధంగా లేవు. గత ఎన్నికల్లో ఎన్డీఏలో ఉన్న వీఐపీ నేత ముకేశ్ సహనీ ఈ సారి మహాకూటమిలోకి వచ్చారు. ఆయన 60 సీట్లు, ఉపముఖ్యమంత్రి పదవి తనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. లిబరేషన్ 40 సీట్లు డిమాండ్ చేస్తోంది. మిత్రపక్షాల తీరుతో విసుగుచెందిన ఆ పార్టీ నేత తేజస్వి యాదవ్.. మొత్తం 243 స్థానాల్లో పోటీచేసే సత్తా తమకుందని ఇటీవల ప్రకటించారు. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్.. మహాకూటమి తరఫున బిహార్ సీఎం అభ్యర్థిని తానేనని రాహుల్ సమక్షంలోనే ప్రకటించుకున్నారు. దీనిపై రాహుల్ ఎలాంటి స్పందనా వ్యక్తంచేయలేదు. ఆయన పేరుపై వ్యతిరేకత లేకున్నా.. తమను సంప్రదించకుండా ఆయన స్వీయ ప్రకటన చేయడంపై మిత్రపక్షాలు కూడా అసంతృప్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం అభ్యర్థి విషయంలో ఎలాంటి గందరగోళం లేదని.. సరైన సమయంలో ప్రకటిస్తామని తేజస్వి చెప్పారు.

బీజేపీకి చిరాగ్ వార్నింగ్!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: బిహార్లో ఎన్డీఏలోనూ సీట్ల సర్దుబాటుపై లుకలుకలు ఏర్పడ్డాయి. గత ఎన్నికల్లో ఒంటరిగా 135 చోట్ల బరిలోకి దిగి.. జేడీయూను తీవ్రంగా దెబ్బతీసిన ఎల్‌జేపీ (రాంవిలాస్) అధినేత, ప్రస్తుత కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్.. ఈసారి మాత్రం ఎన్డీఏతోనే ఉన్నారు. అయితే తన పార్టీకి 40 స్థానాలు కేటాయించాలని కోరుతున్నారు. బీజేపీ మాత్రం 25కి మించి ఇవ్వనని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఓ ఆంగ్ల చానల్‌తో మాట్లాడారు. తాను కూరల్లో ఉప్పులాంటివాడినని సుతిమెత్తగా హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ 20 నుంచి 25 వేల ఓటర్లను ప్రభావితం చేయగల శక్తి తనకుందని స్పష్టంచేశారు.

రూ.200 తీసుకుని మోసం చేశారంటూ తేజస్విపై కేసు

పట్నా, సెప్టెంబరు 16: బిహార్‌లో మరో కొత్త వివాదానికి తెర లేచింది. ప్రతిపక్ష నేత తేజస్వియాదవ్, రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్, ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే రిషి మిశ్రా, కాంగ్రెస్ మాజీ అభ్యర్థి మస్కూర్ అహ్మద్ ప్రభుత్వ పథకం పేరిట తనను మోసం చేశారని గుడియాదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్భంగా జిల్లాలోని సింగ్వారా పోలీస్‌స్టేషన్లో ఈమేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. మాయి-బెహన్ పథకంలో రూ.2,500 వస్తాయని చెప్పి దరఖాస్తు పేరిట తన దగ్గర రూ.200 తీసుకుని మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పైన పేర్కొన్న నేతలందరు దీని వెనుక ఉన్నారని ఆరోపించింది.

అమెరికా, భారత్ వాణిజ్య చర్చలు మళ్లీ షురూ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు మళ్లీ మొదలయ్యాయి. సోమవారమే భారత్‌కు చేరుకున్న అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై మంగళవారం చర్చలు ప్రారంభించారు. తమ సరుకులకు గేట్లు బార్లా తెరవాలని, రష్యా నుంచి చమురు కొనొద్దనే డిమాండ్లతో భారత్‌పై అమెరికా 50శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆయా అంశాలు తేలే వరకు భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు కూడా. ఈ క్రమంలో గత నెల 25 నుంచి జరగాల్సిన ఆరో దశ చర్చలు నిలిచిపోయాయి. అడ్డగోలు సుంకాల ఒత్తిడికి భారత్ తలొగ్గకపోవడం, సుంకాల ప్రభావం పడిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కొత్త మార్కెట్లపై దృష్టిసారించడం నేపథ్యంలో.. అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే చర్చలు పునః ప్రారంభమయ్యాయి. అమెరికా తరఫున ఆ దేశ దక్షిణ, మధ్య ఆసియా సహాయక వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఆధ్వర్యంలోని బృందం, భారత్ తరఫున వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాకేశ్ అగర్వాల్ నేతృత్వంలోని బృందం చర్చలు జరుపుతున్నాయి. ఇరు దేశాల మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం ఉన్నా.. అమెరికాకు చెందిన వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు భారత్ గేట్లు తెరవాలన్న డిమాండ్‌పైనే పీటముడి నెలకొంది. అమెరికా మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులు, పాల పదార్థాలన్నీ దాదాపుగా జన్యుమార్పిడి ఉత్పత్తులు కావడం, తక్కువ ధరకు వచ్చే ఆ ఉత్పత్తులతో మన దేశ వ్యవసాయ, పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉండటంతో.. భారత్ వాటి దిగుమతులకు అంగీకరించడం లేదు. కాగా ఇరుదేశాల మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని భారత వాణిజ్యశాఖ, అమెరికా అధికారులు వేర్వేరుగా ప్రకటించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇకపై ప్రతివారం వర్చువల్ పద్ధతిలో చర్చలు కొనసాగుతాయని, నేరుగా మరోసారి భేటీ అయ్యే తేదీని త్వరలో నిర్ణయిస్తారని వాణిజ్యశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. కాగా, వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్ దిగివస్తోందని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. "అమెరికాపై అన్ని పెద్ద దేశాల కన్నా ఎక్కువ టారిఫ్‌లు విధించే భారత్.. ఇప్పుడు దిగివస్తోంది. భారత్ వేసే సుంకాలు చాలా ఎక్కువ. అవే వాణిజ్యానికి ప్రధాన అడ్డంకులు. ఇలా అధిక సుంకాలు వేసే ఇతర దేశాలతో ఎలా వ్యవహరించామో.. భారత్‌తోనూ అలాగే వ్యవహరించాల్సి ఉంది.." అని పేర్కొన్నారు.

'సిందూర్'తో మసూద్ కుటుంబం చిన్నాభిన్నం

» జైషే మొహమ్మద్ టాప్ కమాండర్ ఇలియాస్ అంగీకారం


మసూద్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్ కుటుంబం చిన్నాభిన్నమైపోయిందని ఆ సంస్థ టాప్ కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించాడు. ఈ మేరకు ఇలియాస్ మాట్లాడిన తాజా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఈ నేలను కాపాడేందుకు మేం పోరుబాట పట్టాం. దీని సరిహద్దులను కాపాడేందుకు ఢిల్లీ, కాబూల్, కాందహార్‌లలో పోరాడాం. సర్వం త్యాగం చేశాం. అయితే, మే 7న భారత దళాలు బహవల్‌పూర్‌పై దాడి చేసి, మౌలానా మసూద్ అజార్ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి' అని ఆ వీడియోలో ఇలియాస్ పేర్కొన్నాడు. పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రం బహవల్‌పూర్‌లో కరాచీ-తొర్ఖం హైవే(ఎన్‌హెచ్-5) వద్ద జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ ఆపరేషనల్ ప్రధాన కార్యాలయం ఉంది. ఇందులో సుమారు 600 మంది ఉగ్రవాదులు ఉంటారు. ఉగ్రవాదులకు తరచుగా శిక్షణ కార్యక్రమాలను ఇందులో నిర్వహిస్తుంటారు.



ఇందిరాపార్కువద్ద ధర్నా చేస్తున్న నీట్ ర్యాంకర్లు, వారి తల్లితండ్రులు

మా స్థానికత ఎక్కడ? మా భవిష్యత్ ఏమిటీ?

- జీవో 33ను రద్దు చేయాలి.. ప్రభుత్వం న్యాయం చేయాలి
- ఇందిరాపార్కువద్ద నీట్ ర్యాంకర్లు, తల్లిదండ్రుల ధర్నా

కవాడిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు శాపంగా మారిన జీవో నం.33ను వెంటనే రద్దు చేయాలని నీట్ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవో వల్ల నష్టపోతున్న నీట్ యూజీ-2025 తెలంగాణ క్వాలిఫైడ్ విద్యార్థులకు న్యాయం చేయడానికి తక్షణమే కౌన్సెలింగ్‌లో ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. జీవోకు ముందు అర్హత ఉన్నా సరే లోకల్ కాదని తిరస్కరించడం దారుణమని, తమకు శాపంగా మారిన లోకల్, నాన్ లోకల్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. 'ప్రభుత్వమా.. మా స్థానికత ఎక్కడ? మా భవిష్యత్ ఏమిటీ? మాకు న్యాయం చేయండి' అంటూ నీట్ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తక్షణమే ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని నీట్ పరీక్ష రాసిన మొత్తం 45 మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేయకుండా తక్షణమే సమస్యను పరిష్కరించి వారి భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


బతుకమ్మపై 'యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్'

- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్' పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. 40 ఏళ్ల లోపు యువత 3-5 నిమిషాలకు మించకుండా వీడియోలను రూపొందించాలని చెప్పారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి రూ.1 లక్ష, కన్సొలేషన్‌గా రూ. 20వేలు చొప్పున (ఐదుగురికి) అందిస్తామని దిల్ రాజు తెలిపారు. ఎంట్రీలను youngfilmmakerschallenge@gmail.com)కి లేదా వాట్సాప్ నం.8125834009కు సెప్టెంబర్ 30లోగా పంపించాలన్నారు.

మణుగూరులో భూతాప విద్యుత్ కేంద్రం

మణుగూరు సమీపంలో పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న భూతాప(జియో థర్మల్) క్షేత్రం జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ కు అనుకూలమని కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ గుర్తు చేసింది. 16 రాష్ట్రాల్లో భూతాప క్షేత్రా లుండటంతో ఆ ప్రాంతాల్లో జియో థర్మల్ ప్లాంట్లు పెట్టడానికి అనుకూలత ఉందని జియో థర్మల్‌పై మంగళవారం జాతీయ పాలసీలో కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 381 ప్రాంతాల్లో భూతాప కేంద్రాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) అధ్యయనాల్లో తేలింది. మణుగూరులోని పగిడేరులో భూతాప విద్యుత్ కేంద్రం అన్వేషణ, అభివృద్ధిపై ఇప్పటికే సింగరేణి ఓఎన్‌జీసీతో ఒప్పందం చేసుకుంది. ఇక్కడ 122 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ పెట్టడానికి అవకాశం ఉందని గుర్తించారు.



14 గేట్ల ద్వారా విడుదలవుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీరు

నేడూ రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

- ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 35.6 మి.మీ వర్షపాతం
- దౌల్తాబాద్‌లో ఇల్లు కూలి దంపతులకు గాయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధ గురువారాల్లో భారీ వర్షాలు, కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ విభాగం తెలిపింది. బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి మెదక్ జిల్లా రేగోడ్ మండలంలో అత్యధికంగా 10.9 సెం.మీ వర్షపాతం రికార్డైంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో రికార్డుస్థాయిలో 35.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అదే మండలం మరలపెల్లి గ్రామవాసి పడగల రాములు ఇల్లు కూలిపోయింది. సింగూరు డ్యాం నుంచి నీరు వదలడంతో ఏడుపాయల గర్భాలయం మూసేశారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్ర వాసి కుమ్మరి పెద్ద లక్ష్మయ్య, శారద దంపతులు నిద్ర పోతుండగా అర్ధరాత్రి ఇల్లు కూలడంతో గాయాల పాలయ్యారు. భయంతో లక్ష్మయ్య దంపతులు కేకలేయడంతో స్థానికులిచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితులను రక్షించి.. 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి వాసులు మానేరు వాగులో ఇసుక నింపుతుండగా ఎగువన లోయర్ మానేరు డ్యామ్ నుంచి పెరిగిన వరదకు 6 ట్రాక్టర్లు కొట్టుకుపోగా, ఒక మహిళ సహా 8 మంది చిక్కుకున్నారు. స్థానికులు, పోలీసుల సాయంతో తాళ్లతో వారిని రక్షించారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

ఐదోసారి సాగర్ గేట్లు ఎత్తివేత

కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం 1.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 83,262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు, తుంగభద్ర నుంచి సుంకేశుల రిజర్వాయర్‌కు 35 వేల క్యూసెక్కులు, శ్రీశైలానికి 31 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాగా, సోమవారం గేట్లు మూసేసిన నాగార్జున సాగర్‌కు వరద పోటెత్తడంతో ఈ ఏడాది ఐదోసారి మంగళవారం 14 గేట్లు ఎత్తివేశారు. ఎగువ నుంచి 1,62,968 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు అంతే మొత్తం నీరు విడుదల చేశారు. ఎగువన ఆల్మట్టికి 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 25 వేల క్యూసెక్కులు, నారాయణపూర్ రిజర్వాయర్‌కు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, దిగువకు 26 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా, ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భారీగా వరద పోటెత్తడంతో సింగూరు ప్రాజెక్టుకు 47,788 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 50,751 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు కాగా, సంగారెడ్డి సమీపంలోని మంజీరా రిజర్వాయర్‌కు వచ్చిన వరద నీటిని యథాతథంగా దిగువన ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

పొంగులేటి.. లక్కీ లాటరీలో మంత్రి!



- పాలేరులో ఆయనెలా గెలుస్తారో చూద్దాం?
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్‌ఎస్‌దే గెలుపు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంతే.. గారెలబుట్టలో పడినట్టు లక్కీలాటరీలో మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దామని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల తో భేటీ అయిన ఆయన.. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల్లో దొరికిన డబ్బు గురించి కేంద్రంగానీ, ఆయనగానీ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించా రు. "పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యారా? బీజేపీతో కుమ్మక్కైన రేవంత్ రెడ్డితో పొంగులేటి కలిసిపోయారా?"అని నిలదీశారు. బతికినంత కాలం ధైర్యంగా బతకాలని.. ఇంత నీచమైన కుమ్మక్కు రాజకీయాలు పనికిరావని అన్నారు. ఎవరెన్ని తమాషాలు చేసినా ఉప ఎన్నికలు తప్పవని..కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజన్‌గా మార్చిన బీఆర్ఎస్ పాలనకు భిన్నంగా.. కాంగ్రెస్ సర్కార్ విధానాలు రాజధాని నగర ప్రతిష్ఠను దెబ్బ తీస్తున్నాయని.. ప్రజలు ఇది గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్.. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి సృష్టించిన భయం కారణం గా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నా రు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై నిర్వహించిన బీఆర్‌ఎస్‌పార్టీ సన్నాహక సమావేశానికి కేటీఆర్ అధ్యక్షత వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి, బీఆర్ఎస్ విజయయాత్రను జూబ్లీహిల్స్ నుంచి తిరిగి ప్రారంభించాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు.

ఇంత అసమర్థ పాలన ఎక్కడైనా ఉందా?

"సర్కార్ ఘోర తప్పిదంవల్ల ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఆరుగురు మరణిస్తే.. వారి మృతదేహాలను బయటకు తీయలేక చేతులెత్తేశావ్. చివరికి హైదరాబాద్‌లో నాలా లో కొట్టుకుపోయిన ముగ్గురి పార్థివదేహాలను మూడురోజులైనా గుర్తించలేవా?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఇంత చేతకానితనం, అసమర్థపాలన ఎక్కడైనా ఉందా?అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు అంటే బీజేపీకి గౌరవంలేదని.. అందుకే వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను స్వాగతించిన బీఆర్ఎస్‌ను ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీజేపీది నకిలీజాతీయవాదమని, తమది మా త్రం ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయవాదమని మంగళవారం ఎక్స్‌వేదికగా వెల్లడించారు. కాగా.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీల ఓట్లను సీఎం రేవంత్ రెడ్డి బీజేపీకి అమ్ముకున్నారని.. ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు ఎంపీలు తనకు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఓట్ చోరీ గురించి మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణ సీఎం ఓట్ చోరీ గురించి ముందు తెలుసుకోవాలన్నారు.

ఆగని పశువుల అక్రమ రవాణా

ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు పశువులను చేరవేస్తున్న అక్రమార్కులు

- లారీలు, వ్యాన్‌లలో పరిమితికి మించి తరలింపు
- ఊపిరాడక మృతి చెందుతున్న ఆవులు, దూడలు



కుమరం భీం జిల్లా నుంచి లారీలో పరిమితికి మించి పశువులను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా నుంచి పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. జిల్లా నుంచి ప్రతియేటా వేలాది పాడి పశువులు, వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులు కబేళాలకు తరలిపోతున్నాయి. పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పశువుల వ్యాపారులు జిల్లాకు చెందిన స్మగ్లర్లతో చేతులు కలిపి దొడ్డిదారిన నిత్యం లారీలు, వ్యాన్‌లలో పశువులను అర్ధరాత్రి వేళ సరిహద్దులు దాటించేస్తున్నారు. జిల్లాలో కౌటాల, జైనూరు, వాంకిడి మండలం గణేశ్‌పూర్, రెబ్బెన ప్రాంతాల్లో ప్రతి వారం పశువుల సంతలు నిర్వహిస్తుంటారు. సరిహద్దున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ సంతలు నిర్వహిస్తుంటారు. రైతుల ఆర్థిక అవసరాలను బట్టి ఒక్కో పశువుకు మూడు వేల నుంచి 10 వేల రూపాయల వరకు ముట్టజెప్పి కొనుగోళ్లు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో చాలామట్టుకు ఆవులు, లేగదూడల కొనుగోళ్లు అధికంగా జరుగుతున్నాయి. అదే సమయంలో వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులను కూడా వ్యాపారులు ఐదు వేల నుంచి 15 వేల రూపాయల మధ్య చెల్లించి కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. పశువుల సంతల్లో స్మగ్లర్లు నేరుగా కాకుండా బ్రోకర్ల ద్వారా వ్యవసాయం, పాడి అవసరాల కోసమని రైతులకు చెబుతూ కొనుగోలు చెస్తున్నట్లు పలు సందర్భాల్లో అధికారులు జరిపిన విచారణలో తేలింది. అధికారులు నిఘా తీవ్రతరం చేసిన సందర్భాల్లో స్మగ్లర్లు కొంతకాలం తమ అక్రమ దందాను కొనసాగించడం లేదు. కొన్ని రోజులు పోగానే మళ్లీ పశువులు కొనుగోలు చేస్తూ కబేళాలకు తరలిస్తున్నారు. మామూళ్లకు అలవాటుపడిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో గోవధ నిషేధ చట్టం సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పశువుల అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీ చేయకుండా స్మగ్లర్లు అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి దందాను సాగిస్తున్నారు. ఫిర్యాదులు వస్తేనే అధికారులు వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. పైగా అక్రమార్కులు ఆవులు, దూడలు, ఎద్దులను వ్యాన్లు, లారీల్లో పరిమితికి మించి కుక్కి తీసుకెళ్తుండడంతో ఊపిరాడక చాలా పశువులు మార్గమధ్యలోనే మృతి చెందుతున్నట్లు ఇటీవల గుర్తించారు. కొద్దిరోజుల క్రితం మహారాష్ట్ర నుంచి కరీంనగర్ జిల్లా జగిత్యాలకు మూడు వ్యాన్లలో 43 పశువులను తరలిస్తుండగా అందులో తొమ్మిది ఊపిరాడక మృతి చెందాయి. అధికారులు తనిఖీలు తీవ్రతరం చేసి పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టా కావడం లేదని రైతు ఆత్మహత్య

- అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగి వేసారిన రైతు
- మనస్తాపంతో బలవన్మరణం
- జనగామ జిల్లా గోవర్ధనగిరిలో ఘటన



వెంకటయ్య(ఫైల్)

రఘునాథపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమి తన పేరున మార్చుకోవడానికి ఏడేళ్లుగా అధికారులు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముసిపట్ల వెంకటయ్య (54)కు తన తండ్రి ఒక ఎకరం వ్యవసాయ భూమిని పంచి ఇచ్చాడు. తండ్రి ఇచ్చిన భూమిలో 25 గుంటలు మాత్రమే వెంకటయ్య పేరుపై పట్టా అయింది. మిగతా 15 గుంటల భూమి కొన్ని సాంకేతిక కారణాలతో పట్టా కాలేదు. దీంతో రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు వెంకటయ్య ఫిర్యాదు చేశాడు. కోర్టును కూడా ఆశ్రయించాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటయ్యకు భార్య రాజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మాజీ సీఎస్ ఎస్కే జోషికి హైకోర్టులో ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దంటూ ఉత్తర్వులు



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రిటైర్డు ఐఏఎస్ శైలేంద్ర కుమార్ జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ చేపట్టే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొంది. రిటైర్డు ఐఏఎస్ ఎస్కే జోషి బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శిగా పని చేశారు. తనకు నోటీసులు ఇవ్వకుండా, తన వాదన వినకుండా పీసీ ఘోష్ కమిషన్ తనకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చిందని సహజ న్యాయసూత్రాలు, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్న ఆ నివేదికను కొట్టేయాలని ఎస్కే జోషి కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై మంగళవారం మరో సారి విచారణ చేపట్టింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోమని ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ధర్మాసనానికి ఈ సందర్భంగా తెలిపారు. కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించామని తెలియజేశారు. మరోవైపు గత విచారణ సందర్భంగా కమిషన్ నివేదిక మీ చేతికి ఎలా వచ్చిందని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన వివరాలతో ఎస్కే జోషి అఫిడవిట్ దాఖలు చేశారు. వివరాలను పరిశీలించిన ధర్మాసనం.. కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్కే జోషిపై ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం ఇంకా ఎలాంటి చర్యలు మొదలుపెట్టక ముందే తనపై చర్యలు తీసుకుంటారని పిటిషనర్ భావించడం ఆందోళన మాత్రమేనని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను అక్టోబరు 7కు వాయిదా వేసింది.

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది.

కన్నవారిని వెతుక్కుంటూ.. స్వీడన్ నుంచి వరంగల్‌కు

- రెండేళ్ల వయసులోనే తల్లిదండ్రులకు దూరం
- దత్తతతో విదేశాలకు.. 2009 నుంచి
- ఐదుసార్లు వచ్చి అన్వేషణ



స్వీడన్ నుంచి వరంగల్‌కు వచ్చిన సంధ్యారాణిని అభినందిస్తున్న పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, తదితరులు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సుమారు 36 ఏళ్ల క్రితం.. రెండేళ్ల చిన్నారి తల్లిదండ్రులకు దూరమైంది.. ఓ అనాథాశ్రమానికి చేరింది.. దత్తతతో దేశం దాటింది.. అక్కడే పెరిగి పెద్దయిన ఆమె ఇప్పుడు తన తల్లిదండ్రులు ఎవరో తెలుసుకోవడానికి తండ్లాడుతోంది.. గత పదహారేళ్లలో ఐదుసార్లు రాష్ట్రానికి వచ్చింది.. తన మూలాలు ఉన్నట్టు తెలిసిన వరంగల్ శివనగర్ ప్రాంతంలోని పద్మశాలి సంఘాల ప్రతినిధులను కలిసి ఆరా తీసింది. ఆమె సంధ్యారాణి. "మా తల్లిదండ్రులు బి.రాజ్‌కుమార్, అనసూర్య. కొందరు మాతల్లి చనిపోయిందని అంటున్నారు. సుమారు 36 ఏళ్ల క్రితం నాన్న నన్ను తీసుకొని హైదరాబాద్‌లోని ప్రేమ్‌నగర్‌కు వెళ్లారు. ఓ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేశారు. నిజాం కాలేజీ తోటమాలి రామయ్యతో పరిచయం ఏర్పడింది. ఆయన మరదలు విజయను మా నాన్నకు ఇచ్చి వివాహం చేశారు. కానీ మూడు నెలల తర్వాత నాన్న నన్ను విజయ దగ్గర వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయారు. విజయ నన్ను విజయనగర్ కాలనీలోని సేవా సమాజం-బాలిక నిలయం ఆశ్రమంలో చేర్పించారు. స్వీడన్‌కు చెందిన లిండ్‌గ్రేన్ నన్ను దత్తత తీసుకుని ఆ దేశానికి తీసుకెళ్లారు. కానీ పెద్దయ్యాక నాకు అసలు విషయం తెలిసింది. పైచదువుకోసం యూకే వెళ్లాక ఓ స్నేహితుడి ప్రేరణతో నా అసలు తల్లిదండ్రుల గురించి అన్వేషణ మొదలుపెట్టాను. 2009 నుంచి ఐదు సార్లు ఇక్కడికి వచ్చాను. నాది పద్మశాలి సామాజికవర్గమని, వరంగల్ శివనగర్‌లో మూలాలు ఉన్నాయని తెలుసుకుని ఇక్కడికి వచ్చాను. తల్లిదండ్రులను కలుసుకుంటాననే నమ్మకముంది" అని సంధ్యారాణి కన్నీళ్ల పర్యంతమయ్యారు.

పోస్టల్ సర్కిల్ చీఫ్‌గా వీణాకుమారి



డాక్టర్ వీణా కుమారి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా డాక్టర్ వీణా కుమారి డెర్మల్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈమె 1998 బ్యాచ్‌కు చెందిన భారతీయ పోస్టల్ సర్వీస్ అధికారి. గతంలో ఇండియన్ పోస్టల్ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (పీఎంయూ)గా పనిచేసిన వీణా కుమారి, దేశవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) 2.0 విస్తరణలో కీలక పాత్ర పోషించారు. ఆమె తన 27 ఏళ్ల సర్వీసులో పోస్టల్ శాఖలో ఆధునిక సాంకేతికను, సంస్కరణలను ప్రవేశపెట్టి, దేశవ్యాప్తంగా ఉన్న 1.5 లక్షల పోస్టాఫీసుల్లో వాటిని విజయవంతంగా అమలు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ చూపుతోనే సెప్టెంబర్ 17 సార్థకత!

'కొందరు ఆగమంటే ఒప్పుకోని చరిత్రా! / పద ముందుకు!' అంటూ తెలంగాణ ఇతిహాస సత్యాన్ని కవి కుందుర్తి ఆవిష్కరించారు. చరిత్ర చేసిన నష్టానికి పరిహారంగా తెలంగాణకు కాలం ప్రసాదించిన వరమే హైదరాబాద్. డెబ్బై ఎనిమిది సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే రోజున నాటి తెలంగాణ జనకోటి శతాబ్దాల రాచరిక పెత్తనాల నుంచి బయటపడి ప్రజాస్వామ్య పాలన దిశగా నిర్ణయాత్మక ముందడుగువేసింది. మధ్యయుగాలలో ఒక సామాన్య నగర స్థాయి నుంచి ఆధునిక ప్రపంచ నగరంగా పరిణమించి, ప్రస్తుతం నవ్యాతి నవ్య సాంకేతికతల సృష్టికి నెలవయిన సిలికాన్ వ్యాలీని మించి నవకల్పనల కేంద్రంగా ఎదగగలననే ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్న తెలుగు నగరం హైదరాబాద్.

మేధోభాగ్యనగరిగా విలసిల్లుతున్న హైదరాబాద్ వైభవం 1990ల్లో ప్రవేశించిన ఐటీ సాంకేతికతలతో ఆరంభమయిందని సామాన్యులతో పాటు విద్యావంతులు సైతం భావిస్తుంటారు. అయితే ఇది నిజం కాదు. భారతదేశ ఐదో పెద్ద నగర ప్రగతి ప్రస్థానం ఒక శతాబ్ది కిందటే ప్రారంభమయింది. ఇరవయో శతాబ్ది ఆరంభంలో బ్రిటిష్ అధికారులతో పాటు ఉత్తర, పశ్చిమ భారతావని నుంచి వచ్చిన వారితో హైదరాబాద్ రాజ్యంలో ఆధునికీకరణ ప్రక్రియలు మొదలయ్యాయి. 1908లో మూసీ నది వరద విపత్తుతో కుదేలయిన నగరాన్ని పునర్నిర్మించేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపొందించిన ప్రణాళికను నిజాం ప్రభుత్వం అమలుపరిచింది. అదే కాలంలో ఐరోపాలోని గొప్ప నగరాలకు సమరీతిలో హైదరాబాద్‌ను రూపొందించాలన్న ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముందు చూపు ఫలితంగా సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదలైన సంస్థలు ప్రభవించాయి. మొదటి ప్రపంచయుద్ధం పారిశ్రామిక పరిశోధనలకు ఉద్దీపన అయింది. యూరోపియన్ ఖగోళ శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చిన ఖగోళ పరిశోధనలు, నోబెల్ పురస్కారాన్ని సాధించిన వైద్యశాస్త్ర పరిశోధనలు ఆనాడు హైదరాబాద్‌లో జరిగాయి. 1948 అనంతరం వైజ్ఞానిక, సాంకేతిక పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ కేంద్రంలోని నెహ్రూ ప్రభుత్వం అమలుపరిచిన విధానాలు, హైదరాబాద్‌లో లభ్యమైన ప్రత్యేక సానుకూల పరిస్థితులు, ప్రభావశీల వ్యక్తుల పలుకుబడితో హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ 1990 అనంతరం ప్రపంచీకరణ విధానాలతో వేగవంతమైన ఆర్థిక పురోగతికి విశేషంగా దోహదం చేశాయన్న వాస్తవం విస్మరించలేనిది. కోవిడ్ విపత్తు కాలంలో వ్యాక్సిన్ల తయారీకి హైదరాబాద్ ప్రధాన కేంద్రం కావడం ఆ సానుకూల పరిణామాల ఫలితమే అనడంలో సందేహం లేదు.

ఈ ప్రగతిశీల చరిత్రలో మరీ ముఖ్యంగా గమనార్హమైన వాస్తవం ఒకటి ఉన్నది. అమానుష భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు పల్లె తెలంగాణలోని చైతన్యశీల సామాన్యులు ఎంత మొక్కవోని దీక్ష, త్యాగశీలతతో పోరాడారో 'పట్నం' తెలంగాణలోని విద్యావంతులు, శాస్త్రవేత్తలు జనహిత అధికార ప్రముఖులు అంతే దృఢ సంకల్పంతో, స్వార్థరహితంగా హైదరాబాద్‌ను నవీన వైజ్ఞానిక పరిశోధనల, సాంకేతికతల నెలవుగా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అంకిత భావంతో కృషి చేశారు. ఈ విద్యాధికులు, వైజ్ఞానికులలో అత్యధికులు హైదరాబాద్ వెలుపలి ప్రాంతాలకు చెందినవారే. ఉస్మానియా విశ్వవిద్యాలయ భావనకు అంకురార్పణ చేసి, దాని ఆధారంగా ఒకనాడు విద్వత్ కేంద్రంగా వెలుగొందిన బాగ్దాద్‌లా హైదరాబాద్‌ను ప్రపంచ మేధో కేంద్రంగా అభివృద్ధిపరచాలని కలలుగన్న ఉదాత్తులే అందుకొక నిదర్శనం. నిజాం నవాబు పాలన దౌష్ట్యాలపై కుల మతాలకు అతీతంగా తిరగబడిన వీర తెలంగాణ త్యాగధనులవలే ఈ విద్వత్ తెలంగాణలోని వారూ తమ వ్యక్తిగత బాంధవ్యాలలో గానీ, సామాజిక సంబంధాలలో గానీ, వృత్తిగత వ్యవహారాలలోగానీ కుల మతాల సంకుచిత పరిమితులను అధిగమించినవారే. వీర తెలంగాణ యోధులతో పాటు ఈ విద్వత్ పరులు, వైజ్ఞానికులను ఈ సందర్భంగా సంస్మరించుకుని గౌరవించాలి. ఇదే సమయంలో, నేటి స్వార్థ ప్రయోజనాలకు వీర తెలంగాణ చరిత్రపై మతం మరకలు వేసేందుకు జరుగుతోన్న ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా రూపొందేందుకు కారకులైన వారందరూ ముఖ్యంగా తొలినాళ్లలో మేధో శ్రమను జీవనశైలిగా చేసుకోవాలనే సంకల్పం, తమ కృషి సమాజ శ్రేయస్సుకు తోడ్పడేదికావాలన్న లక్ష్యమూ ఉన్నవారే. బహుళ మేధో రీతులలో లక్ష్య సంకల్పాలలో ఏకత్వాన్ని సమష్టిగా ఆచరించిన ఆదర్శప్రాయులు. మరింత సమున్నతంగా ఈ బహుళ ఏకత్వాన్ని హైదరాబాద్ నగర గంగా-జముని తెహజీబ్‌తో మేళవించినప్పుడే సెప్టెంబర్ 17కు స్ఫూర్తిదాయక సార్థకత సమకూరుతుంది. మేధోభాగ్యనగరి సకల మనుషులను సమదృష్టితో ప్రేమించే, గౌరవించే సమాజంగా కూడా వర్ధిల్లుతుంది.

అభినవ విశ్వకర్మ.. నరేంద్ర మోదీ!

సెప్టెంబర్ 17– దేశ చరిత్రలో ప్రత్యేకమైన సందర్భం. ఇది దేశ ప్రజల ఆకాంక్షలకు సరికొత్త రూపాన్ని ఇచ్చిన విశేషమైన రోజు. మన పురాణేతిహాసాల ప్రకారం.. బ్రహ్మదేవుడి సృష్టి ఆలోచనకు అనుగుణంగా విశ్వాన్ని నిర్మించిన భగవాన్ విశ్వకర్మ జయంతి. భవనాలు, ఆయుధాలతో పాటుగా చేతివృత్తుల వ్యవస్థ సృష్టికర్త కూడా ఆయనే. మరోవైపు, దేశ స్వాతంత్ర్యానికి 13 నెలల తర్వాత 1948లో ఇదే రోజు హైదరాబాద్ సంస్థానానికి నిజాం నిరంకుశత్వం నుంచి రజాకార్ల క్రూరత్వం నుంచి విమోచనం లభించింది. నాటి హైదరాబాద్ సంస్థానం ప్రజల పోరాటం, భారతదేశ ప్రథమ హోంమంత్రి సర్దార్ పటేల్ చేపట్టిన 'ఆపరేషన్ పోలో' కారణంగా, హైదరాబాద్ డెక్కన్ ప్రాంతం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. ఇది జరిగిన రెండేళ్ల తర్వాత 1950 సెప్టెంబర్ 17న, నరేంద్రమోదీ జన్మించారు. ఇది యాదృచ్ఛికమే. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత జన్మించిన తొలి ప్రధానిగా, గత 60 ఏళ్లలో వరుసగా



మూడుసార్లు అద్భుతమైన ప్రజాశీర్వాదంతో ప్రధానమంత్రి పగ్గాలు చేపట్టిన ఏకైక వ్యక్తి మోదీ.

భగవాన్ విశ్వకర్మ జయంతి అయినా, ప్రధాని మోదీ జన్మదినమైనా, తెలంగాణ విమోచన దినమైనా.. ఏకైక సమన్వయ అంశం 'సెప్టెంబర్ 17'. ఈ మూడు అంశాలకు, నరేంద్రమోదీ ఆలోచనకు బలమైన సంబంధం ఉంది. కృష్ణుడి కోరిక మేరకు భగవాన్ విశ్వకర్మ ద్వారకను నిర్మించాడు. పాండవులు, కౌరవుల కోసం హస్తినాపురాన్ని కట్టించి ఇచ్చాడు. విష్ణుమూర్తి సుదర్శన చక్రం విశ్వకర్మ కళానైపుణ్యానికి ఒక ఉదాహరణ. విశ్వకర్మ పంచ ముఖాల్లో ఒక్కో ముఖం ఒక్కో చేతి వృత్తి సమాజానికి ఆజ్యం పోసిందని పురాణాల్లో స్పష్టంగా ఉంది. ఇలా ఐదు ముఖాలు కమ్మరి, వడ్రంగి, ఇత్తడి పనివారు, శిల్పులు, స్వర్ణకారుల వ్యవస్థకు ఆజ్యం పోశాయి. అందుకే మన చేతివృత్తుల కళలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఒక్కసారి వర్తమానంలోకి వస్తే, 2014లో మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ కళలకు, మన భారతీయ యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. చేతివృత్తుల రంగానికి సరైన ప్రోత్సాహాన్ని అందించేందుకు 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చారు. మన కళాకారుల నైపుణ్యాన్ని పెంచడంతోపాటు మన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ దారిని సుగమం చేసేందుకు ఈ పథకం ఎంతో తోడ్పడుతోంది. ఇది పక్కా ప్రణాళికతో.. అభినవ విశ్వకర్మ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం.



విశ్వకర్మ జయంతికి, అభినవ విశ్వకర్మ నరేంద్రమోదీ జన్మదినానికి, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న అద్భుతమైన ఘట్టానికి 'సెప్టెంబర్ 17' ఓ ఇరుసుగా ఉంది. తెలంగాణ ప్రజలతో పాటు యావద్భారతానికి ఇది పండగ రోజు. దీనిని ఉత్సాహంగా జరుపుకుందాం.

ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన 11 ఏళ్లలో దేశంలో మూలధన వ్యయంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణంలో 60 శాతం పెరుగుదల నమోదైంది. ఆపరేషనల్ విమానాశ్రయాలు 160కి పెరిగాయి. 1,275 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ జరిగింది. ఇదంతా వికసిత భారత 'విశ్వకర్మ' అయిన మోదీ 'ఆత్మనిర్భర భారత్' సంకల్ప సాకారంలో ఒక భాగం. నాడు దేవతల కోరిక మేరకు విశ్వకర్మ 'స్వర్గాన్ని' నిర్మిస్తే.. నేడు మోదీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'వికసిత భారతం' నిర్మాణంపై ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తున్నారు.

అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూనే దేశంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన వివిధ జాడ్యాలను తొలగించేందుకు రంగంలోకి దిగారు మోదీ. 15 ఆగస్ట్, 2022 నాడు.. దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రకోట నుంచి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. 'పాంచ్ ప్రాణ్' గురించి ప్రస్తావించారు. అవి.. అభివృద్ధి చెందిన భారతదేశం, బానిసత్వపు ఆలోచనలను తొలగించుకోవడం, మన సాంస్కృతిక–వారసత్వ మూలాల పట్ల గర్వపడటం, ఐకమత్యంతో ఉండటం, పౌరులందరూ తమ బాధ్యతను సరిగ్గా నిర్వర్తించడం. ఇంతకుముందే.. దేశాభివృద్ధి గురించి చెప్పాను. ఇందులో మనం చర్చించుకోవాల్సిన మరో అంశం.. మనలోని బానిసత్వ భావనలను తొలగించుకోవడం. దేశానికి స్వాతంత్ర్యం ఇద్దామనుకున్నప్పటి నుంచి 'మైనారిటీల బుజ్జగింపు' అనేది మనకు బ్రిటిషర్ల నుంచి అంటుకున్న జాడ్యం. దాదాపు 8 దశాబ్దాలైనా ఇంకా దీని నుంచి బయటపడలేదు. ఇదే విషయం హైదరాబాద్ విమోచన విషయంలోనూ, రాజకీయ పార్టీల ఆలోచనలు, వీటిని ప్రజల్లో జొప్పించేందుకు జరుగుతున్న కుట్రల్లో స్పష్టంగా కనబడుతోంది.

హైదరాబాద్ విమోచన ఉద్యమం విషయానికొస్తే– ప్రజలు ప్రాణాలకు తెగించి, రజాకార్ల అకృత్యాలను ఎదిరించి.. పటేల్ సహకారంతో స్వాతంత్ర్యాన్ని పొందితే, దీన్ని దుర్మార్గపు పాలన నుంచి విమోచనం అని చెప్పేందుకు కూడా ఈ బానిస మెదళ్లు అంగీకరించడం లేదు. భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం 'విలీనం' అని చిన్న మాటతో.. లెక్కలేనన్ని త్యాగాలను తక్కువచేసి చూపించేందుకు ప్రయత్నించారు. మాటల్లో వివరించేందుకు, రాతలతో చెప్పేందుకు వీలుకాని.. నిజాం, రజాకార్ల క్రూరత్వాన్ని నేటితరానికి తెలియకుండా చేసేందుకు, మైనారిటీల బుజ్జగింపు విధానాన్ని నరనరానా జీర్ణించుకుని పనిచేస్తున్న కొన్ని శక్తుల కుట్ర ఇది. కానీ, మాటల్లోనే కాదు చేతల్లోనూ జాతీయవాదాన్ని ప్రదర్శించే ప్రధాని మోదీ, 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' ఉత్సవాల్లో భాగంగా అధికారంగా 'హైదరాబాద్ విమోచన ఉత్సవాల'ను నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే.. 2022, సెప్టెంబర్ 17న.. అంటే.. 75 ఏళ్ల తర్వాత తెలంగాణ గడ్డపై కేంద్ర హోంశాఖ మంత్రి చేతుల మీదుగా జాతీయ జెండా ఎగిరింది.

రజాకార్ల దమనకాండకు ప్రత్యక్ష సాక్షి.. మాజీ భారత ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు. వరంగల్ జిల్లాలోని రంగాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో రజాకార్లు జనాలను చంపిన తీరును 'దక్షిణ భారతదేశపు జలియన్‌వాలాబాగ్'గా ఆయన అభివర్ణించారు. కొమురం భీమ్, మర్రి చెన్నారెడ్డి, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయణరావు పవార్, స్వామి రామానందతీర్థ, గోవింద్‌భాయ్ ష్రాఫ్, విజయేంద్ర కాబ్రా, పీహెచ్ పట్వర్ధన్ లాంటి ఎందరో మహనీయులు నాడు తమ ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు. తరాలు మారుతున్న క్రమంలో వీరి పోరాట స్మృతులకు పాఠ్యపుస్తకాల్లో సరైన చోటు కల్పించకపోవడం.. గత, ప్రస్తుత పాలకుల బానిసవాద ఆలోచనలకు ఒక ఉదాహరణ. కానీ, 1996 నుంచి బీజేపీ ఆధ్వర్యంలో.. తెలంగాణ విమోచన ఉత్సవాలను నిర్వహిస్తున్న కారణంగా.. గ్రామగ్రామాన వాస్తవ చరిత్రపై అవగాహన, ఆసక్తి పెరుగుతున్నాయి. 2022 నుంచి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్న విమోచన వేడుకలు తెలంగాణ ప్రజల మనసుల్లో బానిసత్వ భావనలను పెంపొందించేందుకు జరిగిన కుట్రలను పటాపంచలు చేశాయి. ఇది విలీనం కాదు, ముమ్మాటికీ విమోచనమేని.. యావద్భారతం పక్షాన తెలంగాణ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ స్పష్టం చేశారు.

అందుకే.. విశ్వకర్మ జయంతికి, అభినవ విశ్వకర్మ నరేంద్రమోదీ జన్మదినానికి, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న అద్భుతమైన ఘట్టానికి 'సెప్టెంబర్ 17' ఓ ఇరుసుగా ఉంది. తెలంగాణ ప్రజలతో పాటు యావద్భారతానికి ఇది పండగ రోజు. దీనిని ఉత్సాహంగా జరుపుకుందాం. భగవాన్ విశ్వకర్మ ప్రేరణతో మన చేతివృత్తులకు సరైన ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు ప్రధాని నరేంద్రమోదీ సమర్థ నాయకత్వంలో బానిసత్వపు ఆలోచనలను తొలగించుకుంటూ.. వికసిత భారత నిర్మాణంలో మనమంతా స్వచ్ఛందంగా భాగస్వాములం అవుదాం. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో దేశాభివృద్ధికి పునరంకితం అవుదాం.

• జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

బిహార్‌ను మోదీ మ్యాజిక్ ఆకట్టుకునేనా?



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'బిహార్‌లో చొరబడిన ప్రతి ఒక్కరూ వెళ్లిపోవాల్సిందే.' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం బిహార్‌లో పూర్ణియా జిల్లాలో మాట్లాడుతూ అన్నారు. బిహార్‌లో గత జనవరి నుంచి మోదీ ఏడవ పర్యటన ఇది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోదీ అక్కడి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తన ఎన్నికల ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటారు. బిహార్‌లో తన ప్రచారాన్ని ఏ దిశన మళ్లించబోతున్నారో ఇప్పటికే స్పష్టమైంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరిట అనేక మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఉధృతంగా చేపట్టిన ప్రక్రియను ప్రతిపక్షాలు మాత్రమే కాదు, సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది. మొత్తం ఎస్ఐఆర్‌నే నిలిపివేస్తాం జాగ్రత్త అని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది.


ఎస్ఐఆర్‌ను వివాదరహితంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైంది. ఓట్ల చోరీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కమిషన్ వద్ద స్పష్టమైన సమాధానాలు లేవు. నిజానికి ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువ చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితి నుంచి బీజేపీని కాపాడాల్సిన బాధ్యతను మోదీయే పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. అక్రమ వలసదారుల వల్ల బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు తమ కూతుళ్లు, చెల్లెళ్ల భద్రత పట్ల ఆందోళనతో ఉన్నారని మోదీ ప్రకటించారు. అంటే అక్రమంగా వలసవచ్చిన వారు ఈ రాష్ట్రాల్లో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన సారాంశం. పైగా ఇలాంటి వారిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, యాత్రలు కూడా చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను ఉద్దేశంలో ఉంచుకునే ఆయన ఈ విమర్శలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఉత్తరాదిన అత్యంత కీలక ప్రభావం చూపే బిహార్‌లో మాత్రం బీజేపీ గత కొన్ని దశాబ్దాలుగా విశ్వయత్నాలు చేస్తున్నప్పటికీ స్వంతంగా అధికారంలోకి రాలేని స్థితి ఉన్నది. మండల్ రాజకీయాలు ప్రవేశించిన తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్ ఆవిర్భావంతో ఓబీసీలు, మైనారిటీలు సంఘటితమయ్యారు. 1995లో జార్జి ఫెర్నాండెజ్, నితీశ్ కుమార్‌తో కలిసి లాలూతో వేరుపడ్డ తర్వాత కూడా 2005 వరకు లాలూ ఆధిపత్యాన్ని తగ్గించలేకపోయారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో, 2000లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫెర్నాండెజ్, నితీశ్ కుమార్‌లు ఇద్దరూ బీజేపీతో చేతులు కలిపారు. అప్పటికి లాలూ పశుగ్రాసం కుంభకోణంలో చిక్కుకుని తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేయాల్సి వచ్చింది. 2000లో నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి అయినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవడంతో మళ్లీ రబ్రీదేవి ముఖ్యమంత్రి అయి 2005 వరకు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్డీఏలో నితీశ్‌కుమార్ తిరుగులేని నాయకుడయ్యారు. 2010లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీ(యు) 115 సీట్లు సాధించగా, బీజేపీ 91 సీట్లు సాధించింది.

కానీ బీజేపీలో క్రమక్రమంగా ఒక ప్రత్యామ్నాయ నాయకుడుగా నరేంద్రమోదీ అవతరిస్తున్న క్రమంలో నితీశ్‌కుమార్ మొదట్లో ఆయనను సరిగా అంచనా వేయలేకపోయారు. 2005, 2010లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూనే బీజేపీకి దేశమంతా స్టార్ క్యాంపెనియర్‌గా అవతరిస్తున్నప్పుడు నితీశ్ ఆయనను విస్మరించారు. 2010లో ఘన విజయం తర్వాత ఆయనలో జాతీయ స్థాయిలో ఆకాంక్షను రేకెత్తించింది. మోదీని వ్యతిరేకిస్తే లాలూ ముస్లిం ఓట్ బ్యాంకును కూడా ఆకట్టుకోగలననుకున్నాడు. తొలుత బిహార్‌లో మోదీని ప్రచారానికి పంపవద్దని బీజేపీ నాయకత్వాన్ని అడ్డుకున్న నితీశ్‌కుమార్... మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్డీఏ నుంచి తప్పుకున్నాడు. కానీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనంలో బిహార్‌లో బీజేపీకి 22 సీట్లు రాగా 40 సీట్లకు పోటీ చేసిన జేడీ(యు) 2 సీట్లకు పరిమితమైంది. దీనితో 2015లో అతడు మళ్లీ లాలూతో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవి కోసం రాజీపడాల్సి వచ్చింది.

ఒకప్పుడు నితీశ్‌కుమార్ తనను తీవ్రంగా వ్యతిరేకించి, తనను రాష్ట్రంలో అడుగుపెట్టనీయకుండా చేసినప్పటికీ అతడినే చేరదీసి బిహార్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయగలగడం మోదీ ప్రత్యేకత. నిజానికి జేడీ(యు)–ఆర్‌జేడీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మోదీ ఢిల్లీ నుంచి కొన్ని వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. మాఫియా డాన్, ఆర్‌జేడీ ఎంపీ షాహబుద్దీన్ 2016 సెప్టెంబర్‌లో వ్యూహాత్మకంగా విడుదల కావడం అందులో భాగం. అతడు బయటకు వచ్చీ రాగానే పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించి నితీశ్‌కుమార్‌ను అసమర్థ ముఖ్యమంత్రిగా దూషించడం మొదలుపెట్టాడు. అదే సమయంలో లాలూ, తేజస్వి నివాసాలపై సీబీఐ దాడులు తీవ్రతరం కావడం మరో వ్యూహం. తన ప్రభుత్వ విశ్వసనీయత పడిపోతుండడం, ఆర్‌జేడీ నుంచి ఒత్తిళ్లను, అవమానాలను తట్టుకోలేకపోవడంతో నితీశ్ ఆర్‌జేడీతో తన స్నేహం పొసగదని గ్రహించి రాజీనామా చేశాడు. ఈ అదనుకోసమే ఎదురు చూసిన మోదీ, నితీశ్ రాజీనామా చేసిన మూడు గంటల్లోనే ఆయనకు మద్దతునిచ్చేందుకు బీజేపీ నాయకత్వాన్ని ఒప్పించారు. కేవలం 14 గంటల వ్యవధిలో బీజేపీ ఒక ముఖ్యమైన రాష్ట్రాన్ని చేజిక్కించుకోగలగడం మోదీ మాస్టర్ స్ట్రోక్ అని చెప్పక తప్పదు. అంతే కాదు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ–జేడీ(యు) కూటమి 40 సీట్లలో 39 సీట్లు గెలుచుకోవడమే కాదు, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్‌కుమార్ కంటే ఎక్కువ సీట్లు సాధించినా బీజేపీ ఆయనకే ముఖ్యమంత్రి పట్టాన్ని కట్టబెట్టింది.

ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో పరిస్థితి ఏ విధంగా ఉంటుంది? గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న నితీశ్ ఆరోగ్య పరిస్థితి అంత బాగా లేదు. ఆయన నాయకత్వ ప్రభావం క్షీణిస్తోంది. బిహార్‌లో బీజేపీకి సారథ్యం వహించదగిన సమర్థులైన స్థానిక నాయకత్వం లేదు. మరోవైపు ప్రతిపక్షాలు కలిసికట్టుగా కార్యాచరణకు పూనుకుంటున్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర ఆ పార్టీ పుంజుకునేందుకు తోడ్పడే అవకాశాలను కల్పించింది. ఈ పరిస్థితుల్లో బిహార్‌లో బీజేపీని ఆదుకోగలిగిన నాయకుడు మోదీ తప్ప మరెవరూ కనిపించడం లేదు. కానీ మోదీ ఒక్కరే బిహార్‌లో బీజేపీకి అత్యధిక సీట్లు సాధించి పెట్టగలరా అన్నది ఇప్పుడు రాజకీయ పరిశీలకుల ముందున్న ప్రశ్న. బీజేపీకి బలమైన సంస్థాగత సామర్థ్యం, క్రమశిక్షణ గల కేడర్, సైద్ధాంతిక స్పష్టత ఉన్నప్పటికీ నితీశ్‌తో చేతులు కలపకుండా స్వంతంగా అధికారంలోకి రాగలమనే ధైర్యం ఆ పార్టీకి లేదు. అంతేగాక, బిహార్ ఇంకా ఓబీసీ ఆధిపత్య రాష్ట్రం. బీజేపీ ఆ రాష్ట్రంలో ఇంకా అగ్రవర్ణాల పార్టీ అన్న ముద్ర పోగొట్టుకోలేదు. నితీశ్ వంటి నేతను స్వంతంగా సృష్టించుకోలేదు. ఆ రాష్ట్రంలో పట్టణ జనాభా ఇప్పటికీ 15 శాతం దాటలేదు. మరి బీజేపీ ఆ రాష్ట్రంలో పూర్తిగా ఎలా చొచ్చుకుపోగలదు?



బిహార్‌లో అభివృద్ధి గురించి, ఆ రాష్ట్రానికి తాము విడుదల చేసిన లక్షల కోట్ల గురించి చెప్పి ఓట్లు అడగడం సరైన విషయం కాదని మోదీకి తెలియనిది కాదు. అందుకే అక్రమ వలసదారుల సమస్యను తీవ్ర స్థాయిలో లేవనెత్తడం ప్రారంభించారు. నిజంగా అక్కడ అక్రమ వలసదారుల సమస్య ఉన్నదా? ఉంటే ఎంతవరకు అది ఎన్నికలను ప్రభావితం చేస్తుంది? కుల సమీకరణలు ఎక్కువగా ఉన్న బిహార్‌లో మత సమీకరణలు ఎంతవరకు పనిచేస్తాయి?

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సగటున ప్రతి ఏడాదీ బిహార్‌కు పెద్ద ఎత్తున ప్యాకేజీ ప్రకటిస్తూనే ఉన్నది. 2015లో రూ.1.25 లక్షల కోట్ల నుంచి, తాజాగా ప్రకటించిన రూ. 40 వేల కోట్ల వరకు లెక్క తీస్తే బిహార్‌కు రూ.2 లక్షల కోట్లకు పైగా కేంద్రం విడుదల చేసే ఉండాలి. ఇంత మొత్తం విడుదల జరిగితే బిహార్ రూపురేఖలు మారి ఉండాలి. కానీ బిహార్ ఇప్పటికీ వెనుకబడిన రాష్ట్రమే. అత్యధికశాతం మంది నిరక్షరాస్యులు. నిరుద్యోగులు. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే సహస్రాబ్ది లక్ష్యాల విషయంలో బిహార్ అట్టడుగు స్థానంలో ఉన్నది. దేశంలో వివిధ రాష్ట్రాలకు నైపుణ్యం లేని శ్రమజీవులను పంపించడంలో బిహార్ అగ్రస్థానంలో ఉన్నది. బిహార్ కార్మికులు లేని నగరం అంటూ కనపడదు.

ఈ పరిస్థితుల్లో అభివృద్ధి గురించి, తాము విడుదల చేసిన లక్షల కోట్ల గురించి చెప్పి ఓట్లు అడగడం సరైంది కాదని మోదీకి తెలియనిది కాదు. అందుకే అక్రమ వలసదారుల సమస్యను తీవ్ర స్థాయిలో లేవనెత్తడం ప్రారంభించారు. అయితే బిహార్‌లో నిజంగా అక్రమ వలసదారుల సమస్య ఉన్నదా? ఉంటే ఎంతవరకు అది ఎన్నికలను ప్రభావితం చేస్తుంది? కుల సమీకరణలు ఎక్కువగా ఉన్న బిహార్‌లో మత సమీకరణలు ఎంతవరకు పనిచేస్తాయి? చెప్పడం కష్టం.

నిజానికి బిహార్ నుంచే అనేక మంది పెద్ద ఎత్తున పొట్ట చేతపట్టుకుని దేశంలో నలుమూలలకు పనికోసం వలస వెళుతుంటే, బంగ్లాదేశీయులు బిహార్‌లో దేని కోసం వలస వస్తారు? వారు ఎంత శాతం మంది ఉంటారు? ఎన్నికల రాజకీయాల్లో వారి ప్రభావం ఎంత మేరకు ఉంటుంది? ఒకవేళ వచ్చినా గత 11 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, బిహార్‌లో 20 సంవత్సరాల్లో 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ అక్రమ వలసల్ని ఎందుకు అరికట్టలేకపోయింది? ఎన్నికల కమిషన్ పనితీరుపై సుప్రీంకోర్టు కూడా అనేక ప్రశ్నలు వేసింది. ఎన్నికల కమిషన్ బీజేపీ తరపున పనిచేస్తోందని ప్రతిపక్షాలు కూడా తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిహార్‌లో ఇండియా కూటమికి, ఎన్డీఏకు మధ్య జరిగే పోటీ దేశ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రస్తుతం దేశం దృష్టి అంతా బీజేపీపై ఉన్నది. మోదీ నాయకత్వానికి ఈ ఎన్నికలు ఒక అగ్నిపరీక్ష.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

విధానాలను మార్చని యువత తిరుగుబాట్లు

కాలక్రమేణా శరవేగంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక మాధ్యమాల వలన సమాచారం కూడా ప్రజలకు చేరువవుతోంది. ప్రత్యేకించి యువతకు సామాజిక మాధ్యమాలతో అనుబంధం బలపడుతోంది. ఈ మాధ్యమాల ద్వారా వెలువడుతున్న సమాచారంపై విశ్వసనీయత ఏ విధంగా ఉన్నా, అది కొన్ని సందర్భాలలో ప్రభుత్వాల పతనానికి కూడా దారితీస్తోంది. ఇందుకు తాజాగా నేపాల్‌లో సంభవించిన పరిణామాలే నిదర్శనం.

పొరుగున ఉన్న నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలోనూ దూరాన ఉన్న ఈజిప్టు, ట్యునీషియాలోనూ ప్రజాగ్రహం పెల్లుబికి ప్రభుత్వాలు పతనం కావడానికి యువజనులు, సామాజిక మాధ్యమాలే కారణమంటే సత్యదూరం కాదు. మాతృదేశాలలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి విదేశీబాట పట్టిన యువత ఆ ఆందోళనల్లో కీలకపాత్ర వహించిందనే విషయం ఇక్కడ గమనార్హం. ప్రస్తుతం నేపాల్‌లో జరిగిన తిరుగుబాటులోనూ ప్రవాస నేపాలీ యువత ప్రత్యేకించి ఖతర్, ఇతర గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న యువ నేపాలీలు క్రియాశీలకపాత్ర వహించారనే విషయం విశాల ప్రపంచానికి అంతగా తెలియదు.

గల్ఫ్ లేఖ

15 సంవత్సరాల క్రితం ట్యునీషియాలోని ఒక మారుమూల ప్రాంతంలో వీధుల్లో పండ్లు, రొట్టెలు విక్రయించుకుంటూ జీవించే 26 ఏళ్ల మహమ్మద్ బజౌజీ అనే యువకుడు నిబంధనల పేర అధికారులు తనను వేధించిన తీరుకు నిరసనగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల ద్వారా బహిర్గతం కావడంతో అరబ్బు దేశాలలో అలజడి చెలరేగింది. కొన్ని దేశాలలో ప్రభుత్వాలు కూలిపోయాయి. ప్రభావశీలురు అయిన దేశాధినేతలు అధికార పీఠాల నుంచి దిగిపోవల్సివచ్చింది. దీంతో అనేక దేశాలు తమ యువతకు ఉపాధికల్పన దిశగా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టాయి.

అప్పటి వరకు విషాన్ని వెదజల్లుతూ వికృత పోకడలకు తావిచ్చే సాధనాలుగా అపకీర్తి పొందుతున్న సామాజిక మాధ్యమాలు జాతి నిర్మాణ బాధ్యతలపై యువతలో శ్రద్ధాసక్తులు పెంపొందించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించగలుగుతాయని బజౌజీ ఉదంతంతో లోకానికి తెలిసివచ్చింది.

ఒక పేద వీధి విక్రేత మరణం, ఈజిప్టు అధినేతగా ఉన్న హుస్నీ ముబారక్‌ను పదవీచ్యుతుడిని చేసిందంటే యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇది అరబ్బు దేశాలకు మాత్రమే పరిమితం కాలేదు. భారతీయ రాజకీయాలలోనూ



ఆగ్రహంతో పాలకులను దించడం కంటే పాలనా విధానాలలో ఎంత వరకు మార్పు తీసుకువచ్చామనేది ముఖ్యం. అయితే దురదృష్టవశాత్తు భారత్‌లో 1977 అత్యవసర పరిస్థితి నాటి నుంచీ నేటి నేపాల్ సంక్షోభం దాకా యువత ఈ వాస్తవాన్ని గుర్తించడం లేదు.

సామాజిక మాధ్యమాల పాత్రను తక్కువగా ఊహించలేము. దశాబ్దం క్రితం కాంగ్రెస్ పతనానికి దారి తీసిన అన్నా హజారే అవినీతి నిర్మూలనోద్యమం దరిమిలా తాము ఓడిపోవడానికి యూట్యూబ్ చానెళ్లు ప్రధాన కారణమని తెలుగునాట ఒక ప్రముఖ నాయకుడు వాపోవడం విస్మరించలేని విషయం.

పాలకుల వైఖరికి భిన్నమైన వాదన కూడా ప్రజల్లోకి వెళ్ళడానికి సామాజిక మాధ్యమాలు ఉపకరిస్తున్నాయి. సహజంగానే వాటిపై పట్టు సాధించడానికి పాలకులు ప్రయత్నించడం కద్దు. అలనాటి కాలంలో బ్రిటిష్ పాలకులు టెలిగ్రాఫ్, ప్రచురణలపై నిఘా వేసినట్లుగా నేటి కాలంలో వ్యక్తిగతంగా వినియోగించే వాట్సాప్ నుంచి 'ఎక్స్' వరకు ప్రతి దానిపై పాలకులు కన్నేసి ఉంచుతున్నారు.

ప్రజాక్షేత్రంలో కనీస గౌరవ మర్యాదలను మంటగలుపుతూ, సామాజిక కట్టుబాట్లను ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా ప్రవర్తించే సామాజిక మాధ్యమాలపై నియంత్రణ అనేది అవసరమే, సందేహం లేదు. అయితే దాన్ని తమపట్ల అసమ్మతి గళానికి అడ్డుకట్ట వేస్తూ వేధింపులకు వాడుకోవడంతోనే అసలు సమస్య మొదలవుతున్నది. ఇప్పుడు నేపాల్‌లో జరిగింది ఇదే.

వాస్తవానికి నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై విధించిన ఆంక్షలు భారత్ తదితర దేశాలలో కంటే భిన్నంగా ఏమీ లేవు. కానీ పరిపక్వత కలిగిన సమాజం, పరిణతి చెందిన రాజకీయ నాయకత్వం పాలకుల చతురత ఇత్యాది కారణాల వలన ఈ ఆంక్షలు భారత్‌లో అంతగా వెలుగులోకి రాలేదని చెప్పవచ్చు. పైగా వాణిజ్య ప్రకటనల రాబడి దృష్ట్యా కూడా భారత్‌ను నేపాల్ లేదా ఇతర దేశాలతో పోల్చలేమనే విషయాన్నీ గమనించాలి.

మరోవైపు సరైన దశ–దిశ లేకుండా ఈ దేశాలలో యువజనులు చేసిన పోరాటాలన్నీ ఆశయ సాధనలో విఫలమయ్యాయి. ఈ కఠోర సత్యాన్ని విస్మరించకూడదు. ఆగ్రహంతో పాలకులను దించడం కంటే పాలనా విధానాలలో ఎంత వరకు మార్పు తీసుకువచ్చామనేది ముఖ్యం. అయితే దురదృష్టవశాత్తు భారత్‌లో 1977 అత్యవసర పరిస్థితి నాటి నుంచీ నేటి నేపాల్ సంక్షోభం దాకా యువత ఈ వాస్తవాన్ని గుర్తించడం లేదు. ప్రపంచంలో ప్రప్రథమంగా యువతరం వారి ఇటువంటి తిరుగుబాట్లకు శ్రీకారం చుట్టిన ప్రవాస ఈజిప్షియన్ వాయిల్ ఘోనెమి ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఒక్కసారి తెలుసుకుంటే యువజనులు ఆవేశంగా కాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించవల్సిన అగత్యం అర్థమవుతుంది.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన విమోచనోద్యమంలో ఓరుగల్లు పోరుగల్లై అగ్నిజ్వాలలు కురిపించింది. పల్లే పట్నం తేడా లేకుండా సామాన్యులు సమర యోధులై దండు కట్టారు. బానిసత్వం నుంచి విముక్తి కోసం తిరుగులేని పోరు సాగించారు. ప్రాణాలను తృణప్రాయం చేసి స్వేచ్ఛ కోసం తపించారు. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసులు ఎంత అణిచివేయడానికి ప్రయత్నించినా, భూస్వామ్య జమీందారి వర్గం, వారి తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ప్రజలు వీరోచిత పోరాటాలు చేశారు. మడమ తిప్పకుండా సాగిన పోరులో ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. రజాకార్ల దౌర్జన్యాలకు ఎందరో బలయ్యారు. అనేకమంది ప్రాణత్యాగాలు చేశారు. ఆయుధాలు ధరించారు. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. చివరకు భారత యూనియన్ సేనల 'ఆపరేషన్ పోలో'తో 1948 సెప్టెంబరు 17న నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యేటా సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటిస్తున్నారు. ఇదే రోజును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ పల్లెను తడిమినా నాటి నెత్తుటిగాథలనే వినిపిస్తాయి. నాటి పీడనకు, పోరాటానికి పల్లెల్లో అనేక కట్టడాలు సాక్షీభూతాలుగా కనిపిస్తాయి. అప్పటితరం యోధులు క్రమక్రమంగా కనమరుగుఅవుతున్నా.. మిగిలివున్న వారు చెప్పే జ్ఞాపకాలు శరీరాన్ని నిలువెల్లా భావోద్వేగం ఉప్పొంగేలా చేస్తాయి. నాటి ఘట్టాలను మననం చేసుకొంటూ యోధుల త్యాగాలను కీర్తించే సందర్భమిది....

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

స్వేచ్ఛ కోసం రక్తతర్పణం



నిజాం పాలన నుంచి విముక్తి కోసం పోరుగల్లుగా మారిన ఓరుగల్లు

- రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
- ఎదురించి పోరాడిన ప్రజలు
- వీరోచిత పోరాట దీప్తి బైరాన్‌పల్లి
- మరో జలియన్‌వాలా బాగ్ పరకాల
- పెత్తందారులపై సమరశంఖం పూరించిన చాకలి ఐలమ్మ, బందగీ
- ఉద్యమ స్ఫూర్తి దొడ్డికొమురయ్య, బత్తిని మొగిలయ్య
- విమోచన ఉద్యమంలో అగ్రభాగాన మెరిసిన నేల
- నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

7

ఇరు జిల్లా కేంద్రాల్లో....

హనుమకొండ/గిర్మాజిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో బుదవారం ఉదయం 9.30 గంటలకు ప్రజాపాలన దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారు. జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

- ఇక వరంగల్ జిల్లా పరిధిలో ఓ-సిటీ వద్ద నూతనంగా నిర్మాణం అవుతున్న కలెక్టరేట్ వద్ద ప్రజాపాలన దినోత్సవం నిర్వహించనున్నారు. మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అంతకు ముందు ఖిలావరంగల్‌లో అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద మంగళవారం సాయంత్రం పరిశీలించారు.



సీఎం రేవంత్ రెడ్డితో వరంగల్ ఎంపీ కడియం కావ్య

అభివృద్ధి పనులకు నిధులివ్వండి..


- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ కావ్య
- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధిపై భేటీ

హనుమకొండ. సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు సత్వరం మంజూరు ఇవ్వాలని, వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ ఎంపీ కడియం కావ్య అభ్యర్థించారు. హైదరాబాద్‌లో సీఎంను కావ్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూపాలపల్లి రైల్వేస్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్‌పర్తి రోడ్డు లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వేస్టేషన్‌లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, మరోసారి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఒత్తిడి తీసుకురావాలని సీఎంను

(మిగతా 6లో..)

నేతల పోరు.. మారని తీరు..

- అధికార కాంగ్రెస్‌లో సద్దుమణగని అంతర్గత విభేదాలు
- తాజాగా మంత్రి కొండా వర్సెస్ ఎమ్మెల్యే నాయిని మధ్య ధర్మకర్తల రగడ
- ప్రజాపాలన దినోత్సవ వేళ ఈ సారి వరంగల్‌లో జెండావిష్కరణ చేయనున్న మంత్రి సురేఖ
- ఎమ్మెల్యేలతో విభేదాలే కారణమని రాజకీయవర్గాల్లో ప్రచారం
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో తాటికొండ మాటల దాడి.. కడియం వర్గం కన్నెర్ర..
- స్పీకర్ చర్యలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం
- నేతల మధ్య మంటలతో అయోమయంలో శ్రేణులు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లులో రాజకీయాలు మళ్లీ హీటెక్కుతున్నాయి. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం పతాకస్థాయికి చేరింది. ధర్మకర్తల నియామకంపై నాయిని చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేస్తున్నాయి. దీనికి తోడు ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను సురేఖ వరంగల్ జిల్లాలో అవిష్కరణ చేసేలా ఉత్తర్వులు రావడానికి నేతల మధ్య విభేదాలే కారణమనే చర్చ జరుగుతోంది. మరోవైపు స్టేషన్‌ఘనపూర్ రాజకీయం రణరంగంగా మారుతోంది. స్పీకర్ అనర్హత వేటుపై దృష్టి సారించటంతో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఎమ్మెల్యే కడియం టార్గెట్‌గా మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. కడియం వర్గీయుల కన్నెర్రతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల దాడులు రాజకీయాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో ఆగని లొల్లి

కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరుకు బ్రేకులు పడటం లేదు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేల మధ్య ఉన్న

(మిగతా 6లో..)

రాజకీయ 'రణ'పూర్

ఇక స్టేషన్‌ఘనపూర్ రాజకీయాలు ఓరుగల్లును హీటెక్కిస్తున్నాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. దీంతో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వస్తాయనే ఆశతో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచే బీఆర్ఎస్ ఆయనను టార్గెట్ చేసింది. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను తెరపైకి తీసుకువచ్చి ఎదురుదాడికి దిగుతోంది. శనివారం జనగామలో కడియం శ్రీహరిపై తాటికొండ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. వ్యక్తిగత దూషణలతో పాటు అవినీతి ఆరోపణలు చేయటంతో కడియం శ్రీహరి వర్గీయులు తీవ్ర నిరసనలకు దిగారు. రాజయ్య దిష్టిబొమ్మలను తగలపెట్టడంతో పాటు నియోజకవర్గంలో ధర్నాలకు దిగారు. దీంతో పాటు రఘునాథపల్లిలో పాదయాత్రకు సోమవారం సిద్ధమైన తాటికొండ రాజయ్యను పోలీసులు హనుమకొండలో హౌస్ అరెస్ట్ చేయటంతో బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. భారీగా గులాబీ శ్రేణులు తోడురాగా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో రాజయ్య పాదయాత్ర మొదలు పెట్టారు. అయితే జ్వరంతో బాధపడుతున్న కడియం శ్రీహరి.. ఈ ఎపిసోడ్‌లో తెరపైకి రాకపోయినప్పటికీ ఆయన అనుచరులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలకు దిగారు.

మహిళలకు నేటి నుంచి వైద్య శిబిరాలు

- దేశాయిపేటలో ప్రారంభించనున్న మంత్రి కొండా సురేఖ



పోచమ్మమైదాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన స్వస్థనారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు జిల్లాలోని పలుచోట్ల బుధవారం ప్రారంభిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని మహిళలకు పక్షం రోజుల పా టు స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రా థమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలలో సేవలు చేయడానికి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ఏరియా ఆస్పత్రి వర్ధన్నపేట, ఎంజీఎం ఆస్పత్రి, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి గైనకాలజీ, నేత్ర, ఈఎన్టీ, డెర్మటాలజీ, సైక్రియాటి, డెంటల్ సర్జరీ తదితర వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి డాక్టర్ సాంబశివరావు సూచించారు.

భద్రకాళి హుండీ లెక్కింపు

రూ.61.58 లక్షల ఆదాయం

6

- అప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది
- బీజేపీ జాతీయ నాయకులు జాఫర్ ఇస్లామ్, అనిల్
- నగరంలో 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' సదస్సు
- చివరి నిమిషంలో అనుమతిని ఉపసంహరించుకున్న 'కుడా'
- నిరసన వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరగాలి..



మాట్లాడుతున్న మాచర్ల బిక్షపతి



మాట్లాడుతున్న అనిల్ ఆంటోని



మాట్లాడుతున్న సయ్యద్ జాఫర్ ఇస్లామ్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖర్చులు తగ్గాలి.. కచ్చితత్వం పెరగాలంటే దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సిందేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సయ్యద్ జాఫర్ ఇస్లామ్, బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోని అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అనే సామాజిక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక దేశం, ఒక ఎన్నికతో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 1984లో ఈ ప్రతిపాదనలు వాజ్‌పేయ్ తెచ్చారని, 2019లో మోదీ ప్రధాని అయ్యాక మళ్లీ ఈ అంశాన్ని లేవనెత్తారన్నారు. ఇప్పుడున్న ఎన్నికల ప్రక్రియ మూలంగా రూ.కోట్లు నష్టపోతున్నామన్నారు. 2047 కల్లా ప్రపంచంలోనే ఆర్థిక ప్రగతిగా భారత్ మారాలంటే 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' జరగాల్సిందేనన్నారు.

రిటైర్డు లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకేసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలని సూచించారు. 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' ద్వారా పారిశ్రామిక పరంగా, టెక్నాలజీ పరంగా దేశ అభివృద్ధి ముందుకుసాగుతుందన్నారు. దీని ద్వారా దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవుతారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశంలో భారతదేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని, భవిష్యత్‌లో ఆ ప్రతిష్టలు మరింత పెంపొందించే విధంగా యువత తమ వంతు కృషి చేయాలన్నారు. యువత భారతదేశం కోసం ఆర్మీలో చేరి సేవ చేయాలన్నారు. భారత దేశం కోసం ఆర్మీలో తాను 24 ఏళ్ల సేవ చేశానన్నారు.

ఈ కార్యక్రమంలో అనిల్ ఆంటోని, జాఫర్ ఇస్లాం, విజయ్ కుమార్, నక్క స్నేహలత, బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, రావు పద్మరెడ్డి, డాక్టర్ కాళిప్రసాద్, వన్నాల శ్రీరాములుతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమాన్ని కాళోజీ కళాక్షేత్రంలో జరుపుకునేందుకు 'కుడా' అధికారులు గతంలోనే అనుమతి ఇచ్చారు. అయితే మంగళవారం కార్యక్రమం మరో గంటలో మొదలవుతుందనగా

(మిగతా 6లో..)

బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. వేయిస్తంభాల ఆలయంలో పెద్దఎత్తున నిర్వహించే తొలిరోజు బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను కమిషనర్ మంగళవారం సందర్శించారు. ఈ క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను కుడా అధికారులతో కలిసి పరిశీలించారు. కల్యాణ మండపం వెనుకభాగం నుంచి బతుకమ్మ వేడుకలకు వీఐపీలు వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. దేవాలయంలో జరిగే శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు, హోమగుండం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. పారిశుధ్య పనుల కోసం అదనపు సిబ్బందిని కేటాయించాలన్నారు. ఆలయ ముందుభాగంలో టాయిలెట్లు శుభ్రంగా ఉంచాలని, దేవాలయం చుట్టుపక్కల ఉన్న యజమానులు రెవెన్యూ, కుడా అధికారులతో

(మిగతా 6లో..)



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న కొండా మురళీధర్‌రావు

త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

● కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
● మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో త్వరలోనే అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన అంజంజాహి మిల్లు భూమిలో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. తరువాత దూపకుంటతో పాటు దేశాయిపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించి పాడైపోయిన తలుపులను తొలగించి కొత్తవి ఫిట్ చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాయకులు గోపాల నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్‌లో బయోగ్యాస్ ప్లాంట్ సందర్శన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ స్టడీ టూర్‌లో భాగంగా మంగళవారం వరంగల్ నగర పాలక సంస్థ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు అక్కడి కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ యూనిట్‌ను సందర్శించారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాంట్‌ను చూసి మేయర్ గుండు సుధారాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, కార్పొరేటర్లు అవాక్కయ్యారు. కాగా, బయోప్లాంగ్‌పై అక్కడి అధికారులు విస్లేసించారు. ఇక్కడి బయోప్లాంట్ ద్వారా ప్రతీరోజు 550 టన్నుల చెత్తను పీపీపీ ద్వారా శుద్ధిచేసి బయోగ్యాస్‌గా మారుతుందని అన్నారు. ప్రత్యేక వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను వేరుగా ఇండ్ల నుంచి సేకరించి సాలిడ్ వేస్ట్‌ను కంపోస్ట్‌గా మార్చి ఎరువుగా తయారు చేస్తారమని తెలిపారు. ఈ టూర్‌లో నగర పాలక సంస్థ వింగ్ అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో మాదిగలకు సీట్లు కేటాయించాలి

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ

పరకాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగల జనాభా అనుగుణంగా వార్డుమెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ల పదవులు కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పరకాల పట్టణంలోని మహాదేవ ఫంక్షన్ హాలులో రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అణగారిన కులాలను తక్కువ చేసి మాట్లాడడంతోనే ఓటమి పాలయ్యారన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాదిగలకు సముచిత స్థానం కల్పిస్తున్నాడని అన్నారు. మాదిగల పెద్దన్న పాత్రను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోషిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో మాదిగల జనాభాకు అనుగుణంగా ముఖ్యమంత్రి సీట్లు కేటాయిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెండెల రాములు, పెండెల సారన్న, సూర్యం, తిరుపతి, అనిల్, నవీన్, ప్రసాద్, సమ్మయ్య, మొగిలి, సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు కొయ్యడ శ్రీనివాస్, సదానందం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి హుండీ లెక్కింపు

రూ.61.58 లక్షల ఆదాయం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.61,58,999 ఆదాయం రాగా కేఎంసీలోని యూనియన్ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. 316 యూఎస్ఏ డాలర్లు, 15 యూఏ దిరమ్స్, 70 కెనడా డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఇంగ్లాండ్ పౌండ్స్, 100 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ లభించాయి. వాటితో పాటు మిశ్రమ బంగారం, వెండిని తిరిగి హుండీలోనే వేశారు. కార్యక్రమానికి పర్యవేక్షకులుగా కురవి వీరభద్రస్వామి దేవస్థాన ఈవో సత్యనారాయణ, ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యంతో పాటు ధర్మకర్తలు, అర్చకులు, వ్యవహరించగా లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిశోధనలపై మక్కువ పెంచాలి

ఉపాధ్యాయులకు కలెక్టర్ సత్యశారద సూచన

శంభునిపేట పాఠశాలలో టీఎల్ఎం మేళా

శంభునిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరిశోధనలపై మక్కువ పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీచింగ్.. లర్నింగ్.. మెటీరియల్ (టీఎల్ఎమ్) పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వాటిని డీఈవో రంగయ్యనాయుడితో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలానికనుగుణంగా పరిశోధనలతో పాటు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అందుకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సంసిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించిన పలువురిని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో సుజన్ తేజ, మండల విద్యా శాఖ అధికారి ప్రసాద్, హెచ్ఎంలు శారదాబాయి లక్ష్మయ్య, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివలింగం ఎగ్జిబిట్..

పోటీల్లో భాగంగా నర్సంపేట జీడయ్యపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు బాల్నె సరస్వతి తయారు చేసిన శివలింగం ఎగ్జిబిట్ ప్రశంసలను అందుకుంది. గణిత శాస్త్రానికి సంబంధించిన త్రిభుజం, చతురస్రం, కూడిక, గుణకార ఆకారాలతో పాటు పలు అంశాలతో శివలింగాన్ని రూపొందించారు. విద్యార్థులు ఇష్టంగా చదివేలా గణిత శాస్త్ర మెళుకువలతో ఎగ్జిబిట్‌ను రూపొందించినట్లు సరస్వతి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద, డీఈవో రంగయ్య నాయుడు, అధికారులు సరస్వతిని అభినందించారు.



శివలింగం ఎగ్జిబిట్‌ను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయురాలు బాల్నె సరస్వతి



ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద



స్వీడన్ నుంచి వరంగల్‌కు వచ్చిన సంధ్యారాణిని అభినందిస్తున్న పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, తదితరులు

కన్నవారిని వెతుక్కుంటూ..

● స్వీడన్ నుంచి వరంగల్‌కు వచ్చిన యువతి
● 2009 నుంచి ఇప్పటికి 5 సార్లు రాక

ఖిలావరంగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను వెతుక్కుంటూ ఓ యువతి స్వీడన్ నుంచి సముద్రాలు దాటి, వేలకిలోమీటర్లు ప్రయాణించి వరంగల్‌కు చేరుకుంది. తనవారిని అన్వేషిస్తూ శివనగర్‌లోని 'పోపా' రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్‌తో పాటు పద్మశాలి సంఘాల ప్రతినిధులను కలిసింది. సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం.. "మా తల్లిదండ్రులు బి.రాజ్‌కుమార్-అనసూర్య. కొందరు మాతల్లి చనిపోయిందని అంటున్నారు. సుమారు 36 ఏళ్ల క్రితం నా వయసు రెండేళ్లు ఉన్నప్పుడు బతుకుదెరువు కోసం మా నాన్న నన్ను తీసుకొని హైదరాబాద్‌లోని ప్రేమ్‌నగర్ వెళ్లాడు. అక్కడ నిజాం కళాశాల తోటమాలి రామయ్యతో ఆయనకు పరిచయం ఏర్పడింది. అక్కడే మానాన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేశారు. ఈ విషయం తెలిసి రామయ్య తన మరదలు విజయను మా నాన్నకు ఇచ్చి వివాహం చేశారు. మూడు నెలల తర్వాత ఓ రాత్రి నన్ను విజయ దగ్గర ఉంచి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు. అతడి ఆచూకీ కోసం రామయ్య గాలించినా దొరకలేదు. దీంతో విజయ, మూడేళ్ల వయసున్న నన్ను విజయనగర్ కాలనీలోని సేవా సమాజం-బాలిక నిలయం అనే ఆశ్రమంలో చేర్పించారు.

స్వీడన్‌కు చెందిన లింద్ గ్రేన్ అనే వ్యక్తికి సంతానం లేకపోవడంతో నన్ను దత్తత తీసుకున్నారు. ఆశ్రమం నుంచి నన్ను స్వీడన్‌కు తీసుకువెళ్ళాడు. చిన్నతనం నుంచి అక్కడే పెరిగాను. పెద్దయ్యాక స్వీడన్ నా దేశం కాదని, వాళ్ళు నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కాదని గ్రహించాను. పై చదువుల కోసం యూకే వెళ్ళాక ఓ ఫ్రెండ్ ప్రేరణతో నా అసలు పేరెంట్స్ గురించి 2009 నుంచి అన్వేషణ ప్రారంభించా. అందులో భాగంగా ఇటీవల వరంగల్ శివనగర్‌కు చేరుకున్నా. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నేను పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్‌ను కలిశాను. నా తల్లిదండ్రుల మూలాలు వరంగల్ శివనగర్‌లోనే ఉన్నాయని తెలుసుకొని వారిని కలిసేందుకు 16 సంవత్సరాలలో ఇప్పటికి ఐదుసార్లు వరంగల్‌కు వచ్చాను. తల్లిదండ్రుల కోసం వెతుకుతూనే ఉన్నాను. ఇంకా ఎన్నేళ్లైనా కానీ.. తల్లిదండ్రులను కలుసుకుంటాననే దృఢ నిశ్చయంతో ఉన్నా. ఏదైనా సమాచారం తెలిస్తే 9822206485 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు" అంటూ కన్నీళ్ళ పర్యంతం అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

సంప్రదింపులు జరుపాలన్నారు. వారు ముందుకు వస్తే నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆలయంలో సౌండ్ అండ్ లైట్స్ కార్యక్రమాన్ని శాశ్వత ప్రాతిపదికగా ఏర్పాటు చేసేందుకు కూడా పరిశీలిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అనంతరం కల్యాణ మండప వివరాలపై జిల్లా పురావస్తు శాఖ అధికారి అజిత్‌తో ఆరా తీశారు. ఆమె వెంట కుడా అధికారి అజిత్‌రెడ్డి, భీంరావు, మునిసిపల్ డీఈలు, హెల్త్ అధికారి రాజారెడ్డి, ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, కేంద్ర పురావస్తు శాఖ జిల్లా అధికారి నిరంజన్, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఏర్పాట్లు చేయాలి..

బతుకమ్మ పండగ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్ కోరారు. మంగళవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలకు హనుమకొండలో 26 వరంగల్‌లో 20 ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశామని, అక్కడ మహిళలకు కావలసిన అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బతుకమ్మ ఆడుకునే ప్రాంతాలను శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మంగళవారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సుకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌లు హాజరై మాట్లాడారు. టెక్నాలజీ యుగంలో అమాయకులను నేరగాళ్లు నిత్యం మోసం చేస్తున్నారని చెప్పారు. యువత డ్రగ్స్, గంజాయితోపాటు ఇతర మత్తులకు బానిసలు కావద్దని హెచ్చరించారు. ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని అందరినీ అప్రమత్తం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రహమన్, ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు సతీశ్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి

నేతల పోరు.. మారని తీరు..

(5వ పేజీ తరువాయి)

విభేదాలకు అధిష్ఠానం కూడా చెక్ పెట్టలేకపోతోంది. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా పోచమ్మమైదాన్ వద్ద జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేసిన కామెంట్లు చర్చనీయాంశంగా మారాయి. మురళిపై చర్యలు తీసుకోవాలంటూ ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అధిష్ఠానం వద్ద ఫిర్యాదులు చేశారు. ఈ గొడవ ఇటీవలే సద్దుమణుగుతున్న వేళ.. తాజాగా భద్రకాళి ఆలయ ధర్మకర్తల నియామకంలో మంత్రి తన పరిధి దాటుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి హీట్ పుట్టించాయి. అదృష్టం కొద్దీ రాజేందర్‌రెడ్డి గెలిచారని, అధిష్ఠానం సూచించిన వారినే ధర్మకర్తలుగా నియమించామని, దేవాదాయశాఖ మంత్రిగా తనకు ఆ స్వేచ్ఛ లేదా అని మంత్రి సురేఖ కౌంటర్ ఇచ్చారు. అయితే పార్టీలు మారితే నాలుగైదు సార్లు ఎమ్మెల్యేను అవుతానని నాయిని మాటల దాడికి దిగటంతో ఓరుగల్లు రాజకీయాలు మరోసారి రాష్ట్రవ్యాప్తంగా సంచలనమవుతున్నాయి.

ఇదిలావుండగా, మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం జరుగుతున్న వేళ ప్రజాపాలన దినోత్సవానికి అతిథులు జిల్లాలు మారటం రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. గత ఏడాది జరిగిన ప్రజాపాలన దినోత్సవంతో పాటు రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య వేడుకలకు మంత్రి సురేఖ హనుమకొండ జిల్లాకు, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ జిల్లాకు అతిథులుగా పాల్గొని జాతీయ జెండా అవిష్కరణ చేసేవారు. అయితే బుధవారం ప్రజాపాలన వేడుకలకు హనుమకొండ జిల్లాకు పొంగులేటిని, వరంగల్‌కు సురేఖను మార్చడం వెనుక ఎమ్మెల్యేల ఒత్తిడి ఉందా..? లేక సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న సొంత జిల్లా కావటం వల్లనే వరంగల్‌కు మార్చారా..? అనేది చర్చనీయాంశంగా మారింది.

మంత్రి సురేఖపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిల నియోజకవర్గ కేంద్రాలు హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు, వార్డులు హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. దీంతో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు ఈ మార్పు జరిగిందా? లేక మంత్రి సురేఖ సొంత నియోజకవర్గ కేంద్రం తో జాతీయ జెండాను అవిష్కరించేలా వరంగల్ కు మార్చారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

చేతులు కలిసేదెప్పుడో..?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సయోధ్య కరువైందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కొండా మురళి చేసిన ఘాటు వ్యాఖ్యలపై అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదనే చర్చ ఉంది. కనీసం విభేదాలు ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రి కొండా సురేఖ దంపతుల మధ్య సయోధ్య కుదుర్చేందుకు కూడా అధిష్ఠానం చొరవ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మంత్రి, ఎమ్మెల్యేల మధ్య మరింత గ్యాప్ ఏర్పడుతోందని, ఫలితంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే విమర్శలు ఉన్నాయి.

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరగాలి

(5వ పేజీ తరువాయి)

అనుమతిని రద్దుచేశారు. దీంతో నిర్వాహకులు హంటర్‌రోడ్డులోని ఫంక్షన్ హాల్‌కు మార్చారు. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా వచ్చిన మాచర్ల భిక్షపతిని ముదిరాజ్ ప్రతినిధులు యాట సత్యనారాయణ, సిరబోయిన మహేష్, కుక్కల కరుణాకర్ తదితరులు సత్కరించారు.

'కుడా' కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన

వరంగల్ కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి): 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలనా..' అంటూ బీజేపీ శ్రేణులు మంగళవారం 'కుడా' కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అనే కార్యక్రమానికి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించేందుకు ముందస్తుగా అనుమతినిచ్చి, చివరి క్షణంలో తిరస్కరించారని బీజేపీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. మంగళవారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయం ఎదుట బీజేపీ, ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యాలయంలోకి చొచ్చుకుని వచ్చి అక్కడి అధికారులను నిలదీశారు. కార్యక్రమానికి వారం ముందే అనుమతి ఇచ్చి ఎందుకు తిరస్కరించారని మండిపడ్డారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా కాళోజీ కళాక్షేత్రంలో 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అనే నినాదంతో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి 'కుడా' అధికారులను అనుమతి కోరగా వారం కిందట అనుమతి ఇచ్చారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని మంగళవారం ఉదయం అనుమతిని రద్దు చేస్తున్నట్టు అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11గంటలకు నిర్వహించాల్సి ఉండగా, 10 గంటలకు చెప్పడంతో వెంటనే కార్యక్రమాన్ని సీఎస్ఆర్ గార్డెన్స్‌లోకి మార్చి విజయవంతం చేశామన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి..

(5వ పేజీ తరువాయి)

కోరారు. అలాగే నష్కల్ నుంచి హసన్‌పర్తి, చింతలపల్లి నుంచి నష్కల్ వరకు రెండు కొత్తరైల్వే బైపాస్ లైన్లను ప్రతిపాదించారని, ఈ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లు వరంగల్ మాస్టర్ ప్లాన్ - 2041కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అధికారులుగానీ స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించకుండానే తయారు అయ్యాయని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతిపాదనలను పునఃపరిశీలించడం ద్వారా ఓఆర్ఆర్‌ను ఆనుకొని రైల్వే మౌలిక సదుపాయాలను ప్లాన్ చేయాలని, అప్పుడు రైతుల సమస్యలు తీరుతాయని తెలిపారు. ఈ అంశంపై కూడా గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు వెల్లడించారు. రైల్వే అలైన్‌మెంట్ మార్పు విషయం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సీఎంకు ఎంపీ విజ్ఞప్తి చేశారు.

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఎంతో గొప్ప చారిత్రాత్మక దేవాలయాలైన భద్రకాళి ఆలయం, వేయిస్తంభాల ఆలయంతో పాటు చిల్పూరులోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం కిందికి తీసుకువచ్చేలా, కేంద్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా ఆలయాల అభివృద్ధిపై చర్చించి, అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేసేలా చూడాలని కోరారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కోటగుళ్లు, నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణను వేగవంతం చేయాలని సీఎంను కోరారు.

యువ రైతు ఆత్మహత్య

● అప్పులబాధతోనే బలవన్మరణం ● గతంలో తండ్రి మృతి
● రామవరంలో విషాదఛాయలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువ రైతుకు పురుగుల మందే పెరుగన్నమైంది. వేసిన మొక్కజొన్న, పత్తి పంట చేతికి రాదని ఆందోళన చెందాడు. తండ్రి నుంచి సంక్రమించిన అప్పులు, తానూ పెట్టుబడుల కోసం చేసిన అప్పులతో తీవ్ర మనోవేదనకు గురైన యువకుడు.. చివరకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రామవరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం..

రామవరం గ్రామానికి చెందిన ఉడుత రమ - గట్టయ్య దంపతులకు ఇద్దరు కుమారులు రాకేష్, అఖిల్(22) ఉన్నారు. పెద్ద కుమారుడు రాకేష్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు అఖిల్ ఊర్లోనే ఉంటూ వ్యవసాయం చేస్తూ తన తల్లిని చూసుకుంటున్నాడు. తన తండ్రి గతంలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ, తమకున్న మూడెకరాల భూమిలో సాగు చేస్తున్నాడు. తల్లితో కలిసి వ్యవసాయాన్ని చేసుకుంటూ, మిగతా సమయాల్లో వారికున్న ఆటోలను నడుపుకునేవారు. ఇలా దాదాపు ఆ కుటుంబానికి రూ.5లక్షలకు పైగా అప్పు కాగా, వాటిని తీర్చేందుకు కుటుంబమంతా కష్టపడుతోంది. ఈసారి మొక్కజొన్న పంట వేయగా సగానికి పైగా కోతుల పాలు కావడం, పెట్టిన పెట్టుబడి రాకపోవడం రైతును మనస్తాపానికి గురి చేసింది. దీనికి తోడు ఈ మధ్య కాలంలో యూరియా కొరత ఉండడంతో పంటను వదిలి మండల కేంద్రానికి రావడంతో పూర్తిగా పంట చేతికంద లేదు. మంగళవారం యూరియా కోసం దమ్మన్నపేట రైతు వేదిక వద్దకు వచ్చి టోకెన్ సైతం తీసుకున్నాడని కుటుంబీకులు చెబుతున్నారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లగా తిరిగి రాలేదు. దీంతో తల్లి రమ కొడుకు కోసం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లింది. పత్తి చేనులో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు, బంధువులకు సమాచారం ఇవ్వడంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.





మృతిచెందిన ఉడుత అఖిల్, రోదిస్తున్న తల్లి రమా

గతంలో తండ్రి ఆత్మహత్య


కొన్నేళ్ల కిందట అఖిల్ తండ్రి గట్టయ్య సైతం వారి వ్యవసాయ క్షేత్రంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా కుటుంబీకులు, స్థానికులు చెపుతున్నారు. మళ్లీ కుమారుడు అక్కడే పురుగుల మందు తాగి మృతి చెందడంతో తల్లి రమ బోరున విలపిస్తోంది. చేతికి అందొచ్చిన కుమారుడు ఆత్మహత్యతో తల్లి, గ్రామస్థులు సైతం విషాదంలో మునిగిపోయారు. దీనిపై పోలీసులు వివరాలు తెలియజేయాల్సి ఉంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7480	5300
మక్కలు	2059	1521
కందులు	6212	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	6450	3500
పల్లికాయ (పచ్చిది)	3700	2400
పసుపు (కాడి)	10080	7889
పసుపు (గోల)	9656	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16800	12000
యూఎస్341ఏసీ	14500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



స్వేచ్ఛ కోసం రక్తతర్పణం

నిజాం పాలన నుంచి విముక్తి కోసం వీరోచిత పోరాటం

రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
విమోచన ఉద్యమంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలనాటి పాలనలో భూస్వామ్య, జమీందారుల పెత్తనం, అడుగడుగునా నిర్బంధాలు, బలవంతపు వసూళ్లు నిత్యకృత్యంగా సాగేవి. వీటికితోడు రజాకార్ల అకృత్యాలు ప్రజలకు శాపాలుగా మారాయి. వీటిని ఎదురించే దిశగా ప్రజలు చైతన్యవంతులై తమ హక్కులను కాపాడుకునేందుకు పెద్దఎత్తున ఉద్యమించారు. అలా విమోచన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచింది. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నది. కాకతీయులు ఏలిన గడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ చరిత్రలో నిలిచిపోయారు. బైరాన్‌పల్లి గ్రామం పైపడి ఊరును వల్లకాడు చేశారు. వందమందికి పైగా పొట్టన పెట్టుకున్నారు. రజాకార్లు కూటిగల్ మీద కూడా అదే ప్రతాపాన్ని చూపారు. 18 మందిని నిలబెట్టి రాక్షసంగా కాల్చి చంపారు. పరకాలలో ప్రజాసమూహంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలు బలిగొన్నారు. రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారి మడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు.

బైరాన్‌పల్లి నెత్తుటికథ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బైరాన్‌పల్లి ఉదంతం మరువరానిది. బైరాన్‌పల్లి గ్రామస్తులందరూ సమైక్యంగా నిలిచి ధైర్యసాహసాలు ప్రదర్శించి నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను ఎదురించి పోరాడారు. బైరాన్‌పల్లి పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్ల నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర పోరాటయోధులు నాయత్వం వహించారు. వీరు గ్రామ ప్రజల సహకారంతో దొరల అకృత్యాలను ఎదురించడమే కాకుండా నిజాం సైన్య బలగాలను,రజాకార్ల దోపిడీలను తిప్పికొట్టారు. ఒక రోజు రజాకార్లు దూలిమిట్ల, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లకెత్తుకొని తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదిరించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. బైరాన్‌పల్లిపై కక్షతో రజాకార్లు కూటిగల్ గ్రామంలో 20 మందిని కాల్చి చంపారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12 రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టాయి. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులు సైన్యాలను ఎదురించి కాల్పులు జరిపారు. ట్యాంకులు మోగుతున్నాయి. స్టెన్‌గన్‌లు పేలుతున్నాయి. తుపాకీ గుండ్లు దూసుకుపోతున్నాయి. బిత్తరపోయి మేల్కొన్న జనం కకావికలమయ్యారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించారు. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారు. ఆ తర్వాత విమోచనకారులు నిజాంపై, రజాకార్లపై ఎదురుదాడులకు దిగారు. చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకంగా నిలిచింది. రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను ఐలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. దీనిని స్ఫూర్తిగా తీసుకొని అనేక చోట్ల పోరాట యోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడి చేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారి మడూర్‌కు చెందిన అనేకమంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లిపురం గ్రామాన్ని తగులబెట్టారు. దీనికి ప్రతిగా పోరాటయోధులు రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్ఠంగా నిలుస్తోంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొంటుండేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగురువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదురించే క్రమంలో మొగిలయ్య రజాకార్ల కత్తి పోట్లకు గురై నేలకొరిగాడు.

విముక్తి

క్రమేణా పెరిగిన రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. దీని పేరు ఆపరేషన్ పోలో. వరంగల్ జిల్లాలో ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో మామునూరు విమనాశ్రయం ఎంతగానో దోహదపడింది. సైన్యం విమానాల ద్వారా ఈ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రజాకార్ల ఏరివేతను మొదలుపెట్టారు. సైనికులు జల్లెడలా విస్తరిస్తూ వెళ్లి రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేశారు. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని శరణుజొచ్చాడు. పోలీసు చర్యతో ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించింది. ప్రజలు పూర్తి స్వేచ్ఛా వాయువులను పీల్చుకోగలిగారు. నిజమైన స్వాతంత్ర పోరాట ఫలాలు పొందగలిగారు.

పరకాల మారణ హోమం

తెలంగాణ విమోచననోద్యమంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. ఇక్కడి ప్రజలు నిజాం వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సంఘటితమై రజాకార్లకు ఎదురొడ్డి నిలిచారు. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకా కేంద్రమైన పరకాలలో సమావేశం నిర్వహించాలని ఉద్యమ నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరకాల పక్కన పైడిపెల్లి తాటివనంలో జనమంతా పోగయ్యారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలంటూ చేసిన నినాదాలు ఆ ప్రాంతమంతా మిన్నంటాయి. అప్పటికే ఒక పోలీసులు, మరో పక్క రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని మానుకోవాలని పోలీసులు కోరినా ప్రజలు ఊరుకోలేదు. తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వడంతో అప్పటికే కాచుకున్న పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. మరో పక్క ఇదే అవకాశంగా రజాకార్లు విరుచుకుపడ్డారు. తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో అనేకమంది ప్రాణాలు విడిచారు. అనేక మంది గాయపడ్డారు. రక్తం ఏరులై పారింది. కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలతో ఆ ప్రదేశమంతా భయంకరంగా మారింది. మరో జలియన్‌వాలా బాగ్ ఉదంతాన్ని తలపింపచేసింది.

సరిహద్దు శిబిరాలు

నిజాం అండచూసుకున్న రజాకార్లు గ్రామాలను దోపిడీ చేయడం, ఎదురు తిరిగినవాళ్లను క్రూరంగా హింసించి చంపడం, స్త్రీలను చెరచడం, గ్రామాలను తగులబెట్టడం సాగించారు. జిల్లాలో ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు కొందరు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. అప్పటి పరిస్థితులను బట్టి ఉద్యమాన్ని కొనసాగించే వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు సరిహద్దు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇవి మొదట్లో నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కో నాయకుడు నాయత్వం వహించారు. విజయవాడలోని సరిహద్దు శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడిచింది. ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలు రాత్రుళ్లు రహస్యంగా తెచ్చి గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది.

వెన్నుచూపని బందగీ



విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి, ఆయన సతీమణి (ఫైల్)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ముందే కామారెడ్డిగూడెం షేక్ బంధగీ విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డిని ఎదిరించి తన ప్రాణాలను బలిదానం చేశాడు. తనకు సోదరుల మధ్య జరిగిన భూమి పంచాయితీ రాంచంద్రారెడ్డి వద్దకు వెళ్తే, బందగీ సోదరులకు అతడు అండగా నిలిచాడు. దీంతో బందగీ కోర్టుకు వెళ్లాడు. ఈ కేసులో బందగీకి అనుకూలంగా తీర్పు వస్తుందని గ్రహించిన దేశ్‌ముఖ్ బందగీ సోదరులతో కుట్ర పన్ని హత్య చేయించాడు. బందగీ మరణించినా కేసు న్యాయ పోరాటంలో గెలిచాడు. ఇలాంటి అకృత్యాలెన్నో దేశముఖ్ పరిపాలనలో జరిగాయి.

వీరనారి ఐలమ్మ



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయింది.ఈ పోరాటంలో ముందుండి పోరాడింది చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడింది. ఆనాడు జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలు ఐలమ్మకు అండగా ఉండి ఆ పోరాటానికి ఆజ్యం పోశారు. మల్లంపల్లికి చెందిన మక్తేదార్ కొండల్‌రావు తల్లి జయప్రద దేవి వద్ద ఐలమ్మ కొంత భూమిని కౌలుకు తీసుకుంది. ఆ భూమిని సాగు చేసి పంట పండిస్తుంటే అప్పుడు మొదలైంది. ఐలమ్మకు, విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి మధ్య వైరం ప్రారంభమైంది. దేశముఖ్‌ను ఎదిరించిన ఐలమ్మ భూపోరాటం ప్రపంచ స్థాయిలో గుర్తుండి పోయింది. 1945 ప్రారంభంలో జనగామ తాలూకాలో మొట్టమొదటి సారిగా పాలకుర్తిలో ఆంధ్ర మహాసభ ఏర్పాటైంది. ఆంధ్రమహా సభ నాయకులు, కార్యకర్తలు, ఐలమ్మకు అండగా ఉండి రైతాంగ సాయుధ పోరాటానికి నాంధీ పలికారు.

దొడ్డి కొమురయ్య వీర మరణం



తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి మరణం పొందిన వ్యక్తి కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య. 1946 జూలై 4న దేశ్‌ముఖ్ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలో కొంరయ్య ముందు భాగాన నిలిచాడు. గ్రామంలో దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ దొరసాని కొడుకు రాంచంద్రారెడ్డి అండతో ప్రజలను అనేక రకాలుగా పీడించింది. దీనికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కార్యకర్తలు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. దేశముఖ్ గూండాలు ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొంరయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి నాంధీ పలికింది. అప్పటి వరకు శాంతియుతంగా నిర్వహించిన పోరాటాలు, మాణ, ప్రాణాల కోసం భానిసత్వాన్ని విముక్తి పొందేందుకు రజాకర్లు, పోలీస్ బలగాలను ఎదిరించేందుకు ప్రజలు ప్రతిఘటణ పోరాటాలు చేశారు.

విస్నూరు దొర అకృత్యాలు



విస్నూరు గడి

విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి అరాచకాలకు కేంద్ర బిందువే విస్నూరు గడి. ఈ గడి ఆకృత్యాలు, అరచకాలకు నిలయంగా నిలిచింది. దేశ్‌ముఖ్‌కు ఎదురు తిరిగితే రజాకార్లను పంపించి గడిలోని చీకటి గుహలో వేసి ఆకృత్యాలకు పాల్పడే వారు. చాకలి ఐలమ్మ భూమిలో పండిన పంటను తీసుకురమ్మని రజాకార్లను పంపించింది. దేశ్‌ముఖ్ ఇక్కడి నుంచే ఆదేశాలిచ్చారు. మహిళలను నగ్నంగా ఉంచి బతుకమ్మ ఆడించిన ఘటనను ఇక్కడి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. కమ్యూనిస్టు అగ్ర నాయకుడు బీంరెడ్డి నర్సింహరెడ్డిని తీసుకువచ్చి చెవిలో సీసం పోసి చిత్ర హింసలకు గురి చేసింది ఈ గడిలోనే. ఇప్పటికీ ఈ గడీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ గడీ నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60గ్రామాల ప్రజల నుంచి బలవంతంగా వసూల్ చేసిన రూ. 2 లక్షల రూపాయలను గడి నిర్మాణానికి ఖర్చు చేశారు.

- ఆంధ్రజ్యోతి, పాలకుర్తి

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17

తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనికకారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారధి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేసించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు


పోరాట చరిత్రను వక్రీకరించద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్లు విమోచనం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. కొత్త రాజకీయ ఎత్తుగడలో భాగంగానే వాళ్లు నాలుగేళ్లుగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.

- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్

కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాను. అప్పట్లో హెచ్‌ఎస్‌సీ ప్రీ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నాను. అలా మగ్దూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నో సార్లు మందుగుండు సామాగ్రి, తుపాకీలు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించాను. కొన్నాళ్లు రహస్య జీవితం గడిపాను. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందల ఎకరాల భూమిని పంచాను.


- మొహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.



భగీరథ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి భగీరథ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కందుకూరి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చిలగాని మోహన్, మేకల సునీల్, కార్యదర్శులుగా ఇనుగాల పెద్దిరెడ్డి, గౌరిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా చింతల విశ్వేశ్వర్, గౌరవ అధ్యక్షులుగా మండల భిక్షపతి, పోతరాజు సారంగపాణి, గౌరవ సలహాదారులుగా ఎ.తిరుపతిరెడ్డి, పాపిశెట్టి కోటిలింగంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం భగీరథ కట్టపై శ్రమదానం చేసి కట్టవెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్యామలగార్డెన్, నాగరాజు టెంపుల్, అమరావతినగర్, టీవీ టవర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

రైతులు యాజమాన్య పద్ధతుల పాటించాలి

మడికొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం కాజీపేట మండలంలోని మడికొండ, టేకులగూడెం, కడిపికొండ శివార్లలోని పంట పొలాలను వ్యవసాయ శాఖాధికారులతో కలిసి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలకు పారావిల్ట్, తలమడు తెగులు సోకినట్లు గుర్తించారు. దాని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నిటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే వరిపంటలో ఉల్లికొడు గోట్బాలు తెగులును గుర్తించారు. తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా ఫిప్రోనిల్ 5 శాతం ఈసీ 2ఎంఎల్ ఒక లీటర్‌కు నీటిలో కలిసి పిచికారీ చేయాలన్నారు. పంటలను ఎప్పటికప్పుడు గమనించి తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు.శాస్త్రవేత్తల వెంట మండల వ్యవసాయధికారి సంతోష్, ఏఈవోలు భరత్, సంధ్య రైతులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించగా ఏడుగురు వ్యక్తులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.27,200 నగదు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

గుట్కాల పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కాజీపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత గుట్కాలను పోలీసులు పట్టుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఎస్సై శివ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లికి చెందిన చిట్టిమల్ల సతీష్ కాజీపేట విష్ణుపురి వద్ద నివాసం ఉంటూ నిషేధిత గుట్కాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం కాజీపేటవిష్ణుపురిలో ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సతీష్ ఉండే ఇంట్లో తనిఖీలు చేయగా రూ.72,140 విలువైన గుట్కాలు లభించినట్టు తెలిపారు. పట్టుబడిన గు ట్కాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివ తెలిపారు.

తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడండి

సీఎస్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్



సీఎస్ రామక్రిష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న వినయ్ భాస్కర్

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదివిన తెలంగాణకు చెందిన విద్యార్థులను సైతం నీట్ కౌన్సెలింగ్‌లో స్థానికులుగా పరిగణించాలని మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. వినయ్ భాస్కర్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌తో కలిసి మంగళవారం ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ రామక్రిష్ణారావును కలిశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణకు చెందిన కేంద్ర ప్రభుత్వ, బ్యాకింగ్, తదితర రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదవగా వారిని సైతం స్థానికులుగా గుర్తించాలన్నారు. మెడికల్, ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో నాలుగేళ్ల నిబంధనలో భాగంగా ఇంటర్మీడియట్ తెలంగాణలో చదివిన వారికే స్థానికత అంశాన్ని సవరించాలని కోరారు. ఉద్యోగులు వారి సర్వీస్‌రిత్యా ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న నేపథ్యంలో వారి పిల్లల్ని సైతం వివిధ రాష్ట్రాల్లో చదివిస్తారని అన్నారు. నీట్ ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు విషయంలో నాలుళ్ల స్థానిక అంశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల విషయంలో నిబంధనలను సడలించాలని కోరారు. ఈ అభ్యర్థనపై సీఎస్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే ప్రగతి

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే ప్రగతి, మానవమనుగడ కూడా అని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. మంగళవారం నిట్‌లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా జరిగింది. దీనిని పురస్కరించుకొని నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), అజిలెంట్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అక్షయ లాబ్‌టెక్ల సంయుక్తంగా ఒక రోజు సాంకేతిక శిక్షణాకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. పర్యావరణ స్థిరత్వం కోసం 'ఆధునిక సాంకేతిక విశ్లేషణాత్మక సాంకేతికలు' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల ప్రసంగాలు, ప్రాక్టికల్ ప్రదర్శనలు, పరికరాల ప్రత్యక్ష పరిశీలనతో పాటు ఎస్‌సీఎంఎస్ఎంఎస్, జీసీఎంఎస్ఎంఎస్, ఐసీపీఎంఎస్, స్పెక్ట్రోస్కోపీ, మైక్రోప్లాస్టిక్స్ డిటెక్షన్, నమూనా తయారీ విధానాలు, డేటా విశ్లేషణ, పర్యావరణ పరిశీలనలో వాటి ఉపయోగాలపై ప్రత్యేక సెషన్లు జరిగాయి. ఈ సందర్భంగా సుబుధి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించాలన్నారు. ఆర్అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ సోనావానే శిరీష్ హరి నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ పెసిలిటీ (సీఆర్ఐఎఫ్) సాగిస్తున్న పరిశోధనా కార్యక్రమాల గురించి వివరించారు. సీఆర్ఐఎఫ్ హెడ్ ఎ.వీరేష్‌బాబు ఆధునాతన పరిశోధనలకు మద్దతు అందించడంలో సీఆర్ఐఎఫ్ పాత్రను వివరించారు. టెక్నికల్ ఆఫీసర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూడా అయిన డి.రవికుమార్ ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అజిలెంట్ టెక్నాలజీ అకౌంట్ మేనేజర్ శేష్ కుమార్ సంయుక్త పరిశోధనల పట్ల అజిలెంట్ కట్టుబాటును ప్రస్తావించారు.

బురద చౌరస్తా!

- హనుమకొండ నడీరోడ్లపై మురుగు కంపు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు, వాహనదారులు
- చోద్యం చూస్తున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బంది



హనుమకొండ చౌరస్తాలో షాపుల ఎదుట రోడ్లపై పేరుకుపోయిన మురుగు, బురద, చెత్తాచెదారం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు హనుమకొండ చౌరస్తా వరదనీటితో అతలాకుతలమైంది. మురుగు, బురద, చెత్తాచెదారంతో కంపుకొడుతోంది. చౌరస్తా మీదుగా వేళ్లే ప్రయాణికులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య సముదాయమైన హనుమకొండ చౌరస్తాకు వివిధ ప్రాంతాల నుంచి రోజూ వందల మంది ప్రజలతో పాటు పలు పనుల నిమిత్తం స్థానికులు ప్రయాణం సాగిస్తుంటారు. నగర నడిబొడ్డున ఉన్న చౌరస్తాలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అ వరద షాపుల్లోకి వెళుతోంది. దీంతో షాపులోని వస్తువులు దెబ్బతిని ఆర్థికంగా నష్ట పోవాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత బురద షాపుల ముందే నిలిచి ఉండటంతో అది మురుగుగా మారి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు, అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చినుకు పడితే చిత్తడిగా మారే హనుమకొండ చౌరస్తా, పరిసర ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, డ్రైయినేజీలు సరిగా లేక ఏటా రోడ్లపైకి వర్షపు నీరు చేరుతోంది. దీంతో రోడ్లన్నీ కుంటలను, చెరువులను తలపించడం షరా మామూలుగా మారింది. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నా.. రోడ్లకిరువైపులా షాపుల ముందు పేరుకుపోయిన మురుగు, బురదను తొలగించే నాథుడే కరువయ్యాడని వ్యాపార సముదాయల యజమానులు వాపోతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి షాపుల నిర్వహణ కొనసాగిస్తుంటే.. చిన్నపాటి వర్షానికే చౌరస్తాలో నీరు నిలుస్తోందని, దీంతో కొనుగోలుదారులు రాక, షాపుల్లో అమ్మకాలు చేయలేక అప్పులపాలు కావల్సిన దుస్థితి నెలకొందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగు, బురదను వెంటనే తొలగించాలని చౌరస్తా వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం...



హనుమకొండ చౌరస్తాలోని రోడ్లు వరద నీటితో నిండి చెరువును తలపించింది. దీంతో మురుగునీరు ప్రధానరోడ్ల పైకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. అంతర్గత డ్రైయినేజీలు నిర్మాణం సరిగాలేక తేలికపాటి వర్షానికే వరదనీరు రోడ్లపైకి చేరడంతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వరదనీటితో ఏర్పడ్డ మురుగు, బురద కారణంగా కొనుగోలుదారులు షాపులకు రాకపోవడంతో బేరాలు చేయలేకపోతున్నాం. నిత్యం వందల మందితో కళకళలాడే హనుమకొండ చౌరస్తాలో రోడ్లన్నీ బురదమయంగా మారినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

- ఎస్‌డీ అసదుల్లా హుస్సేనీ, స్టీల్‌షాపు నిర్వాహకుడు

రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి..



హనుమకొండ చౌరస్తాలో స్టీల్ వస్తువులు కొనుగోలు చేయాడానికి ఓ షాపు వద్దకు రాగానే పెద్దఎత్తున బురద, మురుగు ఉండటంతో చాలా ఇబ్బందలను ఎదుర్కోవాల్సి వచ్చింది. మురికి నీరు రోడ్లపైకి చేరడంతో కాలు వేయలేని పరిస్థితి దాపురించింది. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డు గుండా ప్రయాణించడం చాలా కష్టతరం అవుతోంది. వర్షం కారణంగా రోడ్లపై ఉన్న మురుగు, బురదను తొలగించాల్సిన జీడబ్ల్యూఎంసీ సిబ్బంది.. పనులు చేపట్టకపోవడంతో వాహనాలపై అటుగా వెళ్లలేకపోతున్నాం. జీడబ్ల్యూఎంసీ సిబ్బంది స్పందించి రోడ్లపై పేరుకుపోయిన బురద, మురుగును తొలిగించాలి.

- గంకిడి గురునాథ్‌రెడ్డి, వాహనదారుడు హనుమకొండ

గ్యాంగ్ కార్మికుల అలెవెన్స్ పునరుద్ధరణపై హర్షం

రాంనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలోని సీబీడీ గ్యాంగ్ లో పనిచేస్తున్న కార్మికుల అలెవెన్స్ పునరుద్ధరణపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. అలవెన్స్ సమస్య పరిష్కారం కోసం కృషిచేసిన 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్‌ను మంగళవారం పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సెక్రటరీ శ్రీనివాస్, ఎస్పీడీసీఎల్ వరంగల్ రీజినల్ సెక్రటరీ బుచ్చయ్య గౌడ్, ట్రాన్స్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణ్, జోనల్ ప్రెసిడెంట్ మోహన్, రీజినల్ సెక్రటరీ నగేశ్, భరత్, వెంకటేశ్వర్లు, నితిన్, సంపత్, శివ, సాంబయ్య, రాజు, రమేశ్, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

24 మంది వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 24 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ జరిమానావిధించినట్లు హను మకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందికి రూ.20,500 జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసె న్స్ లేకుండా పట్టుబడ్డ ఆరుగురికి రూ.4000 జరిమానా విధించారన్నారు.

18 నుంచి ఎస్‌జీఎఫ్ఐ సెలెక్షన్స్

మడికొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలెక్షన్స్ ఈనెల 18, 19వ తేదీలలో నిర్వహించబడుతాయని మండల విద్యాశాఖాధికారి బండారు మనోజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట ఫాతిమా నగర్‌లోని ఫాతిమా ఎయిడెడ్ హైస్కూల్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు అండర్ 14, అండర్ 17 విభాగాలలో మొదటి రోజు బాలికలకు, రెండో బాలురకు సెలెక్షన్స్ ఉంటాయన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రతీ విభాగానికి నలుగురు విద్యార్థుల చొప్పున మాత్రమే పాల్గొనాలని తెలిపారు. సెలెక్షన్స్‌లో పాల్గొనే ప్రతీ విద్యార్థి తమ పాఠశాల నుంచి పెన్ నెంబర్, జనన తేదీ కలిగిన బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని కాజీపేట మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రెబెకా తెలిపారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తుతన్న వలంటీర్లు

సఖిని సద్వినియోగం చేసుకోవాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలు సఖి సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని చింతగట్టు కెనాల్ సమీపంలోని హసన్‌పర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు సఖి సెంటర్ సేవలను, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు సమస్యల్లో ఉన్నప్పుడు మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181ద్వారా తక్షణ రక్షణ సహాయం లభిస్తుందన్నారు. అంతేకాకుండా 0870-2452112, 73829 83088 అనే నెంబర్‌లకు కాల్ చేయడం ద్వారా బాధితులకు సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

లంబాడీల ఆత్మగౌరవ ధర్నాను జయప్రదం చేయాలి

గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ చైర్మన్ మోతీలాల్



పబ్లిక్ గార్డెన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లంబాడీ జేఏసీ నేతలు

వడ్డేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 19న నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ నిరసన ధర్నాను జయప్రదం చేయాలని గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ చైర్మన్ భూక్య మోతీలాల్ లంబాడీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మంగళవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో లంబాడీ జేఏసీ రాష్ట్ర నేతలు జైసింగ్ రాథోడ్, జాటోత్ కిషన్ నాయక్ నాయకత్వంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీలను కించపరుస్తూ, దూషిస్తూ, అవమానిస్తూ మాట్లాడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవ నిరసన, ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ కన్వీనర్లు బానోత్ నవీన్ నాయక్, నూనావత్ జవహర్ నాయక్, మాజీ జడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ గోపీ సింగ్ నాయక్, కో కన్వీనర్లు సమ్మయ్య రాథోడ్, అజ్మీరా వెంకట్, బానోత్ భాస్కర్, ధరావత్ దేవేందర్, ఆంగోత్ సుధాకర్, లావుడ్య రాజు నాయక్, అజ్మీరా సునిత, బానోత్ వీరు, తేజావత్ ఫణి, భూక్య రమే ష్, లావుడ్య బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు



కల్యాణ మండపంలో కృష్ణ జయంతి వేడుకలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. శ్రీకృష్ణ భక్త సేవాసమాజ్,తోపాటు ఇస్కాన్ నిర్వాహకులు భూ పావన హరినామదాస్, కరుణామయ మూర్తి దాస్, విజయరఘునందన్‌దాస్, కిశోర్ శ్రవణ్‌లతోపాటు టీటీడీ మేనేజర్ రఘువీర్, హిందు ధర్మప్రచార పరిషత్ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి దితరులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శేషభట్టార్ స్వాగతచార్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించడంతోపాటు భగవద్గీత పారాయణం, మధుర కృష్ణాష్టకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచకులు అన్నావఝ్జుల సోంబాబుశర్మ, సోమశేఖరశర్మ, శ్రీకృష్ణ తత్వంపై ధార్మిక ఉపన్యాసం చేశారు. హనుమకొండ రెవెన్యూ రామాలయం, ఏ టు జడ్ సమీపంలోని భూ నీలా వెంకటేశ్వరాలయం, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయం, బ్రాహ్మణవాడలోని శ్రీరంగనాయక ఆలయాల్లో రాత్రి శ్రీకృష్ణుని తానియను భక్తులచే అనుసంధానం చేయించారు. సింహమాసే సితేపక్షే అంటూ భక్తులచే అనుసంధానం చేయించి ప్రత్యేక పూజలు చేయింపజేవారు.

ఫీజు బకాయిలపై కేయూ విద్యార్థుల రిలే దీక్షలు



కేయూలో రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలపై కేయూలో విద్యార్థులు మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కేయూ దూరవిద్య కేంద్రం వద్ద టెంటు వేసుకుని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నేతలు బొచ్చు తిరుపతి, అరెగంటి నాగరాజు గౌడ్, దుగ్గొల తిరుపతి, మర్రి మహేశ్‌లు మాట్లాడారు. 4ఏళ్లుగా రూ.8,500 కోట్ల మేరకు ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు. స్టూడెంట్స్ ఫీజులను ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కాదని, కమిషన్ పాలనని విమర్శించారు. బడ్జెట్ లేదంటూనే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు వేలకోట్లు ఇస్తున్నారని అన్నారు. పేదలకు ఫీజులు ఇవ్వకపోవడంతో జీవితాలు అగం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే రూ.600కోట్లతో విద్యార్థులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. మొత్తం బకాయిలను చెల్లించక పోతే అందరం ఏకమై ఆందోళనలు చేస్తా మని చెప్పారు. దీక్షల్లో స్కాలర్లు కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి, బొట్ల మనో మర్, ఎల్తూరి సాయికుమార్, ఉప్పుల శివ, కుమ్మరి శ్రీనాథ్, పెండ్యాల రాకేశ్, బొక్క ప్రవర్ధన్, చింతం అంజనేయులు, శ్రీదేవి, స్రవంతి, పట్ల శేఖర్, ఓర్సు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్‌లు

న్యాయ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో మంగళవారం మందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో జరిగిన సంబురాల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కె.అనితారెడ్డి, డాక్టర్ బి.సుకుమారి, అధ్యాపకులు డాక్టర్ చల్లా శ్రీనివాస్, వేదశ్రీ, సుజాత, పద్మజ, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, హరిప్రసాద్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డు తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయం హసన్‌పర్తి పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల డార్మెటరీలు, డైనింగ్‌హాల్, తరగతి గదులు, లైబ్రరీ, వెల్నెస్ రూం, ప్లే గ్రౌండ్‌ను పరిశీలించారు. బాలికల డార్మెటరీలో పూర్తి స్థాయిలో ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదనపు వాషరూమ్ గురించి డీఈకి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని డీఈవో తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను సోషల్ సబ్జెక్టు సంబంధించిన ప్రశ్నలు అడగ్గా విద్యార్థులు సమాధానం చెప్పడంతో డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎ.శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ ఇందుమతి, ఏపీటీ రాజకుమారి, సీఆర్‌పీలు రాజుకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పిక్సీ హెయిర్ కట్.. నుదుటికి బ్లూ బాండ్.. బంతి చేతపడితే అవతల ఎవరున్నా తికమకపడాల్సిందే! బయట మామూలుగా మాట్లాడే ఈ అమ్మాయి క్రికెట్ గ్రౌండ్‌లో ప్రవేశిస్తే కొదమ సింహమే. ఆమె ఎవరో కాదు **నల్లపురెడ్డి శ్రీచరణి**. మన రాయలసీమ నుంచి టీమ్ ఇండియాకు ఎంపికయిన మహిళా క్రికెటర్. ఐదు నెలల క్రితం డబ్ల్యూపీఎల్‌లో అరంగేట్రం.. ఆ తర్వాత భారత వన్డే.. టీ20 జట్లలో ఆగమనం. ఇలా క్రికెట్‌లో దూసుకుపోతున్న శ్రీచరణి ఈ నెలఖరున మన దేశంలో జరగనున్న మహిళా వన్డే వరల్డ్‌కప్ కోసం సన్నద్ధమవుతోంది. 'నవ్య'తో శ్రీచరణి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

గల్లీ నుంచి ఢిల్లీ దాకా

మన చిన్నా

"మాది కడప జిల్లాలోని యర్రంపల్లి గ్రామం. నాన్న చంద్రశేఖరరెడ్డి విద్యుత్ శాఖలో పనిచేస్తారు. అమ్మ రేణుక గృహిణి. అక్క చరిత ఎంఎస్ పూర్తి చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. ఇంట్లో అందరూ నన్ను 'చిన్నా' అని పిలుస్తారు. చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. చదువుకన్నా ఆటలంటేనే ఆసక్తి. మామయ్య కిషోర్‌రెడ్డి, మా కాలనీలోని మగ పిల్లలతో క్రికెట్ బాగా ఆడేదాన్ని. ఒక విధంగా మామయ్యనే నా మొదటి కోచ్. ఆయన ఇప్పటికీ నా మ్యాచ్‌లు చూసి సలహాలు ఇస్తూ ఉంటారు. నేను కేవలం క్రికెట్ మాత్రమే కాదు.. ఖోఖో, బ్యాడ్మింటన్ లాంటివి కూడా ఆడేదాన్ని. ఖోఖోలో జాతీయ స్థాయిలో ఆడేదాన్ని. అథ్లెటిక్స్ ట్రైనింగ్‌కు కూడా ఎంపికయ్యా! నేను పదో తరగతి చదువుతున్నప్పుడు- గుంటూరులో ఖోఖో ఆడటానికి వెళ్లా! అక్కడ అనుకోకుండా ఒక క్రికెట్ మ్యాచ్‌ను చూశా. ఎందుకో తెలియదు.. ఆ మ్యాచ్ నా మనస్సులో ముద్ర పడిపోయింది. ఇంటికి వచ్చిన తర్వాత అమ్మతో - "నేను ఇక నుంచి క్రికెట్ మాత్రమే ఆడతా! పెద్ద క్రికెటర్ అవుతా! " అని చెప్పా. అమ్మ సరే అంది కానీ నాన్న కొన్ని నెలల వరకూ ఒప్పుకోలేదు. నా పట్టుదల చూసి చివరకు ఆయన కూడా ఒప్పుకున్నారు. పదో తరగతి అయిన తర్వాత క్రికెట్‌లో శిక్షణ తీసుకోవటం ప్రారంభించా. మొదట పొద్దుటూరులో.. ఆ తర్వాత హైదరాబాద్ కూకట్‌పల్లిలో రంజీ మాజీ క్రికెటర్ సురేష్ సార్ దగ్గర శిక్షణ తీసుకున్నా. మొదట్లో నేను పేస్ బౌలర్‌ని. సురేష్ సార్ దగ్గరకు వచ్చిన తర్వాత ఆఫ్ స్పిన్నర్‌గా మారా! ఆ సమయంలోనే అండర్ 19కి ఎంపికయ్యా.

మలుపు తిప్పిన ఘటన..

బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో 2019లో అండర్-19 వరల్డ్‌కప్ కోసం హైలెవల్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను ఆ శిబిరానికి ఎంపిక చేశారు. నాకు ఛాన్స్ వస్తుందనుకున్నా! కానీ రాలేదు. ఆ బాధ నన్ను చాలా కాలం వేధించింది. అయితే నాలో పట్టుదలను కూడా పెంచింది. కొవిడ్ తర్వాత అండర్-19 స్థాయిలో ఆల్‌రౌండర్‌గా సత్తా చాటడంతో 2022లో ఆంధ్ర సీనియర్ జట్టులో చోటు లభించింది. నాకు దొరికిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లేదాన్ని. 2023లో ముంబయిలో జరిగిన టీ20 చాంపియన్‌షిప్‌లో నేను ఆడాను. నా ఆటను ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కు చెందిన కొందరు పరిశీలించారట! ఆ విషయం అప్పుడు నాకు తెలియదు. 2024లో జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో నన్ను ఢిల్లీ జట్టు రూ. 55 లక్షలకు కొనుగోలు చేసింది. ఫైనల్‌లో ముంబయిపై పరుగులు కట్టడి చేయడంతో పాటు కీలక వికెట్లు తీయడంతో బీసీసీఐ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాను. ఆతర్వాత జరిగిన ఛాలెంజర్ ట్రోఫీలో 9 వికెట్లు పడగొట్టడంతో తొలుత వన్డే, ఆతర్వాత టీ20ల్లో భారత జట్టు తరపున అరంగేట్రం చేయగలిగా. గత జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అరంగేట్రం మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు తీయడం నా కెరీర్‌లో ఒక మధురానుభూతి. భారత్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాల జాబితాలో (4/12) నా పేరు రెండోదని తెలిసి చాలా సంతోషించా.

అమ్మ చేతి వంట ఇష్టం..

స్వతహాగా నేను భోజన ప్రియురాలిని. స్వీట్లు తప్ప మిగిలిన అన్నింటినీ ఒక పట్టు పడతా. అమ్మ చేతి వంట అంటే చాలా ఇష్టం. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో జరిగే దేశవాళీ క్రికెట్ పోటీల్లో ఎక్కువగా ఆడుతుండడంతో ఇంటి భోజనానికి దూరమయ్యా. నేను ఎప్పుడైనా సరిగ్గా ఆడకపోతే దానికి కారణం సరిగ్గా తినకపోవడమేనని అనుకొని ఇంటికి వచ్చినప్పుడల్లా అమ్మ నాకు ఏదో ఒకటి వండి తినిపించే పనిలోనే ఉంటుంది. ఈ మధ్య ఎక్కువ సినిమాలు చూడడం లేదు కానీ ఒకప్పుడు ప్రభాస్ మూవీ ఏది వచ్చినా వెంటనే చూసేదాన్ని. క్రికెట్‌లో యువరాజ్, స్మృతి మంధాన, హర్మన్, జెమీమా అంటే బాగా ఇష్టం. యువరాజ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సులు కొట్టిన వీడియో అయితే ఇప్పటివరకు ఎన్నిసార్లు చూశానో లెక్క లేదు. ఎప్పటికైనా యువరాజ్‌లా అలా సిక్సర్లు కొట్టాలనే కోరిక ఉంది. ప్రస్తుతానికైతే బౌలింగ్ పైనే ఫోకస్ పెట్టాను. జట్టు అవసరానికి తగ్గట్టు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటడానికి సిద్ధమే.





తల్లిదండ్రులతో శ్రీచరణి

మార్కర్‌తో గుర్తులు..

కెరీర్ ప్రారంభంలో నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు మంచి లెంగ్త్‌లో బంతి పడి వికెట్లు తీసినప్పుడు పిచ్‌పై బాల్ పడిన చోట మార్కర్‌తో గుర్తు పెట్టుకొనేదాన్ని. అది గుర్తు వస్తే ఇప్పుడు నవ్వొస్తుంది. ఇంత సేపే ప్రాక్టీసు చేయాలని టైమ్ పెట్టుకోను. నా బౌలింగ్‌పై ఆత్మ సంతృప్తి కలిగేంత వరకు సాధన చేస్తాను. చివరిగా ఒక మంచి బంతి వేశాకే ప్రాక్టీసు ముగిస్తాను.

ఒత్తిడికి లోనుకాను..

మైదానంలో అడుగు పెట్టాక ఆటపైనే పూర్తిగా దృష్టి పెడతాను. గ్రౌండ్ అవతల ఏమవుతోందో పట్టించుకోను. ఒక బంతి సరిగ్గా వేయకపోతే తర్వాతి బంతి ఇంకా బాగా వేయాలనే ఆలోచిస్తా కానీ ఒత్తిడికి లోనుకాను. సీనియర్లు నుంచి మంచి సహకారం ఉండడం, వారంతా బాగా ప్రోత్సహించడం కూడా నాకు కలిసొచ్చింది. నేను ఎదుట వాళ్లు ఏం చెప్పినా శ్రద్ధగా వింటాను వాళ్లు ఏ ధోరణిలో చెప్పినా 'నా మంచి కోసం చెబుతున్నారు కదా' అని ఆ విషయాలను అర్థం చేసుకొని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తా. అదే నా బలం.

కచ్చితంగా వరల్డ్‌కప్ గెలుస్తాం..

ప్రతి క్రికెటర్‌కు వరల్డ్‌కప్‌లో ఆడడం, ఆ ప్రతిష్ఠాత్మకమైన ట్రోఫీను గెలవడం అనేది ఒక కల. అలాంటి మెగా టోర్నీలో ఆడే అవకాశం నాకు చిన్న వయసులోనే రావడం నిజంగా నా అదృష్టమే. ఈసారి ప్రపంచకప్ మన దేశంలోనే జరుగుతుండడం, విశాఖపట్నం కొన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తుండడం, సొంత గడ్డపై తెలుగు వాళ్ల ముందు ఆడడం గౌరవంగా భావిస్తున్నా. వరల్డ్‌కప్‌లో మన టీమిండియా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ నుంచి మనకు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఎంత పోటీ ఉన్నా కచ్చితంగా వరల్డ్‌కప్ గెలుస్తామనే నమ్మకం ఉంది.

● **ఎస్.ఎస్.బి సంజయ్**, హైదరాబాద్

నగలు అనగానే బంగారం, వెండి లాంటి లోహాలతో, పూసల్లాంటి వాటితో చేసినవి కళ్ల ముందు మెదులుతాయి. కానీ **పుతుల్‌దాస్ మిత్రా** 'కాదేదీ సృజనాత్మక సృష్టికి అనర్హం' అంటారు. కోల్‌కతాకు చెందిన ఆమె ధాన్యంతో రూపొందించిన వివిధ ఆభరణాలు విదేశాల్లో కూడా ఆదరణ పొందుతున్నాయి. ఎందరికో శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గం చూపుతున్న 46 ఏళ్ల పుతుల్‌దాస్ పలు పురస్కారాలు సైతం అందుకున్నారు.

ధాన్యంతో 'నగ'ధగలు



"గోవిందభోగ్ అనే రకం వరి ధాన్యాన్ని మా రాష్ట్రం పశ్చిమబెంగాల్‌లో ఎక్కువగా సాగు చేస్తారు. ఆశ్వయుజ పూర్ణిమను 'కోజాగరి పూర్ణిమ'గా, లక్ష్మీదేవి పుట్టినరోజుగా మేము జరుపుకొంటాం. ఆ సందర్భంలో... గోవిందభోగ్ ధాన్యంతో దండలు తయారు చేసి ఇళ్లలో అలంకరించడం ఆచారం. పూల దండలతో పోలిస్తే ఈ దండలు ఎక్కువకాలం ఉంటాయి. కోల్‌కతా నగరంలో పుట్టి పెరిగిన నాకు ఈ దండలు తయారు చేయడం చిన్న వయసునుంచీ అలవాటే. దాంతోపాటే కుట్లు, అల్లికలు నేర్చుకున్నాను. కాలేజీలో చదువుతున్నప్పుడు ధాన్యంతో రాఖీలు చేశాను. చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు. ఆ తరువాత నా దృష్టి నగల మీదకు మళ్లింది.

ప్రణబ్ అభినందించారు...

చిన్న చిన్న దండలతో నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆ తరువాత చెవి దుద్దుల్లాంటి చిన్న చిన్న వస్తువులు. క్రమంగా జూకాలు, గాజులు, నెక్లెస్‌లు... ఇలా రకరకాల ఆభరణాలు రూపొందించాను. 2000 సంవత్సరంలో... కోల్‌కతాలో నిర్వహించిన ఒక ఎగ్జిబిషన్‌లో వాటిని ప్రదర్శించే అవకాశం వచ్చింది. సందర్శకులకు అవి ఎంతో నచ్చాయి. వాటిని ఉత్సాహంగా కొన్నారు. దాంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కోల్‌కతా, ఆ చుట్టుపక్కల ఎక్కడ ఎగ్జిబిషన్లు, ఉత్సవాలు జరిగినా... నా స్టాల్ ఏర్పాటు చేసేదాన్ని. మీడియాలో నా గురించి ప్రచారం అయింది. నేను చేసేవి విశిష్ట కళారూపాలుగా గుర్తిస్తూ... 2002లో రాష్ట్రప్రభుత్వం నాకు అవార్డును అందజేసింది. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో నేను తయారు చేసిన నగలను విక్రయించడం మొదలుపెట్టాను. కానీ ఒక ప్రదర్శనకోసం డిమాండ్‌కు తగినన్ని ఆభరణాలు చేయడం అంత సులువు కాదు. ఎంతో శ్రమపడాల్సి వచ్చేది. అప్పుడే మరికొందరు మహిళలకు శిక్షణ ఇచ్చాను. మేమందరం కలిసి ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చినప్పుడు... నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వచ్చారు. మా ఆభరణాలను తిలకించి, అభినందించారు. 2015లో ఆయన చేతుల మీదుగానే 'నేషనల్ హ్యాండీక్రాఫ్ట్స్ అవార్డు'ను స్వీకరించాను. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గురు శిష్య పరంపర పథకం' కింద వివిధ రాష్ట్రాల్లో వేలాదిమందికి ధాన్యం ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చాను.



జూకాల నుంచి పెళ్లి నగల వరకూ...

"ధాన్యం ఆహారానికి ఉపయోగించేది కదా! దీంతో నగలేమిటి? ఇవి ఎన్నాళ్ళుంటాయి గనుక!" అని కొందరు సందేహం వ్యక్తం చేస్తూ ఉంటారు. కానీ ఇవి పర్యావరణానికి మంచివి, చర్మానికి, మన ఆరోగ్యానికి ఎలాంటి హాని చెయ్యవు. నగల తయారీకి ముందు వాటిని ప్రత్యేక పద్ధతిలో శుద్ధి చేస్తాం. కాబట్టి అవి పాడవకుండా ఉంటాయి. ఏడు నుంచి ఎనిమిదేళ్ళ వరకూ మన్నుతాయి. ఇప్పుడు చిన్న జూకాల నుంచి పెళ్ళిళ్ళకు బ్రైడల్ సెట్ల వరకూ ప్రతిదీ మేం రూపొందిస్తున్నాం. మరోవైపు గృహాలంకరణ వస్తువులను కూడా ధాన్యంతో తయారు చేస్తున్నాం. మన దేశంలోనే కాదు, చైనా, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్ లాంటి అనేక దేశాల్లో కూడా వీటిని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాం. మొదట మా నాన్నగారు, తరువాత నా భర్త, ఇప్పుడు మా పిల్లల ప్రోత్సాహం లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. పాతికేళ్ళ క్రితం సరదాగా ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నం నాకు ఇంత పేరు తెచ్చిపెట్టిందంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఇదేదీ నేను ఒక ప్రణాళిక వేసుకొని చేసినది ఏమాత్రం కాదు. మనం నిమిత్తమాత్రులం అని, విధి మనల్ని నడిపిస్తుందనీ గట్టిగా నమ్ముతాను. నా వద్ద ముప్పై మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. నా దగ్గర శిక్షణ పొందినవారిలో చాలామంది ధాన్యంతో కళాకృతులు, నగల తయారీని ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. ఇంతకన్నా సంతృప్తి ఏముంటుంది?"

పిల్లలు కొత్త విషయాలు నేర్చుకునేలా..

పిల్లలు ఎదుగుతున్న కొద్దీ కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కొన్నింటిని ప్రశ్నల ద్వారా, మరికొన్నింటిని కళ్లతో చూసి, ఇంకొన్నింటిని చేతల ద్వారా అవగాహన చేసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పిల్లలు ఏవైనా ప్రశ్నలు అడిగినప్పుడు విసుక్కోకుండా ఓపికగా సమాధానాలు చెప్పాలి. మెల్లగా వాళ్లకి అర్థమయ్యే రీతిలో వివరించాలి. అప్పుడే పిల్లల్లో గ్రాహక శక్తి పెరుగుతుంది.
- పిల్లలకు చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించాలి. వాటిని పూర్తిచేసినప్పుడు మనస్ఫూర్తిగా అభినందించాలి. దీనివల్ల పిల్లలు విజయాన్ని ఆస్వాదించడమే కాకుండా సవాళ్లను స్వీకరించడం నేర్చుకుంటారు.
- కొంతమంది పిల్లలు ఏదైనా కొత్త పనిని మొదలుపెట్టడానికి సంకోచిస్తూ ఉంటారు. దాన్ని సరిగా చేయలేమని అనుకుంటూ వెనకడుగు వేస్తుంటారు. అలాంటప్పుడు పిల్లలకు ధైర్యం చెప్పి, ఆ పనిని ప్రారంభించేలా ప్రోత్సహించాలి. తప్పులు జరగడం సహజమని వివరించాలి. మొదటి అడుగు వేయడానికి భయపడినప్పటికీ పిల్లలు క్రమంగా ఎన్నో విషయాలు నేర్చుకుంటూ పనిని పూర్తిచేస్తారు.
- పిల్లలకు ఏ అంశాల మీద ఆసక్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. తగినవిధంగా ప్రోత్సహిస్తూ శిక్షణ ఇప్పిస్తే పిల్లలు నచ్చిన వాటిని చక్కగా నేర్చుకుంటారు.
- పిల్లలకు సహనంగా వ్యవహరించడం అలవాటు చేయాలి. దీనివల్ల వారిలో ఆలోచన శక్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అనుక్షణం ఎదురయ్యే సొంత అనుభవాలతో పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు.

పావురాళ్ల బెడద వదిలేలా...

పావురాళ్లు నగర జీవితంలో భాగాలైపోయాయి. అవి మన బాల్కనీలు, కిటికీలు, ఎయిర్ కండిషనర్ యూనిట్ల దగ్గర తిష్ఠ వేస్తూ విసర్జకాలతో, ఈకలు, గూళ్లతో పరిసరాలను పాడు చేస్తూ ఉంటాయి. అయితే ఈ సమస్యను సులభమైన చిట్కాలతో పరిష్కరించుకునే వీలుంది. ఎలాగో తెలుసుకుందాం!



ప్రొటెక్టివ్ నెట్స్: అత్యంత ప్రభావవంతమైన విధానమిది. ప్రత్యేకించి ఎత్తైన నిర్మాణాలకు ఇదే అనువైన పద్ధతి. బాల్కనీ మూలలు, ఏసీ యూనిట్లు, ఇతరత్రా ఆశ్రయానికి వీలుండే జాగాల నుంచి పావురాళ్లను దూరం పెట్టడం కోసం ఈ నెట్స్ వాడుకోవచ్చు. అయితే పావురాళ్లు పొరపాటున ఈ వలల్లో చిక్కుబడిపోకుండా ఉండడం కోసం, నెట్‌ను బిగుతుగా లాగి కట్టేయాలి.

ప్రతిఫలించే వస్తువులతో: పావురాళ్లు అకస్మాత్తుగా కదిలే వస్తువులు, ప్రతిఫలించే వెలుగులకు దూరంగా ఉంటాయి. కాబట్టి పాత సిడిలు, విండ్ ఛైమ్స్ లేదా ప్రతిఫలించే టేప్ లాంటి వాటిని ఏర్పాటు చేసుకోవాలి. అద్దాలతో కూడా ప్రయోజనం ఉంటుంది.

సహజసిద్ధ రిపెల్లెంట్స్: ఘాటు వాసన వెదజల్లే వాసనలు కూడా పావురాళ్లను దూరం పెడతాయి. లవంగ నూనె, పుదీనాతో తయారైన స్ప్రేలు, పలుచన చేసిన మిరప సారాలను బాల్కనీ ఉపరితలాలకు అప్లై చేయాలి. సాధారణంగా పావురాళ్లు వానాకాలం ప్రారంభంలో లేదా వసంతకాలంలో గూళ్లు పెట్టడం మొదలుపెడతాయి. కాబట్టి అంతకంటే ముందే ఈ జాగ్రత్తలకు పూనుకోవాలి.

ఆహారం వద్దు: పావురాళ్లకు ఆహారం అందించడం మొదట్లో సరదాగానే ఉంటుంది. కానీ ఈ పని మరిన్ని పావురాళ్లను ఆకర్షిస్తుంది. కాబట్టి పావురాళ్లకు నీళ్లు, ఆహారం అందుబాటులో ఉంచడం మానుకోవాలి. పావురాళ్లతో పాటు వాటి వెంట పరాన్నజీవులు కూడా ఇళ్ల పరిసరాల్లోకి చేరుకుని, ఇన్‌ఫెక్షన్లను కలిగిస్తాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఫ్యాషన్



బిగుతుగా ఉండే జీన్స్‌కు రోజులు చెల్లిపోయాయి. వదులుగా, సౌకర్యంగా ఉండే బ్యాగీ జీన్స్ ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. ఈ తాజా ఫ్యాషన్‌తో ఎలా ఆకట్టుకోవచ్చో తెలుసుకుందాం!


బ్యూటిఫుల్ 'బ్యాగీ'

స్ట్రెయిట్ కట్, బూట్ కట్, రెగ్యులర్ ఫిట్... ఇలా జీన్స్‌లో ఎప్పటికప్పుడు కొత్త పోకడలు వస్తూనే ఉంటాయి. అయితే తాజాగా బ్యాగీ జీన్స్ ట్రెండ్ వాడుకలోకొచ్చింది. వదులుగా ఉండే ఈ జీన్స్ సౌకర్యంగా కూడా ఉండడంతో వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ వీటిని ఆదరిస్తున్నారు. అయితే బ్యాగీ జీన్స్‌ను తగిన టాప్స్, టీషర్ట్స్, ఇతరత్రా యాక్సెసరీస్‌ను ఆచితూచి ఎంచుకోవాలి. అప్పుడే ఈ జీన్స్ అందం ఇనుమడిస్తుంది. అందుకోసం...

యాక్సెసరీస్: పెద్ద డయల్ కలిగి ఉండే వాచీలు ఈ రకం ప్యాంట్లకు బాగా సూటవుతాయి. అనలాగ్ వాచీలను ఎంచుకోవచ్చు.

క్రాప్‌టాప్స్: బ్యాగీ జీన్స్‌తో కురచగా ఉండే క్రాప్ టాప్స్‌తో మ్యాచ్ చేయాలి. ఈ టాప్ బిగుతుగా లేదా వదులుగా ఉన్నా ఫరవాలేదు. స్లీవ్‌లెస్, ఫుల్ హ్యాండ్స్.. అయినా ఫరవాలేదు. కానీ వేసుకున్న ప్యాంట్‌కు నప్పేలా చూసుకోవాలి

బూట్లు: బ్యాగీ ప్యాంట్‌కు బూట్లు, స్పోర్ట్స్ షూస్ చాలా బాగా నప్పుతాయి. పెద్ద హీల్ ఉన్న బూట్లు, యాంకిల్ లెంగ్త్ బూట్లు ఎంచుకోవచ్చు.





రాత్రివేళల్లో మెట్రో స్టేషన్ల దగ్గర మహిళలపై లైంగిక వేధింపులు

» రాత్రి సమయాల్లో బోగీల్లో లైటింగ్ తక్కువ

» ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ విద్యార్థుల సర్వేలో వెల్లడి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్వే స్టేషన్ల వద్ద రాత్రి పూట మహిళా ప్రయాణికులు లైంగిక వేధింపులు, ఆకతాయిల ఆగడాలను ఎదుర్కొంటున్నట్లు ఈథేమ్స్ బిజినెస్ స్కూల్‌కు చెందిన బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ) సెకండియర్ విద్యార్థుల సర్వేలో తేలింది. రాత్రి సమయాల్లో మెట్రో బోగీల్లో లైటింగ్ తక్కువగా ఉంటున్నట్లు వెల్లడైంది. మెట్రో రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలు, మహిళలకు ప్రత్యేక బోగీలు ఉన్నప్పటికీ సిబ్బంది పర్యవేక్షణ కొరత ఉందని మహిళా ప్రయాణికులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో రోజుకు సగటున 4.80 లక్షల మందికి ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న మెట్రో రైళ్లలో మహిళల ప్రయాణం, భద్రతపై విద్యార్థులు 15రోజుల పాటు సర్వే నిర్వహించారు. ఆ రిపోర్టును మంగళవారం ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ చైర్మన్ కాశీప్రసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. విద్యార్థులు అమీనాబేగం, ఖతీజా తుల్‌కుబ్రా, తరుణిరెడ్డి, సుఖ్‌జోత్‌సింగ్ ఈ రిపోర్టును రూపొందించారు. ఈ రిపోర్టును మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీ శిఖాగోయల్‌కు కూడా అందజేశారు. విద్యార్థులు ప్రపంచంలోని 247పైగా మెట్రోలు, మన దేశంలోని 15 మెట్రోలతో హైదరాబాద్ మెట్రోను పోల్చి చూశారు. అన్నింటితో పోల్చి చూస్తే హైదరాబాద్ మెట్రో భద్రతాపరంగా బాగుందన్నారు.

టీ సేఫ్ యాప్‌పై అవగాహన అంతంతే

ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు రాయదుర్గం, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-5, పంజాగుట్ట, ఎర్రమంజిల్, ప్యారడైజ్, సికింద్రాబాద్ ఈస్ట్, ఉప్పల్, నాగోల్ తదితర స్టేషన్లలో ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు 15 రోజులపాటు సర్వే నిర్వహించారు. మొత్తం 410 మంది ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సర్వే ప్రకారం.. మెట్రో స్టేషన్ల దగ్గర తాము లైంగిక వేధింపులకు గురైనట్లు 11% మంది మహిళలు చెప్పారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలకు టీ సేఫ్ యాప్/హెల్ప్‌లైన్లపై అవగాహన అంతంతమాత్రమే. ప్రయాణికుల్లో 12% మందే వీటిని వినియోగిస్తున్నారు.

భద్రతా చర్యలను మెరుగుపరుస్తాం: ఎన్వీఎస్ రెడ్డి


ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ విద్యార్థుల రిపోర్టుపై ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వేలోని సిఫారసులు మహిళా ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని భద్రతా చర్యలను మెరుగుపరుస్తామని చెప్పారు. బిజినెస్ స్కూల్ విద్యార్థుల అధ్యయనం తమకు మరింత శక్తినిస్తుందని శిఖాగోయల్ అన్నారు. మెట్రోలో ప్రతి మహిళా గౌరవంతో, ఆత్మ విశ్వాసంతో ప్రయాణించే విధంగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

రెండు నెలల్లో పది తీర్పులు

సంచలన తీర్పులిచ్చిన నల్లగొండ పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయాధికారి రోజారమణి

» ఒకరికి ఉరి శిక్ష, మరొకరికి 51 ఏళ్ల జైలు

» 20 ఏళ్లకు తగ్గకుండా జైలు శిక్షలు



జడ్జి రోజారమణి

నల్లగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి ఎన్.రోజా రమణి సంచలన తీర్పులిస్తూ పోక్సో చట్టం ఉద్దేశాన్ని నెరవేరుస్తున్నారు. జులై 4 నుంచి ఈ నెల 16 వరకు పది పోక్సో కేసుల్లో తీర్పులిచ్చారు. వీటిలో ఒక కేసులో దోషికి ఉరి శిక్ష విధించగా, మిగిలిన కేసుల్లో కనీసం 20 ఏళ్లకు తగ్గకుండా శిక్షలు విధించారు. ప్రతి కేసులో బాధితులకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. మంగళవారం ఇచ్చిన ఒక తీర్పులో.. దోషి మర్రి ఊషయ్య (63)కు 23 ఏళ్ల జైలు శిక్ష విధించడం ఈ కేసులపై జడ్జిల అప్రమత్తతకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ఈ సంచలన తీర్పులపై అన్ని వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

ఉరి శిక్ష పడిన మొదటి కేసు

నల్లగొండలో 2013 ఏప్రిల్ 28న నిందితుడు ముఖ్రం తన మాంసం దుకాణం సమీపంలోని ఒక బాలిక ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా చున్నీతో ఉరేసి చంపాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి ఆగస్టు 14న నిందితుడికి ఉరి శిక్షతో పాటు 1.10 లక్షల జరిమానా విధించారు. పోక్సో కేసుల్లో నల్లగొండ కోర్టులో గరిష్ఠ శిక్ష పడిన మొదటి కేసు ఇదే. హతురాలి తల్లికి10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్టీ బాలికపై అత్యాచారం కేసులో 51 ఏళ్ల జైలు

ఎస్టీ బాలికను కారులో కిడ్నాప్ చేసి.. ఆపై లైంగిక దాడికి పాల్పడ్డ మహమద్ ఖయ్యూంకు 51 ఏళ్ల జైలు శిక్ష, రూ.80 వేల జరిమానా విధిస్తూ ఆగస్టు 26న తీర్పునిచ్చారు. పోక్సో చట్టం కింద 20 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద మరో 20 ఏళ్లు, ఎస్టీ బాలికను కిడ్నాప్ చేసినందుకు 10 ఏళ్లు, నేరపూరిత బెదిరింపులకు పాల్పడినందుకు మరో ఏడాది కలిపి మొత్తం 51 ఏళ్ల జైలు, 80 వేల జరిమానా విధించారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదనే సంకేతం



తప్పు చేస్తే శిక్ష తప్పదనే సంకేతాన్ని ఈ తీర్పులు ఇస్తున్నాయి. నేరం చేయకుండా, నేరపూరిత ఆలోచనలు కలగకుండా ఉండేందుకే పోక్సో చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయి. మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడమనే నేరం క్షమించరానిది.

- శరత్‌చంద్ర పవార్, ఎస్పీ, నల్లగొండ జిల్లా

విద్యార్థినిపై రేప్ కేసులో 23 ఏళ్ల జైలు శిక్ష

ఇంట్లో నిద్రిస్తున్న పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 62 ఏళ్ల నిందితుడు మర్రి ఊషయ్యకు పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధించారు. మరో మూడు సెక్షన్ల కింద ఒక్కో సంవత్సరం చొప్పున మూడేళ్లు కూడా జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. ఈ నాలుగూ శిక్షలు ఏకకాలంలో అమలవుతాయి. 40 వేలు జరిమానా విధించడంతో పాటు జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ద్వారా బాధితురాలికి 10 లక్షల పరిహారం అందజేయాలని తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

20 ఏళ్లకు తగ్గకుండా శిక్షలు

పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించి గర్భవతిని చేసి వదిలేసిన కేసులో నిందితుడు అల్లం మహేష్‌కు జూలై 4న ఇచ్చిన తీర్పులో 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.35 వేల జరిమానా విధించారు. ఇలాంటిదే మరో కేసులో జూలై 31న నిందితుడు కట్టంగ వలిగొండ వెంకన్నకు 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు. ఈ నెల 4న ఇచ్చిన ఒక తీర్పులో తిప్పర్తి యాదయ్య అనే నిందితుడికి 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.35 వేల జరిమానా విధించారు. ఈ అన్ని కేసుల్లో బాధితురాళ్ల ఒక్కొక్కరికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. అదే రోజున మరో కేసులో నిందితుడైన భాస్కరాచారి అనే లారీ క్లీనర్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. ఈ నెల 11న ఇచ్చిన మరో తీర్పులో నిందితుడు జడిగల హరీష్‌కు 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు. హరీష్ ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నెల 15న ఇచ్చిన మరో తీర్పులో ఇంట్లో నిద్రిస్తున్న బాలికపై మద్యం మత్తులో లైంగిక దాడి చేసిన నిందితుడు దోమల రాములకు 21 ఏళ్ల జైలు, రూ.30 వేల జరిమానా విధించారు.

పోక్సో చట్టం ఏం చెబుతోందంటే...

పిల్లలకు లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు భారత ప్రభుత్వం పోక్సో చట్టం-2012ను అమలు చేస్తోంది. 18 ఏళ్లలోపు బాలబాలికలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడిన దోషులకు ఈ చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలవుతాయి. గరిష్ఠంగా ఉరి శిక్ష, యావజ్జీవ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. కనీసం 10 ఏళ్ల జైలు శిక్ష విధించవచ్చు. రూ.25 వేల నుంచి జరిమానా విధించవచ్చు. బాధితులకు ప్రభుత్వం నుంచి గరిష్ఠంగా 10 లక్షల వరకు పరిహారం అందిస్తారు. కాగా, పోక్సో చట్టం కింద నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నా బాలికలపై లైంగిక దాడులు ఆగడం లేదు. ఇటీవల నకిరేకల్‌కు చెందిన ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అతనిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఏడాది నల్లగొండ జిల్లాలో మొత్తం 27 పోక్సో కేసులు నమోదయ్యాయి. గతేడాది ఈ సంఖ్య 108గా ఉంది.

పాల ప్యాకెట్లకే డబ్బుల్లేవు!

రూ.3 కోట్లు ఎక్కడి నుంచి తెస్తాం?

» గ్రూప్-1 ర్యాంకర్లపై అసత్య ప్రచారం వద్దు

» వారి జీవితాలను రాజకీయం చేయొద్దు

» అమ్మింది ఎవరు, కొన్నది ఎవరు? ఆధారాలున్నాయా?

» సమాజంలో తలెత్తుకొని తిరగలేకపోతున్నాం

» కన్నీటిపర్యంతమైన గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రులు

పంజాగుట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కష్టపడి, పస్తులుండి, అప్పులు చేసి మరీ పిల్లలను చదివించామని.. రేయింబవళ్లు శ్రమించి వాళ్లు గ్రూప్-1లో ర్యాంకులు తెచ్చుకున్నారని.. అలాంటి వారిపై అసత్య ప్రచారాలు చేయొద్దని ర్యాంకర్ల తల్లిదండ్రులు వేడుకున్నారు. 'పాల ప్యాకెట్లకే డబ్బులు లేవు. రూ.3 కోట్లు ఎక్కడి నుంచి తెస్తాం? మూడు కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో తెలియదు. డబ్బులిచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. మా బిడ్డల జీవితాలను రాజకీయం చేయొద్దు. అమ్మింది ఎవరు? కొన్నది ఎవరు? ఆధారాలు ఉంటే చూపించండి' అని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు వచ్చాయని సంతోషపడుతున్న సమయంలో తమ నోటిదగ్గర ముద్దను లాగేశారని వాపోయారు. ఇరుగుపొరుగు వారి అనుమానపు చూపులతో సమాజంలో తలెత్తుకుని తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ కన్నీటిపర్యంతమయ్యారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022 ఏప్రిల్‌లో ప్రక్రియ ప్రారంభించిందని.. మూడేళ్లుగా అనేక అడ్డంకులు ఎదుర్కొంటూ తమ పిల్లలు పరీక్షలు రాసి, ర్యాంకులు సాధించారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు సన్మానాలు కూడా చేశారని, త్వరలోనే తమ పిల్లలు గ్రూప్-1 అధికారులుగా విధుల్లో చేరతారని సంబరపడ్డామని తెలిపారు. కానీ, ఇప్పుడు తమ సంతోషం ఆవిరైందన్నారు. ఓ వైపు కోర్టు తీర్పు, మరోవైపు రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగాలు కొన్నామన్న రాజకీయ నాయకుల అసత్య ఆరోపణలతో తమ పిల్లలను సన్మానించిన వారే అనుమానిస్తున్నారని వాపోయారు. పిల్లల జీవితాలను రాజకీయం చేయొద్దని కోరారు. కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నిరూపించాలని సవాలు చేశారు. తమ పిల్లలు కష్టపడి చదివి ర్యాంకులు తెచ్చుకున్నారని తాము నిరూపిస్తామని చెప్పారు.

రూ.30 వేలే చూడలేదు..- 368వ ర్యాంకర్ తల్లి.

నాకు ఇద్దరు పిల్లలు. భర్త లేడు. రూ.11,700కు ఒక పాఠశాలలో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నా. పెద్ద కొడుకును కలెక్టర్‌గా చూడాలని ఆశ. నేను, చిన్న కొడుకు కష్టపడి పని చేశాం. పెద్ద కొడుకు 368వ ర్యాంకు తెచ్చుకున్నాడు. మా ఆశల మీద నీళ్లు చల్లారు. రూ.30 వేలే కలలో కూడా చూడలేదు. రూ.3 కోట్లు ఎక్కడి నుంచి తెస్తాం? ఉద్యోగం కోసం ఒక్క రూపాయి పెట్టినట్లు రుజువు చేస్తేముగ్గురం చనిపోవడానికి కూడా సిద్ధం.

పాల ప్యాకెట్లకే డబ్బుల్లేవు - ఓ ర్యాంకర్ తల్లి

పాల ప్యాకెట్లకే డబ్బుల్లేవు. మూడు కోట్లు ఎక్కడి నుంచి తెస్తా. నాకు ఏడుగురు పిల్లలు. పూట గడవడమే కష్టం. నా కూతురికి ర్యాంకు వచ్చింది. ఆమెకు ఉద్యోగం వస్తే కుటుంబానికి అండగా ఉంటుందని అనుకున్నాం. ఆరోపణలు తట్టుకోలేకపోతున్నాం. మాకు న్యాయం చేయాలి.

పిల్లలు ఏమైనా చేసుకుంటే బాధ్యులెవరు? - 67వ ర్యాంకర్ తల్లి

నా కుమారుడు ఉదయ్ కిరణ్ కష్టపడి చదివి, 67వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం రోడ్డున పడ్డాం. రూ.3 కోట్ల నింద వేయవద్దు. భరించలేక పోతున్నాం. అవమానంతో పిల్లలు ఏమైనా చేసుకుంటే ఎవరు బాధ్యులు?

కాయకష్టం చేసి చదివించాం.. - 60వ ర్యాంకర్ తండ్రి

కాయకష్టం చేసి నా కొడుకు మహేశ్‌రెడ్డిని చదివించా. కలెక్టర్‌గా చూడాలని కోరిక. గ్రూప్-1లో 60వ ర్యాంక్ సాధించాడు. ఎంతో సంతోషపడ్డాం. స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులు మా బతుకులను ఆగం చేయొద్దు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

» యాదాద్రి భువనగిరి జిల్లాలో రాస్తారోకో

చౌటుప్పల్/నర్సాపూర్/తూప్రాన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్చాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ ప్రధాన రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొంతమంది స్వార్థ ప్రయోజనాలకోసం అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. రహదారి నిర్మాణం పేరుతో తమ భూములను లాక్కొని జీవనోపాధి లేకుండా చేయొద్దని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా అలైన్‌మెంట్ మార్చాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్‌లోని సుమారు 1,048 మంది రైతుల నుంచి 758 ఎకరాల భూమి సేకరించగా.. ఎకరాకు రూ. 13 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు పరిహారంగా ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో ఎనిమిది గ్రామాల నుంచి 436.20 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ ఎకరాకు రూ.4.50 లక్షల నుంచి రూ. 6.75 లక్షల మేరకు పరిహారం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో రైతులకు అప్రూవుడ్ అంటూ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విభిన్నమైన థ్రిల్లర్



విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్‌ప్రభు తెరకెక్కించిన చిత్రం 'భద్రకాళి'. ఇది ఆయన నటించిన 25వ చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. తెలుగులో నిర్మాత సురేష్‌బాబు, హీరో రానా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ వేడుకలో విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'దేశంలోని గొప్ప దర్శకులలో అరుణ్ ప్రభు ఒకరు. ఆయనతో సినిమా చేయడం నా అదృష్టం. ఇదో విభిన్నమైన పొలిటికల్ థ్రిల్లర్' అని అన్నారు. 'విజయ్ ఆంటోని సినిమాలు అద్భుతంగా ఉంటాయి. సినిమా ఘనవిజయం సాధించాలి' అని సురేశ్‌బాబు కోరారు. 'సినిమా అందరికీ రిలేట్ అయ్యేలా ఉంటుంది' అని అరుణ్ ప్రభు తెలిపారు.

కళ్లను చూసి ఆటపట్టించేవారు



'చిన్నప్పుడు అందరూ నా కళ్లను చూసి ఆటపట్టించేవారు. 'డెత్ గేట్ ఐస్' అంటూ టీజ్ చేసేవారు. అయితే ఇప్పుడు ఆ కళ్లే నాకు ఆనందాన్నిస్తున్నాయి. వరుస అవకాశాలు తెచ్చిపెడుతున్నాయి' అని అన్నారు నటుడైన కొరియోగ్రాఫర్ శాండీ మాస్టర్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి'. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శాండీ మీడియాతో మాట్లాడుతూ "లియో' సినిమా తర్వాత నాకు అన్నీ సైకో పాత్రలే వచ్చాయి. ఇలాంటి సమయంలో 'లోక', 'కిష్కింధపురి' సినిమాల్లో విభిన్నమైన పాత్రలతో వరుస విజయాలను అందుకోవడం ఆనందంగా ఉంది. ఓంకార్ 'ఛాలెంజ్-3' షో కోసం హైదరాబాద్ వచ్చాను. 'పోతే పోనీ పోరా...' పాట నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది. 'కిష్కింధపురి'లో నా నటనను చూసి దర్శకులు పా రంజిత్, లోకేశ్ కనగరాజ్ అభినందించారు. కొరియోగ్రఫే నా బేస్. కచ్చితంగా కొరియోగ్రఫీ చేస్తాను. అయితే ప్రస్తుతం నేను నటన మీద దృష్టి కేంద్రీకరించాను. ఈ రెండూ బ్యాలెన్స్ చేస్తూ చేయాలని ఉంది. నాకు దర్శకత్వం మీద కూడా ఆసక్తి ఉంది. అయితే దానికింకా సమయం ఉంది' అని చెప్పారు.

మెగాస్టార్‌తో మేజర్ సాబ్

జమ్ము కశ్మీర్ నియంత్రణ రేఖ దగ్గర జరిగిన దాడుల్లో పాక్ ఉగ్రవాదులను అంతమొందించి, సహచర సైనికులను రక్షించడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించారు మేజర్ మల్లా రామ్‌గోపాల నాయుడు. ఆయన సాహసాన్ని మెచ్చుకుంటూ కీర్తిచక్ర అవార్డును అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. మేజర్ రామ్‌గోపాలనాయుడు మెగాస్టార్ చిరంజీవి అభిమాని కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో రామ్‌గోపాల నాయుడు దంపతులు చిరంజీవిని కలిశారు. దేశ రక్షణలో ఎప్పుడూ ముందుండే రియల్ హీరో తనని కలవడం ఆనందంగా ఉందనీ, ఆయన తన అభిమాని కావడం ఎంతో గర్వకారణమనీ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.



'మిరాయ్' విజయం ఆనందాన్ని ఇచ్చింది



హరి గౌర

"మిరాయ్' ఘన విజయం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి సక్సెస్ వచ్చినప్పుడు సినిమా కోసం పడ్డ కష్టం మర్చిపోతాం. మా నిర్మాత, దర్శకుడు, కథానాయకుడు సహా మొత్తం చిత్రబృందం సంతోషంగా ఉంది' అని అన్నారు సంగీత దర్శకుడు హరి గౌర. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై మంచి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరి గౌర చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- దర్శకుడు కార్తిక్ చాలా అద్భుతమైన పిక్చర్ తీశారు. ఆ పిక్చర్ నన్ను సంగీతం సమకూర్చడానికి స్ఫూర్తినిచ్చింది. సినిమా చూస్తున్నప్పుడే అంతర్జాతీయ ప్రమాణాలకు దగ్గరగా ఉందనిపించింది.
- సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకున్న వెంటనే చాలా మంది ఫోన్ చేసి అభినందించారు. థియేటర్లలో ప్రేక్షకులు సంగీతాన్ని ఎంజాయ్ చేయడం ఆనందం కలిగించింది. ఈ సినిమాలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. అది దృష్టిలో పెట్టుకున్ని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇచ్చాను.
- మిరాయ్ అనే ఆయుధానికి లార్డ్ శివ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉపయోగించాను. ఇది శ్రీరాముల వారి ఆయుధం అయినప్పటికీ దానికి పినాక అనే పేరు ఉంది.
- ఈ సినిమా కోసం రకరకాల జానర్స్‌ని ఉపయోగించాను. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో నాలుగు జానర్స్‌లో సౌండ్‌ని మిక్స్ చేసి ప్రెజెంట్ చేసే అవకాశం రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.
- చిత్రబృందం నిర్ణయం మేరకే వైబ్ వుంది అనే పాటను సినిమాలో చేర్చలేదు. సినిమాకి ఏది అవసరమో అది చేయడమే కరెక్ట్.

వినోదభరిత ప్రేమకథ



యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్, ఉల్క గుప్తా జంటగా వి భీమశంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. శివాజీ, భూమిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్ ఇందులోని వినోదం, సంభాషణలు ఆకట్టుకున్నాయి. 'సినిమాలో యూత్‌తో పాటూ కుటుంబ ప్రేక్షకులను మెప్పించే కంటెంట్ ఉంది. ప్రస్తుత కాలం ప్రేమలోని అంశాలను వినోదభరితంగా చూపించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.

సరికొత్త లోకంలోకి తీసుకెళ్లే చిత్రం

సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా జంటగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'జటాధర'. ఉమేశ్‌కుమార్ బన్సాల్, ప్రేరణ్ అరోరా, శివిన్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచింది. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్ నవంబరు 7న చిత్రాన్ని పాన్‌ఇండియా లెవెల్లో ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు రిలీజ్ డేట్ పోస్టర్ ద్వారా తెలిపారు. ఈ మైథలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఓ సరికొత్త లోకంలోకి తీసుకెళ్తుందని చెప్పారు.



హాలీవుడ్ నటుడు రాబర్ట్ రెడ్‌ఫోర్డ్ ఇకలేరు



హాలీవుడ్ నటుడు, దర్శకుడు రాబర్ట్ రెడ్‌ఫోర్డ్(89) ఉటాలోని తన నివాసంలో మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. 70, 80వ దశకంలో ఆయన నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాలు విశేష ప్రేక్షకాదరణ పొందాయి. 'ద క్యాండిడేట్', 'ఆల్ ద ప్రెసిడెంట్స్ మెన్', 'ద వే వియ్ వర్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు ఆయన. పాత్రకు తగ్గట్టు తన లుక్‌ను మార్చుకోవడంలో ఎంతో పట్టుదల చూపించేవారు. ఆ తర్వాత 1980లో ఆయన తెరకెక్కించిన 'ఆర్డినరీ పీపుల్'తో ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అవార్డు అందుకొన్నారు.

అమ్మాయిలకు వాళ్ల నాన్న గుర్తొస్తారు

- వీకే నరేశ్



'చాలా సినిమాల్లో తల్లీ కొడుకుల అనుబంధాన్ని చూపించారు. కానీ తండ్రీ కూతుళ్ల బంధాన్ని చాలా తక్కువ చిత్రాల్లో చూపించారు. ఈ సినిమా చూసి అమ్మాయిలకు వాళ్ల నాన్న గుర్తొచ్చి కంట్లో నీళ్లు రాకపోతే నన్ను అడగండి. ఇంట్లో అన్నీ అమ్మ అయితే ఇంటికి కాంపౌండ్ వాల్ లాంటివాడు నాన్న. ఆ భావోద్వేగమే 'బ్యూటీ' సినిమా' అని అన్నారు సీనియర్ నటుడు వీకే నరేశ్. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. విజయ్‌పాల్ రెడ్డి అడిదల, ఉమేశ్ కుమార్ బన్సల్ నిర్మించారు. సినిమా ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రంలో కీలక పాత్రలు పోషించిన వీకే నరేశ్, నటి వాసుకీ మీడియాతో మాట్లాడారు. మొదట నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాని దర్శకుడు వర్ధన్ అందంగా మలిచాడు. ఫ్యామిలీ మొత్తం కూర్చొని చూడొచ్చు' అని చెప్పారు. నటి వాసుకీ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఉండాల్సిన స్థాయిలో భావోద్వేగాలు ఉన్నాయి. కథలోని ముఖ్యమైన పాయింట్ ఒక తల్లిగా నాకు కనెక్ట్ అయ్యింది. తల్లికి, కూతురికి ఉండాల్సిన అవగాహన, బాధ్యతను ఈ కథలో చూపించాం' అని అన్నారు.

నా మనసులో 'కణ్మని'కి ప్రత్యేక స్థానముంటుంది



"ఓజీ'తో దాదాపు రెండున్నరేళ్ల ప్రయాణం నాది. అది ఎప్పటికీ మరచిపోలేను. పవన్ కల్యాణ్ గారితో కలసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన సరసన 'కణ్మని' పాత్రలో నటించడం మరింత అదృష్టం. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రల్లో 'కణ్మని' నాకు చాలా ఇష్టమైన పాత్ర. ఈ పాత్రకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానముంటుంది' అని అన్నారు కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రియాంక అరుళ్ మోహన్ మీడియాతో ముచ్చటించారు.

- పవన్ కల్యాణ్ గారితో పని చేయడం అనేది ప్రతి రోజూ అదృష్టమే. ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన జెంటిల్ మేన్. అందరినీ సమానంగా చూస్తారు. ఆన్‌స్క్రీన్‌లో, ఆఫ్ స్క్రీన్‌లో ఆయన హీరో.
- 1980-90లలో జరిగే కథ ఇది. పాత్రను మలిచిన తీరు కానీ, ఆహార్యం కానీ ఆ కాలానికి తగ్గట్టుగానే ఉంటాయి. 'కణ్మని' ఓ అందమైన అమాయక పిల్ల. గంభీర పాత్రతో గాఢమైన ప్రేమలో ఉంటుంది.
- ఈ సినిమాలో యాక్షన్ ఒక భాగం మాత్రమే. బలమైన కథ ఉంది. ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. అలాగే వేరే భాషల్లో పలు సినిమాలు చేస్తున్నాను.

స్త్రీ శక్తిని తెలియజేసే చిత్రం



సదన్ హసన్, విక్రమ్ జిత్, నరేశ్ రాజు, వినయ్ బాబు హీరోలుగా, శ్రీలు దాసరి, అదితి మైకేల్, మోహన సిద్ధి హీరోయిన్లుగా నరసింహ నంది తెరకెక్కిస్తోన్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. స్రవంతి మల్లిక్, నరేశ్ గౌడ్ నిర్మాతలు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ 'ఈ సినిమాలోని ప్రతి పాత్ర మన పురాణాల్లోని ఏదో ఒక పాత్రను, దాని వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంది' అని తెలిపారు. చిత్ర నిర్మాతలు నరేశ్ గౌడ్, స్రవంతి మల్లిక్ మాట్లాడుతూ 'ఒక గ్రామంలో జరిగే కొన్ని వాస్తవ సంఘటనలను తీసుకొని స్త్రీ శక్తిని తెలియజేసేలా చేసిన సినిమా ఇది. ఇటువంటి సినిమా తీయడం అదృష్టంగా భావిస్తున్నాం' అని అన్నారు.



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కిషన్‌రెడ్డి, బండి సంజయ్

మన పోరాట చరిత్రకు ప్రతీక తెలంగాణ విమోచన దినోత్సవం

» నేటి సభకు రాజ్‌నాథ్‌సింగ్ హాజరు: రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మన పోరాట చరిత్రకు ప్రతీక తెలంగాణ విమోచన దినోత్సవమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. నిజాయితీ, స్వాభిమానం, ధైర్యాన్ని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచే కాలమిది అని పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పరేడ్‌గ్రౌండ్స్‌లో బుధవారం జరిగే విమోచన దినోత్సవ సభకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా, కంటోన్మెంటు పార్కులో దివంగత ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కూడా ఉంటుందన్నారు. కాగా, విమోచన దినోత్సవంలో పాల్గొనేందుకు రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాంచందర్‌రావు, ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎం. రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్‌లు స్వాగతం పలికారు. కాగా, కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఐటీసీ కాకతీయలో ఆయన్ను ప్రత్యేకంగా కలుసుకున్నారు.



సింగరేణి సీఎండీ బలరామ్‌కు బంగారం, రాగి అన్వేషణ లైసెన్సు అందజేస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

సింగరేణికి బంగారం, రాగి అన్వేషణ లైసెన్సు

» సింగరేణి సీఎండీకి అందజేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్/గోదావరిఖని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్సు పొందింది. ఈ లైసెన్సును కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు అందించారు. గత మార్చి నెలలో జరిగిన కీలక ఖనిజాల వేలంలో 37.75 శాతం రాయల్టీతో 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల ఈ అన్వేషణ పనిని సింగరేణి దక్కించుకుంది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా

న్యూఢిల్లీ: కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం కొత్త కార్పొరేట్ శాలరీ ప్యాకేజీని ప్రారంభించారు. దీనిలో భాగంగా కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు రూ.1 కోటి వ్యక్తిగత ప్రమాద బీమాను, కాంట్రాక్టు కార్మికులకు రూ. 40 లక్షల బీమా కవరేజిని ప్రకటించారు. ఈ పథకానికి ఉద్యోగులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. దీనిని 10 ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఛత్తీస్‌గఢ్ స్టేట్ గ్రామీణ బ్యాంకుతో కుదిరిన ఒప్పందం ద్వారా అమలు చేస్తున్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా, మైనింగ్ ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని కూడా పెంచారు. ఇంతకుముందు రూ.15 లక్షలుగా ఉన్న ఈ పరిహారాన్ని ఇప్పుడు రూ. 25 లక్షలకు పెంచారు.

తెలంగాణ విలీన దినంపైనా రాజకీయమా?

» అప్పటికి బీజేపీ పుట్టనేలేదు: మహేష్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చివరికి తెలంగాణ విలీన దినోత్సవాన్నీ రాజకీయం చేయాలని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని, విలీనం జరిగినప్పుడు ఆ రెండు పార్టీలూ పుట్టనే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆనాడు నిజాంకు వ్యతిరేకంగా రామానంద తీర్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పోరాటం చేసిందని చెప్పారు. కమ్యూనిస్టులూ పోరాడారని తెలిపారు. అప్పుడు బీజేపీ ఎక్కడుందని ప్రశ్నించారు. నాటి ప్రధాని నెహ్రూ సూచన మేరకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆపరేషన్ పోలో నిర్వహించారని, లొంగిపోయిన నిజాం రాజు.. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని వివరించారు. ఆ నేపథ్యంలోనే దశాబ్దాలుగా సెప్టెంబరు 17ను కాంగ్రెస్ విలీన దినోత్సవంగా నిర్వహిస్తోందని, బుధవారం గాంధీభవన్‌లో విలీన దినోత్సవం నిర్వహించనున్నామని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

పేలుళ్లకు అనుమతులు ఎలా ఇచ్చారో చెప్పండి ?

» జూబ్లీహిల్స్‌లో కొండరాళ్ల తొలగింపులో సీపీ వివరణపై హైకోర్టు అసహనం, నోటీసులు

హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని న్యాయవిహార్ ప్రాంతంలో భారీ భవనాల నిర్మాణంలో భాగంగా కొండరాళ్ల తొలగింపునకు 24 గంటల పాటు భారీ పేలుళ్లు చేపట్టిన వ్యవహారంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్(సీపీ) ఇచ్చిన వివరణపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో చేపట్టిన పేలుళ్లకు సంబంధించిన అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై జరిగిన గత విచారణలో.. పేలుళ్లకు ఏ ప్రాతిపదికన అనుమతి ఇచ్చారో చెప్పండంటూ హైకోర్టు సీపీని ఆదేశించింది. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై మంగళవారం మళ్లీ విచారణ చేపట్టింది. ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. నిర్మాణ ప్రాంతంలో కొండరాళ్లను తొలగించేందుకు అనుమతి ఇచ్చే అధికారం సీపీకి ఉంటుందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. తాము అడిగిన సమాచారం సీపీ ఇవ్వలేదని పేర్కొంది. ఈ అంశంలో హైదరాబాద్ సీపీని ప్రతివాది చేర్చి వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది.

కేంద్ర సర్వీసుల్లోని వారి పిల్లలకూ స్థానికత వర్తింపజేయాలి

తెలంగాణలో వైద్య విద్య ప్రవేశాలపై సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వర్తింపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కేంద్ర సర్వీసుల్లో పనిచేసే వారి పిల్లలకూ స్థానికత వర్తింపజేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం ఈ అంశం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ముందువచ్చింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానిక కోటాకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం సరిగా అమలు చేయడం లేదని.. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనందున దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని ధర్మాసనాన్ని పిటిషనర్ న్యాయవాది కోరారు. "ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల ఉద్యోగుల పిల్లలను స్థానిక అభ్యర్థులుగా పరిగణించాలి. కానీ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకే ఈ ప్రయోజనం కల్పిస్తోంది. కేంద్ర సర్వీసుల్లోని వారి పిల్లలను పరిగణనలోకి తీసుకోవడం లేదు" అని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.. దీనిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనందున, తక్షణమే స్పష్టత కోరుతూ పిటిషన్ దాఖలు చేశామని పిటిషనర్ న్యాయవాది వివరించారు. దీనిపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది.

'జూబ్లీహిల్స్' అభ్యర్థి ఎవరో..?

- » తేల్చడంలో కాంగ్రెస్ డైలమా..!
- » పెరుగుతున్న ఆశావాహులు..
- » ప్రచారంలో పలువురు నేతల పేర్లు
- » మాజీ ఎంపీ అంజన్ కుమార్..

పలువురి నేతల పేరిట పోస్టర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఖరారు చేయడంలో అధికార కాంగ్రెస్ అయోమయంలో పడింది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ భార్యను ప్రకటించగా.. అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని ఖరారు చేయడంలో డైలామాలో పడింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్‌కు కలిసివచ్చిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయడానికి ఆశావాహులు పుట్టుకొస్తున్నారు. అభ్యర్థిని ఖరారు చేయడంలో ఎంత ఆలస్యమైతే.. అంతమంది నేతలు తానే అభ్యర్థినంటూ ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. తాజాగా మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పేరిట నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. 'రావాలి అంజన్న.. కావాలి అంజన్న' అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు. ఇప్పటికే తాను జూబ్లీహిల్స్‌లో పోటీ చేయనున్నట్లు అంజన్‌కుమార్ ప్రకటించారు. అయితే అంజన్‌కుమార్ కొడుకు రాజ్యసభ ఎంపీగా ఉన్న నేపథ్యంలో వాళ్ల కుటుంబానికి మరోసారి అవకాశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తన తండ్రి పార్టీలో సీనియర్‌గా ఉన్నారని, గతంలో ఎంపీగా రెండుసార్లు గెలుపొందారని, అధిష్ఠానం ఆదేశాలిస్తే పోటీ చేసి గెలుపొందుతారని ధీమాను వ్యక్తం చేశారు. ఇక స్థానిక కాంగ్రెస్ యువనేత నవీన్‌యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేరిట కూడా పోస్టర్లు వెలిశాయి. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్, మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ కోడలు కంజర్ల విజయలక్ష్మి కూడా టికెట్ ఆశిస్తున్నారు. అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తూనే ప్రజల మద్దతు కోసం ఎవరి దారిలో వారు ప్రచారం సాగిస్తున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌ను పార్టీ ఫిరాయింపు అంశం వెంటాడుతున్న నేపథ్యంలో ఆయన జూబ్లీహిల్స్ నుంచి బరిలో నిలుస్తారనే ప్రచారం సాగుతోంది. జూబ్లీహిల్స్‌లోనే నివాసముంటున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు సినీ పరిశ్రమకు చెందిన వారెవరినైనా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దింపితే ఎలా ఉంటుందన్న అంశంపై తర్జనభర్జన చేస్తున్నట్లు తెలిసింది.

ఇప్పటికే స్థానికులకేనని పొన్నం స్పష్టత

జూబ్లీహిల్స్ అభ్యర్థిగా స్థానికులకే అవకాశం కల్పిస్తామని, బయటి వారికి అవకాశం ఉండదని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నెలరోజుల క్రితం విలేకర్ల సమావేశంలో కొంత వరకు స్పష్టతనిచ్చారు. దీంతో స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్‌రెడ్డి, మురళీగౌడ్, కంజర్ల విజయలక్ష్మిలకు ఆశలు పెరిగాయి.

విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్!

- » సమీకృత గురుకులాలకు రూ.21వేల కోట్లు
- » ఉన్నత స్థాయి, టెక్నికల్, డిజిటల్ విద్య కోసం మరో రూ.9 వేల కోట్లు అవసరం
- » మొత్తం రూ.30 వేల కోట్ల రుణాలకు సర్కారు ప్లాన్
- » దీనికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం
- » ఈ రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఏర్పాట్లు
- » కార్పొరేషన్‌కు కేంద్రం ఆమోదిస్తే అసెంబ్లీలో బిల్లు



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. అందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ఆ నిధులతో అంగన్‌వాడీల (ప్రీ-ప్రైమరీ) నుంచి ఉన్నత, సాంకేతిక విద్య వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల కోసం రూ.21 వేల కోట్లు, ఉన్నత, సాంకేతిక, డిజిటల్ విద్య కోసం రూ.9 వేల కోట్లు కలిపి రూ.30వేల కోట్ల వరకు నిధులు అవసరమని తేల్చింది. ఈ నిధుల సేకరణ కోసం, ఆ రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఉండటం కోసం 'ప్రత్యేక కార్పొరేషన్' ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. దీనిపై అధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు. కార్పొరేషన్ ఏర్పాటుకు ఉన్న నియమ, నిబంధనలు, రాబడి, ఖర్చు, తిరిగి చెల్లింపులు ఎలా ఉంటాయనే వివరాలతో కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించి.. ఆమోదం రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి, ఆమోదించాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఆ భూములన్నీ కొత్త కార్పొరేషన్‌కు బదిలీ..

కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి, రుణాలు సేకరించాలంటే.. దాని కింద ఉన్న భూములు, ఆదాయ మార్గాలను కూడా చూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రస్తుతం సమీకృత గురుకులాల కోసం సేకరిస్తున్న భూములన్నింటినీ కార్పొరేషన్ భూములుగా చూపించనున్నారు. ఒక్కో గురుకులం కోసం 20-25 ఎకరాలను సేకరిస్తున్నారు. ఆ భూములను ప్రత్యేక కార్పొరేషన్ ఆస్తిగా మార్చి, రుణాల కోసం తనఖా పెడతారు. ఈ రుణాలను తిరిగి చెల్లించే అంశంలో పక్కాగా వ్యవహరించాలని, నిపుణుల సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమీకృత గురుకులాలు, ప్రభుత్వ కాలేజీల ఉన్నతీకరణతో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని భావిస్తోంది. ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ అంశాలన్నీ వివరించారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది.

గత ప్రభుత్వంలో ఆస్పత్రుల కోసం కార్పొరేషన్..

భారీ నిర్మాణాలు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు రుణాల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం సాధారణమే. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, నిమ్స్ విస్తరణ కోసం 'సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేసింది. అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయనుంది. సమీకృత గురుకులాల నిర్మాణం, టీచర్లకు శిక్షణ, పాఠశాల, ఉన్నత విద్యలో మౌలిక సదుపాయాల కోసం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ)ల నుంచి రూ.15,396 కోట్లను రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు ఇతర బ్యాంకుల నుంచి కూడా కొంతమొత్తంలో రుణాల సేకరణకు ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది.

మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

(మొదటిపేజీ తరువాయి)

సంచాలకులు కృష్ణ ఆదిత్యకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ కోట శ్రీవత్సకు హెచ్ఎండీఏ (జనరల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా, హెచ్ఎండీఏ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

నాన్-కేడర్ అధికారుల బదిలీలు

పలువురు నాన్-కేడర్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖలో జనరల్ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై పని చేస్తున్న సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ ఎం.రాజిరెడ్డిని బదిలీ చేసి, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా నియమించింది. ఆదిలాబాద్ జడ్పీ సీఈవో జి.జితేందర్‌రెడ్డిని బదిలీ చేసి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఎండీగా పోస్టింగ్ ఇచ్చింది. కరీంనగర్ హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్‌ను బదిలీ చేసి, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమించింది.

హైదరాబాద్ మెట్రో మ్యాన్ ఎన్వీఎస్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో మ్యాన్ అంటే.. శ్రీధరన్! కానీ, హైదరాబాద్ మెట్రో మ్యాన్ అంటే.. ఎన్వీఎస్ రెడ్డి! మెట్రో అంటే వెంటనే గుర్తుకు వచ్చేదీ ఆయన పేరే! ఇందుకు కారణం హైదరాబాద్ మెట్రోను కలగని.. దానిని పూర్తి చేయడమే! మెట్రో రైల్ ప్రాజెక్టులో ఆయనదే కీలక పాత్ర. అన్నీ తానై ముందుకు సాగి పనులను విజయవంతంగా పూర్తి చేయించారు. మెట్రో ఆరంభం అంటే 2007 నుంచీ దాదాపు 18 ఏళ్లపాటు ఆయనే మేనేజింగ్ డైరెక్టర్. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఐదుగురు సీఎంల వద్ద పని చేయడం మరో విశేషం. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో చేపట్టిన ప్రపంచంలోనే అతి పెద్ద మెట్రో రైలు ప్రాజెక్టు హైదరాబాద్‌దే! దానిని విజయవంతం చేయడంతో ఆయన ప్రత్యేక గుర్తింపు వచ్చింది. నిజానికి, 2006లో ఢిల్లీలో మెట్రో నిర్మాణం పూర్తయింది. ఆ సమయంలోనే.. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఆయనకు ప్రభుత్వం 2007లో మెట్రో ఎండీగా బాధ్యతలు అప్పగించింది. అన్ని అడ్డంకులను అధిగమించి.. మెట్రో ప్రాజెక్టు పూర్తి కావడానికి నిరంతరం శ్రమించారు.

ఆర్థిక మోసగాళ్ల వలలో ఐఏఎస్‌లు.. ఐపీఎస్‌లు!

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టారు. కొంతకాలం క్రితం శివారు జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసి సంచలనం సృష్టించిన ఐఏఎస్ అధికారి సహా.. పలువురు అధికారులు బినామీల పేరుతో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. అలా రూ.70 కోట్ల వరకు వసూలు చేసిన మహిళ ఆ తర్వాత బిచాణా ఎత్తివేసినట్లు సమాచారం. దాంతో వారిలో కొంతమంది సైబరాబాద్ పోలీసులను, ఆపై సీసీఎస్ పోలీసులను ఆశ్రయించగా.. ఇటీవల కేసు నమోదు చేసి ఆ మహిళను అరెస్టు చేసినట్లు తెలిసింది.

అంత డబ్బు వారికి ఎలా వచ్చింది?

నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకున్నట్లు తెలిసింది. ఆమె వద్ద పెట్టుబడులు పెట్టిన వారిలో ఉన్నతాధికారులకు చెందిన బినామీలు ఉన్నట్లు గుర్తించి.. వారిని విచారిస్తున్నట్లు సమాచారం. రూ. కోట్లలో పెట్టుబడులు పెట్టేంత డబ్బు వారికి ఎలా వచ్చింది? వారి వెనుక ఉన్న పెద్దవాళ్లు ఎవరు? అనే కోణంలో సమాచారం రాబడుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండా.. రూ.70 కోట్ల దాకా ఆర్థిక మోసానికి పాల్పడిన మహిళ.. ఆ డబ్బును ఏం చేసిందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పెట్టుబడులు పెట్టిన పలువురు ఉన్నతాధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి ఆమె వద్ద డబ్బులను సెటిల్ చేసుకొని వసూలు చేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో వారు ఎంత మొత్తంలో పెట్టుబడులు పెట్టారు? ఎంత వసూలు చేసుకున్నారు? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. మరోవైపు కొంతమంది యువ ఐపీఎస్ అధికారులు కూడా రియల్ ఎస్టేట్, విదేశాల్లో ఉన్న సంస్థల్లో పెట్టుబడులు పెట్టి రూ.కోట్లలో మోసపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎస్‌లతో అంటకాగిన కొంతమంది రియల్టర్ పెట్టుబడులు పెట్టించినట్లు సమాచారం. ఆ తర్వాత వాటాల్లో తేడాలు రావడంతో.. తమ డబ్బు రాబట్టుకోవడానికి ఐపీఎస్‌లు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

మెట్రో రైళ్లలో సెక్యూరిటీ గార్డులుగా ట్రాన్స్‌జెండర్ల నియామకం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

నగరంలోని మెట్రో రైళ్లలో 20మంది ట్రాన్స్‌జెండర్లను సెక్యూరిటీ గార్డులుగా ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ గార్డులుగా వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నియామక పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు అండగా నిలుస్తోందని, వారు ఆత్మగౌరవంతో జీవించాలని సీఎం రేవంత్ భావిస్తున్నారని అన్నారు. ఇప్పటికే వారికి ట్రాఫిక్ నియంత్రణలో అవకాశం కల్పించగా తాజాగా సెక్యూరిటీ గార్డులుగా అవకాశం కల్పించామని మంత్రి పేర్కొన్నారు.

4 కొత్త వంతెనలు.. 30 రహదార్ల ఉన్నతీకరణ

- » రూ.868 కోట్లతో 422 కి.మీ మేర రోడ్ల అభివృద్ధి
- » మానేరుపై హైలెవల్ బ్రిడ్జి.. నిధులు మంజూరు చేసిన కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 30 రహదారుల అభివృద్ధి, ఉన్నతీకరణతో పాటు ఓ నాలుగు చోట్ల బ్రిడ్జిలను నిర్మించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.868 కోట్లతో 422 కి.మీ. మేర రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 34 పనుల కోసం సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద కేంద్రం నిధులను మంజూరు చేసింది. ఆయా రోడ్ల వివరాలను రాష్ట్రానికి పంపింది. మొత్తం 34 పనుల్లో 4 చోట్ల నాలుగు హైలెవల్ వంతెనలు రానుండగా, మిగిలిన 30 చోట్ల రోడ్ల వెడల్పు, అభివృద్ధి చేయనున్నారు. వీటిలో కరీంనగర్ జిల్లా పరిధిలోని మానేరు నదిపై ఒక హైలెవల్ బ్రిడ్జిని రూ.77కోట్లతో నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. మంచిర్యాల జిల్లా పరిధిలో టేకుమట్ల గ్రామానికి దగ్గర్లో ఉన్న ఇందారం-కుందారం రోడ్డుపై ఒకటి, కుందారం ఎస్సీ కాలనీ దగ్గర ఒకటి, కిష్టాపూర్ దగ్గర మరొకటి కలిపి మొత్తం నాలుగు బ్రిడ్జిలను మంజూరు చేసింది. వీటి కోసం రూ.20కోట్లు ఖర్చవనుంది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి మల్యాల క్రాస్‌రోడ్ వరకు ఉన్న రోడ్డును రూ.50 కోట్లతో వెడల్పు చేసి ఉన్నతీకరించనుంది. నల్గొండ జిల్లాలోని కనగల్ క్రాస్ రోడ్డు నుంచి నాగార్జున సాగర్ క్రాస్ రోడ్డు వరకు 13.2 కి.మీ మేర రోడ్డును రూ.50 కోట్లతో ఉన్నతీకరించనుంది. ఈ పనులన్నింటినీ పూర్తిచేసిన తరువాత పూర్తి వివరాలతో కూడిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను కేంద్రానికి రాష్ట్రానికి సమర్పించాల్సి ఉంటుంది.

రజక వృత్తిదారులకు ఆధునిక ధోబీఘాట్‌లు

- » రాష్ట్ర వ్యాప్తంగా 119 ఘాట్‌ల కోసం ప్రణాళిక
- » త్వరలో అందుబాటులోకి 9.. మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా శాసనసభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రజక వృత్తిదారుల కోసం 119 ఆధునిక ధోబీఘాట్‌లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా రజక వృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రజక వృత్తిదారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సచివాలయంలోని తన చాంబర్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ రజక వృత్తిదారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజధానిలో రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే 9 అధునాతన ధోబీఘాట్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 అధునాతన ధోబీఘాట్‌లు ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని 12 ధోబీఘాట్‌లు మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బేగంపేట ధోబీ ఘాట్‌పై రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తదితర అధికారులు, రజక వృత్తిదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

యాచకురాలిపై అత్యాచారం!

- » రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఘటన
- » మరో ఘటనలో ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం

ఇబ్రహీంపట్నం/రాజేంద్రనగర్/కుషాయిగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ కామాంధుడు కన్నూమిన్నూ కానకుండా యాచకురాలిని చెరబట్టాడు. ఈ ఘటన సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బస్టాండులో చోటు చేసుకుంది. గుజరాత్‌కు చెందిన 55 ఏళ్ల మహిళ కొంతకాలంగా ఇబ్రహీంపట్నంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో బస్టాండులో నిద్రిస్తున్న ఆమెపై గుర్తు తెలియని దుండగుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు రక్తస్రావంతో పడిపోయి ఉన్న బాధితురాలిని వనస్థలీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దుండగుణ్ని త్వరలోనే పట్టుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మరో ఘటనలో ఇద్దరు గుర్తు తెలియని మహిళల మృతదేహాలను పోలీసులు గుర్తించారు. కిస్మత్‌పూర్ బ్రిడ్జి కింద మృతదేహం ఉన్నట్లు రాజేంద్రనగర్ పోలీసులకు మంగళవారం సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సుమారు 25 నుంచి 28 సంవత్సరాల వయసు ఉన్న యువతి మృతదేహంగా గుర్తించారు. ఆమెపై అత్యాచారం చేసి అనంతరం హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో ఈ హత్య మూడు రోజుల క్రితమే జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అలాగే, చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గోనె సంచిలో మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఓ సంచిలో గోడ పక్కన పడేసిన మృతదేహాన్ని గుర్తించారు. ఆ మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో ఉన్న ఉన్నట్లు తెలిపారు. దుండగులు ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసి వెళ్లి ఉంటారని, పరిసర ప్రాంతాల సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు చర్లపల్లి పోలీసులు తెలిపారు.

కోటి ఇవ్వలేదనే రియల్టర్ శ్రీకాంత్ రెడ్డి హత్య

» ముగ్గురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

ఏఎస్‌రావునగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, కుషాయిగూడలో సంచలనం రేపిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మొగుళ్ల శ్రీకాంత్‌రెడ్డి(42) హత్యకు ఆర్థిక, భూవివాదాలే కారణమని పోలీసులు తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి తనకు ఇస్తానన్న రూ.కోటి ఇవ్వకపోవడంతో పగ పెంచుకున్న బి.ధన్‌రాజ్‌యాదవ్(32).. డానియల్(28), బి.సంతోష్‌కుమార్(38)తో కలిసి ఈ హత్యకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితులు ముగ్గురిని సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీపీ వై.వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎల్.భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుషాయిగూడ, హెచ్‌బీ కాలనీ మంగాపురం కాలనీకి చెందిన మొగుళ్ల శ్రీకాంత్‌రెడ్డి ఏఫోర్‌ఎస్ గ్రూప్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. నార్త్‌లాలాగూడ శాంతినగర్‌కు చెందిన బి.ధన్‌రాజ్‌యాదవ్ అనే రౌడీషీటర్ శ్రీకాంత్ రెడ్డి వద్ద సైట్ సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. కీసర మండలం బోగారం గ్రామంలో అమోగా ఫేజ్-1, ఫేజ్-2 పేరుతో 18ఎకరాలలో శ్రీకాంత్ రెడ్డి వెంచర్లు వేశాడు. ఈ భూములకు సంబంధించిన వివాదంలో ధన్‌రాజ్ చేసిన సాయానికి ప్రతిగా రూ.కోటి ఇస్తానని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. ఆ రూ.కోటి ఇవ్వకపోగా.. గత జూలై నుంచి ధన్‌రాజ్‌కు జీతం ఇవ్వని శ్రీకాంత్ రెడ్డి.. హఠాత్తుగా అతనిని పనిలో నుంచి తీసేశాడు. దీంతో శ్రీకాంత్‌రెడ్డిపై పగ పెంచుకుని అతన్ని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్న ధన్‌రాజ్.. లాలాగూడకు చెందిన సంతోష్ కుమార్‌తో చేతులు కలిపాడు. సంతోష్‌కు శ్రీకాంత్ రెడ్డితో గతంలో విభేదాలున్నాయి. శ్రీకాంత్‌రెడ్డిని చంపితే కేసులు, బెయిల్ సంగతి తాను చూసుకుంటానని ధన్‌రాజ్‌ను సంతోష్ కుమార్ ప్రోత్సహించాడు. ఈ క్రమంలో మల్కాజిగిరి మిర్జాల్‌గూడకు చెందిన డి.డానియల్‌తో కలిసి ధన్‌రాజ్ పథక రచన చేశాడు. ఓ చికెన్ దుకాణంలో కత్తి తీసుకుని తమ ద్విచక్ర వాహనంలో దాచుకున్నాడు. అదను కోసం ఎదురుచూస్తూ సెప్టెంబరు 2, 6, 9తేదీల్లో శ్రీకాంత్ రెడ్డి కార్యాలయం వద్ద రెక్కీ చేశారు. అనంతరం సెప్టెంబరు 12వ తేదీ సాయంత్రం 5.30గంటల సమయంలో శ్రీకాంత్‌రెడ్డి తన కార్యాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా అడ్డుకుని దాడి చేశారు. శ్రీకాంత్‌రెడ్డి మెడను వెనుక నుంచి పట్టుకున్న ధన్‌రాజ్.. అతని తలపై కత్తితో బలంగా కొట్టాడు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి కుప్పకూలిపోగా అదే కత్తితో డానియల్ విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే మరణించగా ధన్‌రాజ్, డానియల్ పరారయ్యారు. శ్రీకాంత్ రెడ్డి భార్య అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పరారీలో ఉన్న ధన్‌రాజ్, డానియల్, సంతోష్‌కుమార్‌ను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్లు, రక్తపుమరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.

బిజినెస్

వరంగల్ ● బుధవారం 17 సెప్టెంబరు 2025

హైదరాబాద్‌లో 'ట్రూయిస్ట్' జీసీసీ!

ముంబై: మరో అమెరికా దిగ్గజ కంపెనీ హైదరాబాద్‌లో తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేయనుంది. నార్త్ కరోలినా కేంద్రంగా పని చేసే ట్రూయిస్ట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ 'టెక్ సెంటర్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేయనుంది. దాదాపు 25 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,200 కోట్లు) పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు కోసం భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ పోటీపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇన్ఫోసిస్ ప్రస్తుతం ట్రూయిస్ట్ ఫైనాన్షియల్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తోంది. ముందు దేశంలో ఎక్కడో ఒక చోట తాత్కాలికంగా ఈ జీసీసీని ఏర్పాటు చేసి రెండు లేదా మూడేళ్ల తర్వాత హైదరాబాద్‌లో శాశ్వత కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనేది అమెరికా బ్యాంక్ లక్ష్యంగా తెలుస్తోంది. తొలి ఏడాది 1,000 మందితో ప్రారంభమయ్యే ఈ జీసీసీలో ఐదేళ్లు తిరిగే సరికి 3,000 వరకు ఉద్యోగాలు ఏర్పడతాయని సమాచారం.

మార్కెట్లో డాక్టర్ రెడ్డీస్ గ్యాస్ట్రో ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎసిడిటీ ఆధారిత గ్యాస్ట్రో ఇంటెస్టినల్ వ్యాధి చికిత్సలో ఉపయోగించే టెగోప్రజాన్ (50 ఎంజీ) టాబ్లెట్లను పీసీఏబీ బ్రాండ్‌నేమ్‌తో మార్కెట్లో విడుదల చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. టెగోప్రజాన్ యాసిడ్‌ను బ్లాక్ చేయగల లక్షణం కలిగిన ఔషధం అని, యాసిడ్ పెప్టిక్ వ్యాధుల (ఏపీడీ) చికిత్సలో దీన్ని వినియోగిస్తారని కంపెనీ తెలిపింది.

'వాయు'తో అపోలో ఆయుర్వేద్ జట్టు

ముంబై: ఆయుర్వేద, యోగా, ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌తో ఉన్నత విద్యా కోర్సులు అందించడం కోసం అపోలో హాస్పిటల్స్ గ్రూప్ కంపెనీ అపోలో ఆయుర్వైద్ అమెరికాకు చెందిన వివేకానంద యోగా యూనివర్శిటీతో (వాయు) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద పై విభాగాల్లో విద్యా కార్యక్రమాలు, శిక్షణ, నైపుణ్యాల మెరుగుదల, ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో ఆధార సహిత పరిశోధనను రెండు సంస్థలు ఉమ్మడిగా రూపొందిస్తాయి. ఆయుర్వేద, యోగాల్లో ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ క్లినికల్ ఇంటర్న్‌షిప్‌లు, ఔట్‌రీచ్ కార్యక్రమాలు అందించడం ఈ భాగస్వామ్య లక్ష్యంగా ప్రకటించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

బులియన్ మార్కెట్లో రికార్డుల మోత



ఆల్‌టైమ్ హైలో పసిడి, వెండి ధరలు

ఢిల్లీలో ఒక్కరోజే రూ.1,800 పెరుగుదల. రూ.1,15,100 చేరిక

- కిలో వెండి రూ.1,32,870 స్థాయికి
- రానున్న రోజుల్లో మరింత ముందుకే
- త్వరలో రూ.1.34 లక్షల స్థాయికి పసిడి ధర!
- సన్నగిల్లుతున్న దిద్దుబాటు ఆశలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ పరుగెడుతోంది. బంగారం, వెండి ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,800 పెరిగి రూ.1,15,100కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధర రూ.570 లాభంతో రూ.1,32,870కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. ర్యాలీ ఇలానే కొనసాగితే దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర త్వరలోనే రూ.1.34 లక్షలకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంగళవారం సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,698.86 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. ఔన్స్ వెండి ధరా 42.85 డాలర్లకు చేరువైంది. వెండి ధర ఈ స్థాయికి చేరడం ఇదే మొదిసారి.

'ఫ్యూచర్స్'లోనూ అదే ట్రెండ్

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు మంగళవారం రికార్డు స్థాయిని తాకాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే ఔన్స్ పసిడి ధర మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో రికార్డు స్థాయిలో 3,736.97 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లోనూ ఇదే పరిస్థితి. ఎంసీఎక్స్‌లో వచ్చే నెల డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.384 లాభంతో రూ.1,10,563కి చేరింది. ఇది సరికొత్త రికార్డు స్థాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పసిడి ధర రూ.418 లాభంతో రూ.1,11,665 రికార్డు స్థాయిని తాకింది.

ర్యాలీకి కారణాలు

- అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం రేటు
- పెద్దఎత్తున పసిడి కొంటున్న కేంద్ర బ్యాంకులు
- ప్రధాన కరెన్సీలతో క్షీణిస్తున్న అమెరికా డాలర్ మారకం రేటు
- ప్రభుత్వ రుణ పత్రాలపై కంటే పసిడిపై అధిక రాబడులు
- క్లిష్ట సమయాల్లోనూ సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న పేరు
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి
- పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు

బంపర్ లాభాలు

స్టాక్ మార్కెట్‌తో పోలిస్తే గత ఏడాది కాలంలో బంగారం, వెండి మదుపరులకు మంచి లాభాలు పంచాయి. గత 12 నెలల్లో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపుగా ఎదుగూ బొదుగు లేకుండా స్థిరంగా ఉన్నాయి. ఇదే సమయంలో పసిడిలో పెట్టుబడులు 52 శాతం, వెండిలో పెట్టుబడులు 50 శాతం లాభాలు పంచాయి. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. పెట్టుబడులకు పెద్దగా నష్టం లేకుండా స్థిరమైన రాబడులను ఆశించే మదుపరులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డెట్ ఫండ్స్‌కు గుడ్‌బై చెప్పి గోల్డ్ ఈటీఎఫ్‌లను ఆశ్రయిస్తున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మారిన ఈ ట్రెండ్‌తో మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ చేసే మల్టీ అసెట్ ఫండ్స్‌కు గిరాకీ పెరిగింది.

ఎందాక ఈ పరుగు?

నిన్న మొన్నటి వరకు 3,500 డాలర్ల వద్ద పసిడి పరుగుకు బ్రేక్ పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావించాయి. ప్రస్తుత ర్యాలీని చూస్తుంటే ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 4,000 డాలర్లకు (సుమారు రూ.3,52,360) చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా. అయితే మార్కెట్ ఇప్పటికే ఓవర్ బాట్ స్థాయికి వెళ్లటంతో 5 నుంచి 6 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం కూడా ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అలాంటి దిద్దుబాటు వచ్చినా, అది తాత్కాలికమేనని, వచ్చే ఏడాది ఔన్స్ పసిడి ధర 4,200 డాలర్లకు చేరే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ విశ్వసనీయత దెబ్బతింటే ఔన్స్ పసిడి ధర 5,000 డాలర్లకు కూడా చేరే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ ఈ నెల తొలి వారంలో విడుదల చేసిన ఒక నివేదికలో హెచ్చరించింది.

'మేఘా'కు మరో భారీ ఆర్డర్!

కర్ణాటకలో 'వ్యూహాత్మక' పెట్రో ప్రాజెక్టు

న్యూఢిల్లీ:హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకుంది. కర్ణాటకలోని పాదూరు వద్ద 25 లక్షల టన్నుల వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రాన్ని ఏర్పాటు చేసే కాంట్రాక్టు దక్కించుకున్నట్టు ఎకనామిక్ టైమ్స్ పత్రిక తెలిపింది. ఈ కాంట్రాక్ట్ విలువ రూ.5,700 కోట్లు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎంఈఐఎల్ త్వరలోనే ప్రభుత్వ రంగంలోని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్)తో ఒప్పందం చేసుకోనుందని సమాచారం. ఎంఈఐఎల్‌తో పాటు మరో రెండు కంపెనీలు కూడా ఈ ప్రాజెక్టు కోసం పోటీపడ్డాయి. అయితే మేఘా ఇంజనీరింగ్ కోట్ చేసిన ధర తక్కువగా ఉండటంతో ఐఎస్‌పీఆర్ఎల్. ఈ ప్రాజెక్టును ఎంఈఐఎల్‌కే కట్టబెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఐఎస్‌పీఆర్ఎల్ ఈ తరహా ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించడం ఇదే మొదటిసారి. ఐఎస్‌పీఆర్ఎల్ ఇప్పటికే విశాఖపట్నం, మంగళూరు, పాదూరు వద్ద మూడు వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రాలను నిర్వహిస్తోంది. పాదూరు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగించబోతోంది. ఈ విస్తరణతో దేశ వ్యూహాత్మక చమురు నిల్వల సామర్థ్యం 53.3 లక్షల టన్నులకు చేరనుంది. ఈ నిల్వలు అత్యవసర పరిస్థితుల్లో ఎనిమిది నుంచి తొమ్మిది రోజుల అవసరాలకు సరిపోతాయి.

ప్రాజెక్టు ప్రత్యేకతలు

- ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలి
- 60 ఏళ్ల పాటు మేఘాకు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు
- 25 లక్షల టన్నుల వరకు ముడి చమురు నిల్వ
- చమురు నిల్వల సదుపాయాన్ని మేఘా సొంతంగా లేదా ఇతరులకు అద్దెకు ఇవ్వడం చేయవచ్చు

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,930 ▲	1,02,600 ▲	1,44,000 ▲
విజయవాడ	1,14,250 ▲	1,08,000 ▲	1,33,500 ▲
విశాఖపట్నం	1,14,120 ▲	1,01,800 ▲	1,44,000 ▲
రాజమండ్రి	1,11,930 ▲	1,02,600 ▲	1,33,000 ▲
ప్రొద్దుటూరు	1,14,800 ▲	1,05,250 ▲	1,34,000 ▲
ముంబై	1,10,869 ▲	1,01,556 ▲	1,29,300 ▲

'గేమ్స్‌క్రాఫ్ట్'కు సీఎఫ్ఓ టోపీ

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ కోసం రూ.250 కోట్లు దారి మళ్లింపు

న్యూఢిల్లీ: కంపెనీలకు ఆయా కంపెనీల ఉన్నతాధికారులే టోపీ పెడుతున్నారు. తాజాగా బెంగళూరు కేంద్రంగా పనిచేసే రియల్ మనీ గేమ్స్ కంపెనీ గేమ్స్‌క్రాఫ్ట్ టెక్నాలజీస్ వీరి బారిన పడింది. సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) రమేశ్ ప్రభు.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ కోసం కంపెనీకి చెందిన రూ.250 కోట్లను దారి మళ్లించినట్టు గేమ్స్‌క్రాఫ్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేశ్ ప్రభునే స్వయంగా ఈ ఏడాది మార్చి 5న స్వయంగా కంపెనీకి పంపిన ఒక ఈ-మెయిల్‌లో ఈ విషయం ఒప్పుకున్నట్టు కంపెనీ తెలిపింది. గేమ్స్‌క్రాఫ్ట్ ఫిర్యాదుతో ఈ నెల 9న పోలీసులు రమేశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఐటీ, ఆటో షేర్లే పరుగులెత్తించాయ్...

ముంబై: అమెరికా-భారత వాణిజ్య చర్చలు పునః ప్రారంభమయ్యాయన్న ఉత్సాహంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో ఈక్విటీ మార్కెట్ మంగళవారం బలమైన పునరుజ్జీవం సాధించింది. ఆసియా, అమెరికా మార్కెట్లలో ర్యాలీ ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. సోమవారం మార్కెట్‌ను కుంగదీసిన ఐటీ, ఆటో రంగాల షేర్లే మంగళవారం ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 594.95 పాయింట్ల లాభంతో 82,380.69 వద్ద ముగియగా నిఫ్టీ 169.90 పాయింట్ల లాభంతో 25,239.10 వద్ద క్లోజయింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.66%, మిడ్‌క్యాప్ సూచీ 0.62% లాభపడ్డాయి.

యాపిల్ ఐఫోన్ ప్రో మ్యాక్స్ 17కి భారీ డిమాండ్

3 రోజుల్లోనే నిండుకున్న స్టాక్

న్యూఢిల్లీ: యాపిల్ ఐఫోన్ ప్రో మ్యాక్స్ 17 కాస్మిక్ రేంజ్ డివైస్‌లకు గల భారీ డిమాండ్ కారణంగా అమెరికా, భారత్‌లోని యాపిల్ స్టోర్లలో పికప్ ఆప్షన్‌తో ప్రీ బుకింగ్ విండో తెరిచిన మూడు రోజుల్లోనే దాని స్టాక్ నిండుకుంది. కాస్మిక్ రేంజ్ ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌కు గల భారీ డిమాండ్ కారణంగా ప్రస్తుతం భారత్‌లో ఏ స్టోర్‌లోనూ ఇవి అందుబాటులో లేవని, ఈ సమాచారం అందిస్తున్నందుకు విచారిస్తున్నామని యాపిల్ స్పెషలిస్ట్ ఒకరు ప్రకటించారు.

స్పోర్ట్స్

భారత్ X ఆస్ట్రేలియా
మహిళల రెండో వన్డే నేడు
(మ. 1.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..)



వన్డే ర్యాంకుల్లో మంధాన.. నెం 1

దుబాయ్: భారత స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన వన్డేల్లో నెంబర్‌వన్ బ్యాటర్‌గా నిలిచింది. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో మంధాన ఓ స్థానం ఎగబాకి టాప్ ర్యాంక్‌కు చేరింది. నాట్ షివర్ బ్రంట్ (ఇంగ్లండ్) రెండో ర్యాంక్‌కు పడిపోయింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా ఐదు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌కు చేరింది. స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది.

బీసీసీఐకి జాక్‌పాట్

రూ.579 కోట్లతో ఒప్పందం

టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్


న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా విరాజిల్లుతున్న బీసీసీఐ ఖజానా మరింత బరువెక్కనుంది. భారత క్రికెట్ జట్టు నూతన ప్రధాన స్పాన్సర్‌గా అపోలో టైర్స్ ఏకంగా రూ.579 కోట్ల కళ్లుచెదిరే మొత్తంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ రెండున్నరేళ్ల పాటు కొనసాగి 2028, మార్చిలో ముగుస్తుంది. ఇక నుంచి పురుషుల, మహిళల జట్లకు సంబంధించిన మూడు ఫార్మాట్ల జెర్సీలపై కంపెనీ లోగో ఉంటుంది. గతంలో జెర్సీ స్పాన్సర్‌గా కొనసాగిన డ్రీమ్ 11 రూ.358 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం కారణంగా ఏడాది ముందుగానే ఆ కంపెనీ వైదొలగాల్సివచ్చింది. ప్రస్తుతం ఆసియాకప్‌లో తలపడుతున్న భారత జట్టు ఎలాంటి లోగో లేకుండానే ఆడుతోంది. ఈ నేపథ్యంలో బోర్డు కొత్త స్పాన్సర్ కోసం బిడ్లు ఆహ్వానించింది. అటు అపోలో టైర్స్‌కు కాన్వా రూ.544 కోట్లతో, జేకే సిమెంట్స్ రూ.477 కోట్లతో గట్టి పోటీనే ఇచ్చాయి. కానీ ఈ రెండు కంపెనీల కంటే చాలా ఎక్కువ మొత్తమే కోట్ చేయడంతో అపోలో టైర్స్ విజేతగా నిలిచింది. వాస్తవానికి బోర్డు రూ.450 కోట్ల వరకు రావచ్చని ఆశించింది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఒక్కో మ్యాచ్‌కు రూ.3.5 కోట్లు, వరల్డ్‌కప్ మ్యాచ్‌లకు రూ.1.5 కోట్లను కనీస ధరగా పేర్కొంది. అయితే తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం అపోలో టైర్స్ నుంచి మ్యాచ్‌కు దాదాపు రూ.4.5 కోట్లు దక్కబోతోంది. మొదట ఈనెల 30 నుంచి ఆసీస్ 'ఎ' జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 'ఎ' ఆటగాళ్లు అపోలో టైర్స్ జెర్సీలను ధరించి ఆడనున్నారు.

భారత్‌తో టెస్టులకు విండీస్ జట్టు ఇదే

న్యూఢిల్లీ: రెండు టెస్టుల సిరీస్ కోసం వచ్చేనెలలో భారత పర్యటనకు రానున్న వెస్టిండీస్ టెస్టు జట్టును ప్రకటించారు. అక్టోబరు 2 నుంచి 6 వరకు అహ్మదాబాద్‌లో తొలి టెస్టు, ఢిల్లీ వేదికగా 10 నుంచి 14 వరకు రెండో టెస్టు జరగనుంది. ఈ సిరీస్ కోసం మంగళవారం ప్రకటించిన 15 మందితో కూడిన విండీస్ జట్టులో సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ బ్రాత్‌వైట్‌కు చోటు దక్కలేదు. ఎడమచేతి వాటం స్పిన్నర్ ఖారీ పియరీ తొలిసారి జట్టుకు ఎంపికవగా.. టాగెనరైన్ చందర్‌పాల్, అలిక్ అథనాజ్‌లను మళ్లీ జట్టులోకొచ్చారు. రోస్టన్ చేజ్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

విండీస్ జట్టు: రోస్టన్ చేజ్ (కెప్టెన్), జోమెల్ వారికన్ (వికెట్ కీపర్), కెవ్లాన్ ఆండర్సన్, అలిక్ అథనాజ్, జాన్ క్యాంప్‌బెల్, టాగెనరైన్ చందర్‌పాల్, జస్టిన్ గ్రీవ్స్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), టెవిన్ ఇమ్లాచ్, అల్జారీ జోసెఫ్, షమార్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఆండర్సన్ ఫిలిప్, ఖారీ పియరీ, జేడన్ సీల్స్

పైక్రాఫ్ట్‌ను తొలగించం



పీసీబీ ఫిర్యాదును తిరస్కరించిన ఐసీసీ

ఆసియా కప్‌లో నేడు
పాకిస్థాన్ X యూఏఈ
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

దుబాయ్: 'కరచాలన వివాదం' నేపథ్యంలో మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తప్పించాలన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ఆసియాకప్ మ్యాచ్ టాస్ సందర్భంగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కరచాలనం చేయవద్దంటూ పాక్ సారథి సల్మాన్ ఆఘాకు పైక్రాఫ్ట్ (జింబాబ్వే) సూచించాడని ఐసీసీకు పీసీబీ ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అయితే, పాక్ డిమాండ్‌ను తిరస్కరిస్తూ పీసీబీకి మెయిల్ పంపినట్టు ఐసీసీ వర్గాలు తెలిపాయి. బుధవారం పాక్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌కు కూడా పైక్రాఫ్ట్ మ్యాచ్ రెఫరీగా వ్యవహరించాల్సి ఉంది. అయితే, పైక్రాఫ్ట్‌ను తప్పించడానికి ఐసీసీ విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో తమ మ్యాచ్‌లకు అతడిని దూరంగా ఉంచాలని పీసీబీ కోరే అవకాశం ఉంది. మధ్యేమార్గంగా రిచీ రిచర్డ్సన్ (వెస్టిండీస్)ను రెఫరీగా నియమించాలని సూచించనున్నట్టు సమాచారం. ఆదివారం పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలిచిన తర్వాత భారత ఆటగాళ్లు ప్రత్యర్థులతో హ్యాండ్ షేక్ చేయకుండా రావడం చర్చనీయాంశమైంది. పహల్గాం బాధితులకు సంఘీభావంగానే తాము ఇలా చేసినట్టు సూర్యకుమార్ చెప్పాడు.

బహిష్కరిస్తే.. రూ. 141 కోట్ల నష్టం

రెఫరీ పైక్రాఫ్ట్‌ను తొలగించకపోతే టోర్నీని బహిష్కరిస్తామని ఒకానొక సమయంలో పాక్ బీరాలు పలికింది. అయితే, అది సాధ్యమయ్యే పని కాదని పాక్ బోర్డు వర్గాలు చెప్పాయి. టోర్నీని బహిష్కరిస్తే ఐసీసీ తమపై భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అంత భారం పీసీబీ భరించలేదని వెల్లడించాయి. ఒకవేళ పాక్ జట్టు టోర్నీని బాయ్‌కాట్ చేస్తే టోర్నీ ఆదాయంలో 15 శాతం రెవెన్యూ.. అంటే సుమారు రూ. 106 నుంచి 141 కోట్ల మేర ఆదాయాన్ని కూడా పీసీబీ నష్టపోనుంది.

బంగ్లా నిలిచింది

అఫ్ఘాన్‌పై విజయం

అబుధాబి: ఆసియా కప్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ గట్టెక్కింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం అఫ్ఘానిస్థాన్‌తో ఉత్కంఠగా సాగిన పోరులో 8 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఓపెనర్లు తన్‌జీద్ హసన్ (52), సైఫ్ హసన్ (30) రాణించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించింది. ఛేదనలో అఫ్ఘాన్ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. గుర్బాజ్ (35), ఒమర్జాయ్ (30), రషీద్ (20) మాత్రమే రాణించారు. ముస్తాఫిజుర్‌కు మూడు.. నసూమ్, రిషాద్, టస్కిన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నసూమ్ నిలిచాడు. ఈ గెలుపుతో ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉన్న బంగ్లా.. గురువారం శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో అఫ్ఘాన్ జట్టు ఓడిపోతే సూపర్-4కు వెళతుంది.

సంక్షిప్త స్కోర్లు: బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 154/5 (తన్‌జీద్ 52, సైఫ్ 30; నూర్ 2/23, రషీద్ 2/26). **అఫ్ఘానిస్థాన్:** 20 ఓవర్లలో 146 ఆలౌట్ (గుర్బాజ్ 35, ఒమర్జాయ్ 30; ముస్తాఫిజుర్ 3/28, నసూమ్ 2/11, రిషాద్ 2/18, టస్కిన్ 2/34).

సింధు ముందంజ



'చైనా మాస్టర్స్'లో ఆయుష్ ఓటమి

షెన్‌జెన్ (చైనా): గతవారం హాంకాంగ్ ఓపెన్‌లో ఆరంభ రౌండ్లోనే నిష్క్రమించిన పీవీ సింధు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన తొలి రౌండ్‌లో సింధు 21-5, 21-10తో జూలీ డావల్ (డెన్మార్క్)పై గెలిచింది. ఇక ఆయుష్ షెట్టి 19-21, 21-12, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రుత్వికా శివాని/రోహన్ 17-21, 11-21తో జపాన్ జంట యుచి షిమొగామి/సయాక హొబర చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగింది.

వేటకు నీరజ్ రెడీ

నేడు జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్
ప్రపంచ అథ్లెటిక్స్
మ. 3.40 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో



టోక్యో: భారత పతక ఆశలు మోస్తున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్నాడు. బుధవారం క్వాలిఫయింగ్ రౌండ్ జరగనుంది. ఒలింపిక్ చాంప్ అర్షద్ నదీమ్, డైమండ్ లీగ్ విజేత జూలియన్ వెబర్, గ్రెనెడా స్టార్ అండర్సన్ పీటర్స్ తదితరుల నుంచి చోప్రాకు గట్టి పోటీ ఎదురుకానుంది. గ్రూప్-ఎలో చోప్రా, గ్రూప్-బిలో నదీమ్ ఉన్నారు. ఫైనల్ చేరితే వీరిద్దరూ ముఖాముఖిగా తలపడే అవకాశం ఉంది. ఫైనల్ గురువారం జరగనుంది. సచిన్ యాదవ్, రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ కూడా సత్తాచాటాలనుకొంటున్నారు. ఒకవేళ చోప్రా స్వర్ణం సాధిస్తే చెక్ లెజెండ్ జన్ జలెంజీ, అండర్సన్ పీటర్స్ తర్వాత టైటిల్‌ను నిలబెట్టుకొన్న మూడో అథ్లెట్‌గా రికార్డుకెక్కుతాడు.

టైటిళ్లు నిలబెట్టుకొన్న ఇథన్, ఫెయిత్: హ్యామర్ త్రోలో ఇథన్ కాట్జ్‌బర్గ్ (కెనడా), 1500 మీటర్లలో ఫెయిత్ కిప్‌యిగాన్ (కెన్యా) టైటిళ్లను నిలబెట్టుకొన్నారు. పురుషుల హ్యామర్ త్రో ఫైనల్లో ఇథన్ 84.70 మీటర్ల త్రోతో స్వర్ణంతోపాటు గేమ్స్ రికార్డును నెలకొల్పాడు. మహిళల 1500 మీ. ఫైనల్లో ఫెయిత్ 3 నిమిషాల 52.15 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గింది.

టాప్-6లో సర్వేష్



హైజంపర్ సర్వేష్ అనిల్ కుషారే పతకం నెగ్గకపోయినా.. వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో టాప్ సిక్స్‌లో నిలిచిన నాలుగో భారత అథ్లెట్‌గా ఘనతను అందుకొన్నాడు. ఫైనల్లో 2.28 మీటర్ల ఎత్తు దూకిన సర్వేష్ ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తన వ్యక్తిగత బెస్ట్ (2.27 మీటర్ల)ను అధిగమించాడు. హమీష్ (న్యూజిలాండ్- 2.36 మీ.) స్వర్ణం నెగ్గాడు.

మెట్లెక్కుతుంటే ఆయాసం వస్తోంది



ఉసేన్ బోల్ట్

టోక్యో: దశాబ్దం పాటు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఏలిన జమైకా స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ (39) రిటైర్మెంట్ తర్వాత అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నట్టు చెప్పాడు. ఒకప్పుడు భూమిపై వేగవంతమైన అథ్లెట్‌గా గుర్తింపు దక్కించుకొన్న బోల్ట్.. ఇప్పుడు మెట్లెక్కడానికి కూడా ఆయాసపడుతున్నట్టు తెలిపాడు. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు అతిథిగా హాజరైన బోల్ట్ తన రోజువారీ జీవనశైలి గురించి మీడియాతో ఆసక్తికర విషయాలు పంచుకొన్నాడు. 'పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయానికి నిద్రలేస్తా. పిల్లలు స్కూలు నుంచి తిరిగి వచ్చేదాకా వెబ్‌సిరీస్‌లు చూస్తూ గడిపేస్తా. జిమ్‌కు కొంతకాలం దూరంగా ఉన్నా. ఇకనైనా పరిగెత్తడం మొదలెట్టాలి. ఎందుకంటే మెట్లెక్కేటప్పుడు ఆయాసం వస్తోంది. మళ్లీ రన్నింగ్ ఆరంభిస్తే శ్వాస తీసుకోవడం మెరుగుపడుతుంద'ని బోల్ట్ చెప్పాడు. వెన్నెముక సమస్యతోపాటు మడమ నొప్పితో బోల్ట్ బాధపడుతున్నాడు. బోల్ట్ 2017లో రిటైరయ్యాడు.

యూపీపై బెంగాల్ గెలుపు

జైపూర్: కెప్టెన్ దేవాంక్ అదరగొట్టడంతో.. ప్రో కబడ్డీ లీగ్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 41-37తో యూపీ యోధాస్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 35-29తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

అంధ వరల్డ్‌కప్‌నకు తటస్థ వేదికగా కొలంబో

న్యూఢిల్లీ: నవంబరు 11 నుంచి 25 వరకు భారత్ వేదికగా జరిగే అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లకు తటస్థ వేదికను ఖాట్మండు నుంచి కొలంబోకు మార్చారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో నెల కొన్ని అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో ఆనంద్ స్వర్ణ చరిత్ర



న్యూఢిల్లీ: భారత స్కేటర్ ఆనంద్ కుమార్ వేల్‌కుమార్ చరిత్ర సృష్టించాడు. చైనాలో జరుగుతున్న స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించాడు. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల ఆనంద్ సీనియర్ పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్‌లో ఒక నిమిషం 24.924 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచాడు. ఆనంద్.. రెండ్రోజుల క్రితం ఇదే టోర్నీ 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్య పతకం సాధించాడు. దేశానికి మొదటి బంగారు పతకం అందించిన ఆనంద్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. నీ విజయం ఎంతో మంది యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు.

కాన్‌స్టస్ శతకం

- ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్ 337/5
- హర్ష్ దూబేకు మూడు వికెట్లు

లఖ్‌నవూ: భారత్ 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికార టెస్టును ఆస్ట్రేలియా 'ఎ' ఘనంగా ఆరంభించింది. ఓపెనర్లు సామ్ కాన్‌స్టస్ (109) శతకం సహాయంతో మంగళవారం మొదటి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 337/5 పరుగులతో నిలిచింది. తొలి వికెట్‌కు సామ్ మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ (88)తో కలిసి 198 రన్స్ జోడించాడు. కనోలి (70), స్కాట్ (47 బ్యాటింగ్) రాణించారు. పేసర్ హర్ష్ దూబేకు మూడు వికెట్లు.. ఖలీల్, గుర్నూర్‌లకు చెరో వికెట్ లభించాయి.

పేదల భూ హక్కులపై మానవీయతచూపండి

» అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి పొంగులేటి సూచన



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న పేదలకు భూహక్కుల కల్పనపై మానవీయ కోణంలో పని చేయాలని అధికారులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని భూ సమస్యలపై ఆయన సమీక్షించారు. చిన్న సమస్యల సాకుగా భూ సమస్యలను జటిలం చేయొద్దని అటవీశాఖ అధికారులకు హితవు చెప్పారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలో 40-50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కుల కల్పనకు తమ సర్కారు చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జున సాగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని తిరుమలగిరి మండలంలో 235 సర్వేనంబర్ల పరిధిలో 23 వేల ఎకరాలపై జరిపిన ప్రయోగాత్మక సర్వేలో 12 వేల ఎకరాల భూమి ప్రభుత్వానిదని తేలిందన్నారు. ఇదే సర్వేలో గుర్తించిన 7,000 ఎకరాల అటవీ భూమి పరిధిలోని వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను పొంగులేటి ఆదేశించారు.

టీ-వాలెట్ ద్వారా 36వేల కోట్ల లావాదేవీలు

» త్వరలో యుపీఐ, క్యూఆర్ కోడ్ సేవలు: మంత్రి దుద్దిళ్ల

తెలంగాణ టీ-వాలెట్ 2017లో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ. 36,000 కోట్లకు పైగా లావాదేవీలను జరిపింది. త్వరలో యూపీఐ, క్యూఆర్ కోడ్ ఆధారిత కొనుగోళ్లు, ఆటోమేటెడ్ బిల్ పేమెంట్ వంటి సేవలను ప్రారంభించనుంది. వాలెట్ పనితీరుపై మంగళవారం సమీక్ష జరిపిన రాష్ట్ర ఐటీ మంత్రి డి. శ్రీధర్ బాబు ఈ విషయాలను వెల్లడించారు. టీ-వాలెట్‌లోని ఇన్‌స్టంట్ మనీ పేమెంట్ సర్వీస్ గేమ్‌చేంజర్‌గా మారిందని తెలిపారు. ఇప్పటివరకు 16.14 లక్షల మంది వినియోగదారులు నమోదు చేసుకున్నారని చెప్పారు. 1,246 ప్రభుత్వ, పౌర సేవలు ఈ వేదిక ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఎనిమిదేళ్లలో టీ-వాలెట్ ఒక విశ్వసనీయమైన సురక్షిత చెల్లింపుల వేదికగా నిలిచిందని, ఐఎంపీఎస్ లావాదేవీలలో 99%కు పైగా విజయవంతమైన రికార్డు సాధించిందని వివరించారు.



పాస్‌పోర్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో మహేందర్ రెడ్డి

హైదరాబాద్‌లో 2 కొత్త పాస్‌పోర్టు కేంద్రాలు

» ప్రారంభించిన మంత్రులు పొన్నం, దుద్దిళ్ల

రాయదుర్గం/అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పాస్‌పోర్టు కార్యాలయాల సేవలను మరింత మెరుగుపరిచే దిశగా.. నగరంలోని రెండు ప్రాంతాల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. రవాణా సౌకర్యాలకు కేంద్రంగా ఉన్న ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో కొత్త కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అంతకు ముందు అమీర్‌పేట్ ప్రాంతంలో ఉన్న ఈ కార్యాలయాన్ని ఎంజీబీఎస్‌కు తరలించి ఆధునీకరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ, పాసుపోర్టుల జారీలో హైదరాబాద్ కార్యాలయం దేశంలో ఐదవ స్థానంలో ఉందని, ఈ సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ పాల్గొన్నారు. మరోవైపు, టోలిచౌకీ నుంచి రాయదుర్గానికి మార్చిన పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. హైదరాబాద్‌లో మరో పాస్టపోర్టు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కేంద్రం చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు మహేందర్‌రెడ్డి, అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సైనిక్ స్కూల్‌లో చదివితే స్థానికుడు కాదా?

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉన్న సైనిక్ స్కూల్‌లో తెలంగాణ కోటాలో, తెలంగాణ ప్రభుత్వ నిధులతో చదివిన విద్యార్థికి తెలంగాణ స్థానికత వర్తించదని ఎలా అంటారని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తెలంగాణ ప్రభుత్వ నిధులతో, తెలంగాణ కోటాలో ఏపీలోని సైనిక్ స్కూల్‌లో చదివిన తనను వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికుడిగా గుర్తించడం లేదంటూ వనపర్తి జిల్లాకు చెందిన ఎం.శశికిరణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. నిజానికి జీవో 33పై సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా ఈఅంశం చర్చకు రాలేదని.. అందువల్ల మినహాయింపు వర్తించే అంశాల్లో సైనిక్ స్కూల్ అంశాన్ని ప్రస్తావించకపోయి ఉండవచ్చని పేర్కొంది. అయితే ఏపీలోని సైనిక్ స్కూల్‌లో తెలంగాణ కోటాకింద చదివిన మరో విద్యార్థికి తెలంగాణలో ఇంజినీరింగ్ ప్రవేశాలకు స్థానికత వర్తిస్తుందని హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ధర్మాసనం గుర్తుచేసింది. మరోవైపు సుప్రీంకోర్టు తర్వాత ఇలాంటి పరిస్థితి ఎదురవడం ఇదే మొదటిసారని, ప్రభుత్వం దీనిని పరిశీలించాల్సి ఉందని కాళోజీ వర్సిటీ తరఫు న్యాయవాది టి.శరత్ ధర్మాసనానికి వివరించారు. దీనితో ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ వివరణ కోసం విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ఆయుధాలు వదిలేస్తాం!

» సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ

» కేంద్రంతో వీడియో కాల్‌లో శాంతి చర్చలకూ సిద్ధం

» మావోయిస్టు ప్రతినిధి అభయ్ పేరిట లేఖ

» ఇది నిజమా!? కాదా!? అనే అంశంపై గందరగోళం

చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయుధాలను వదులుకోవాలని మావోయిస్టులు నిర్ణయించారా!? సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని నిర్ణయించారా!? కేంద్రంతో వీడియో కాల్‌లో శాంతి చర్చలకు సిద్ధమయ్యారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటోంది మావోయిస్టుల నుంచి తాజాగా వచ్చిందని చెబుతోన్న ఓ లేఖ. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరిట ఓ లేఖ విడుదలైంది. అందులో, శాంతి చర్చలను తాత్కాలికంగా విరమించుకుంటున్నామని, పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి లేదా ఆయన నియమించిన ప్రతినిధి బృందంతో చర్చలకు సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు నెల రోజులపాటు తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించాలని, రక్తసిక్తమైన అడవుల్లో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు ఉంది. అయితే, ఈ ప్రకటనను నిజంగా మావోయిస్టులే విడుదల చేశారా!? అనే విషయమై అస్పష్టత నెలకొంది. ఇందుకు కారణం సదరు ప్రకటనపై ఆగస్టు 15వ తేదీ ఉండడమే. దీనికితోడు, దానిపై మల్లోజుల కోటేశ్వరరావు ఫొటో కూడా ముద్రించారు. సాధారణంగా, మావోయిస్టులు తమ ప్రకటనపై ఇలా ఫొటోలు ముద్రించరని మావోయిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, మావోయిస్టులు ప్రకటన విడుదల చేస్తే కాల్పుల విరమణ అనే అంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తారని, కానీ, ఇందులో ఆయుధాలను పూర్తిగా వదిలేసి జనజీవన స్రవంతిలో కలుస్తామని పేర్కొన్నారని, మారిన పరిస్థితులే ఇందుకు కారణమని ప్రస్తావించారని, ఇది అనుమానాస్పదంగా ఉందని మావోయిస్టు అనుకూల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఏపీకి విద్యుత్ బకాయిలు చెల్లించాలని

మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

» సమగ్ర విచారణ అవసరం: సుప్రీంకోర్టు

» సర్వోన్నత న్యాయస్థానంలో తెలంగాణకు ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జెన్‌కోకు విద్యుత్ బకాయిలను తెలంగాణ చెల్లించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల వివాదంలో సమగ్ర విచారణ అవసరమని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయ పడింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని, ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తెలంగాణ డిస్కంలకు ఆంధ్రప్రదేశ్ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల అంశంలో వివాదం ఏర్పడింది. తమకు తెలంగాణ రూ. వేల కోట్లు బకాయి పడిందని, చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తోందని, తక్షణమే తమకు బకాయిలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ఏపీ జెన్‌కో కేంద్రాన్ని ఆశ్రయించింది. ఏపీ విజ్ఞప్తి మేరకు రూ.3756 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించగా.. కేంద్రం ఆదేశాలను న్యాయస్థానం రద్దు చేసింది. పీపీఏల్లో పేర్కొన్న ఫోరానికి వెళ్లకుండా ఏపీ జెన్‌కో నేరుగా కేంద్రాన్ని ఆశ్రయించడం, తెలంగాణ డిస్కంల అభిప్రాయాలు చెప్పే అవకాశమివ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 92 కింద కేంద్రం జారీచేసిన ఈ ఆదేశాలు చెల్లవని పేర్కొంది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల (పీపీఏల) ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా ఇరు రాష్ట్రాల విద్యుత్తు సంస్థలు ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. హైకోర్టు తీర్పును గతేడాది నవంబరులో ఏపీ జెన్‌కో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ మంగళవారం సీజేఐ, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది.



ఏపీ జెన్‌కో తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాము విద్యుత్ సరఫరా చేశామన్నది అందరికీ తెలిసిన విషయమేనని, అలాంటప్పుడు తమకు బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత తెలంగాణ డిస్కంలపై ఉంటుందని తెలిపారు. బకాయిలు మొత్తం కాకపోయినా, కనీసం వివాదం లేని మొత్తాన్ని అయినా తెలంగాణ డిస్కంలు వెంటనే చెల్లించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ధర్మాసనం ఎదుట విజ్ఞప్తి చేశారు. అయితే, తక్షణమే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. విషయ తీవ్రతను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. ఈ అంశంలో సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయ పడింది. డిసెంబరు మొదటి వారంలో సమగ్రంగా విచారణ చేపడతామని, అ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

సర్కారీ పథకాలకు డిస్కమ్!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న 2డిస్కమ్‌లను 3డిస్కమ్‌లుగా పునర్వ్యవస్థీకరించాలని సీఎం అధికారులకు సూచించారు. మూడో డిస్కమ్ కోసం విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ)లు, ఆస్తులవిభజన, బకాయిలు, ఇతర అంశాలపై కీలక సూచనలు చేశారు. కొత్త డిస్కమ్ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం లభించిన అనంతరం ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈలోగా కొత్త డిస్కమ్ ప్రతిపాదనకు తుది రూపు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

జీహెచ్ఎంసీలో భూగర్భ విద్యుత్తు వైర్లు..


గ్రేటర్ హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారీ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కోర్ అర్బన్ రీజియన్‌లో భూగర్భ తీగలతో పాటు సబ్‌స్టేషన్లను ఉన్నతీకరించాలని, ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. సబ్‌స్టేషన్ సామర్థ్యాని కంటే ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కోర్ అర్బన్ రీజియన్‌లో కొత్తగా సబ్‌స్టేషన్లు ఎక్కడెక్కడ అవసరం ఉందనేది గుర్తించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. విద్యుత్తు తీగలతో పాటు ఇతర కేబుళ్లకు కూడా అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఉపయోగించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లోని అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని చెప్పారు. డిసెంబరులోగా అండర్ గ్రౌండ్ కేబులింగ్‌కు సంబంధించిన పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని, రాబోయే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్‌ను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించండి

రాష్ట్రంలో సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. కొండారెడ్డిపల్లిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సోలార్ రూఫ్‌టాప్ విలేజ్ పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ఇందిర సౌర గిరి జల వికాసం ద్వారా రైతులకు సౌర పంపుసెట్లు అందించాలని, వాటికి కంటెయినర్ బేస్డ్ సౌర ఫలకాల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. సౌర విద్యుదుత్పత్తితో మహిళా రైతులకు ఆదాయం సమకూర్చడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, భవనాలపై సౌర ఫలకలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో సాధ్యమైనంత ఎక్కువగా పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు.

అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలు పంపిణీ

కరీంనగర్ జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంగీతంలో శిక్షణ పొందిన అంధ విద్యార్థులు పలువురికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులు సీఎం ఎదుట పాట పాడి వినిపించారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటలతో రూపొందించిన సీడీని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సీఎం రేవంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రాహుల్, చిత్రంలో మంత్రి లక్ష్మణ్



అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

థ్యాంక్యూ సీఎం సార్.. నన్ను మళ్లీ నడిపించారు!

» రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్‌కు సీఎంఆర్ఎఫ్ కింద చికిత్స

» కృత్రిమ కాళ్లను అమర్చేందుకు సాయమందించిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రయాణంలో తన రెండు కాళ్లను కోల్పోయిన ఆ యువకుడు ప్రభుత్వ సాయంతో తిరిగి నడవగలిగాడు. తనకు రెండు కృత్రిమ కాళ్లను అమర్చే చికిత్సకు సాయం అందించి, మళ్లీ నడిచేలా చేసినందుకు అతడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా దామెర మండలం పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ 2024 నవంబరు 2న రైలులో రాజస్థాన్ వెళ్తుండగా కొందరు దుండగులు రైల్లో నుంచి తోసేశారు. ఆ ఘటనలో అతడు తన రెండు కాళ్లను కోల్పోయాడు. చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన ప్రభుత్వం చికిత్స అందించడంతో పాటు రెండు కృత్రిమ కాళ్లను అమర్చేందుకు సాయం అందించింది. కృత్రిమ కాళ్లతో నడుస్తున్న రాహుల్ మంగళవారం సీఎం రేవంత్‌ను కుటుంబంతో కలిసి ధన్యవాదాలు చెప్పారు. వీరివెంట మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా ఉన్నారు.



కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్‌ను కలిసిన మంత్రి తుమ్మల

బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పండి

» కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయండి

» యూరియాను సకాలంలో పంపండి

» కేంద్ర మంత్రులకు తుమ్మల వినతులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఆ ప్రాంత వాసుల దశాబ్దాల కల అని, దానిని సాకారం చేయాలని కోరారు. దీనిపై త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తుమ్మల వెల్లడించారు. అలాగే, తెలంగాణకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్‌నూ కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో ప్రణాళిక ప్రకారం.. ఇప్పటివరకూ ఏర్పడిన యూరియా లోటు రెండు లక్షల టన్నులను ఈ నెలలోనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ముందుగానే ప్రతినెలా రెండు లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరారు. అనంతరం కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో తుమ్మల సమావేశమయ్యారు. కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెంలో గతంలో ప్రతిపాదించిన విమానాశ్రయంపై సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెం విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో తాజా సాధ్యాసాధ్యాలకు సంబంధించి అధ్యయనాన్ని చేపట్టాలని, ఇదే అంశంపై సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.

సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ

సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ రాష్ట్రం ప్రగతి సాధించిందని మంత్రి తుమ్మల తెలిపారు. దేశంలో అవసరమయ్యే విత్తనాల్లో దాదాపు 60% తెలంగాణ సరఫరా చేస్తోందన్నారు. 20కిపైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన జాతీయ రబీ సదస్సులో తుమ్మల మాట్లాడారు. వ్యవసాయం రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని వివరించారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించండి

నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి.. నెట్‌వర్క్ ఆస్పత్రులకు మంత్రి దామోదర విజ్ఞప్తి

» రాజకీయ దురుద్దేశంతో కొందరి కుట్రలు

» ఈ నెల రూ.100 కోట్లు విడుదల చేశాం

» మీడియాతో చిట్‌చాట్‌లో వైద్య మంత్రి

» అనుబంధ ఆస్పత్రులకు పూర్వవైభవం

» అధికారులతో సమీక్షలో దామోదర

» నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయం మార్చుకోవాలి

» ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఉదయ్‌కుమార్

» ససేమిరా అంటున్న యాజమాన్యాలు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవల నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. తమ సేవలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో తనను కలసిన మీడియా ప్రతినిధులతో మంత్రి దామోదర చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతపై స్పందిస్తూ.. ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో నెల రోజులుగా సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. నెలకు రూ.100 కోట్ల చొప్పున ఇస్తున్నామని, ఈ నెలకు సంబంధించి రూ.100 కోట్లను సోమవారం (15న) చెల్లించామని చెప్పారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రెండు వర్గాలున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అన్ని ఆస్పత్రులు సమ్మెకు వెళ్లేలా లేవన్నారు. మరోవైపు నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను యథావిధిగా కొనసాగించాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఉదయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతోపాటు గడచిన 21 నెలల్లో ఆస్పత్రులకు రూ.1779 కోట్లను చెల్లించిందని తెలిపారు.

ఈ నెల రూ.100 కోట్ల చెల్లింపు..

చార్జీల పెంపు, కొత్త ప్యాకేజీల చేర్పుతో అదనంగా రూ.487.29 కోట్లను ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి ఖర్చు చేస్తోందని ఉదయ్‌కుమార్ తెలిపారు. హాస్పిటళ్ల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు నెలకు రూ.100 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సేవల నిలిపివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని హాస్పిటళ్ల యాజమాన్యాలకు సీఈవో విజ్ఞప్తి చేశారు. అయితే ఇందుకు ప్రైవేటు ఆస్పత్రుల నెట్‌వర్క్ అసోసియేషన్ నిరాకరించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్ ప్రకటించారు. బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో సర్కారు విఫలమైందన్నారు. తమ డిమాండ్లపై వెంటనే చర్చలు జరపాలని కోరారు.



అనుబంధ ఆస్పత్రులకు పూర్వవైభవం తెద్దాం: దామోదర

ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ఆస్పత్రులకు పూర్వవైభవం తీసుకొద్దామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని అధికారులకు సూచించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రుల పనితీరు, ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతుల కల్పన తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సాధారణంగా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఒకటి లేదా రెండు ఆస్పత్రులు మాత్రమే ఉంటాయని, కానీ, ఉస్మానియా కాలేజీకి మాత్రం 10 అనుబంధ ఆస్పత్రులు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి ఉస్మానియా ఆస్పత్రితోపాటు, నిలోఫర్ ఆస్పత్రి, సరోజినీదేవి కంటి ఆస్పత్రి, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్, టీబీ అండ్ చెస్ట్ హాస్పిటల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సుల్తాన్ బజార్ మెటర్నిటీ ఆస్పత్రి, పేట్ల బురుజు ప్రసూతి ఆస్పత్రి, ఈఎన్‌టీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ అనుబంధంగా ఉన్నాయని వివరించారు. ఎంతో ముందుచూపుతో ఏర్పాటైన ఈ హాస్పిటళ్లకు, పూర్వవైభవం తీసుకొద్దామన్నారు. కాగా, ఆస్పత్రులను ఆధునీకరించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈఎన్‌టీ ఆస్పత్రి కోసం కొత్త భవనం నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, ఉస్మానియా డెంటల్ కాలేజీకి సంబంధించిన భూమి సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుతో 5వేల కోట్ల నష్టం

» అయినా హేతుబద్ధీకరణకు అనుకూలంగా రాష్ట్ర నిర్ణయం

» తగ్గిన ధరలను షాపుల ముందు ప్రదర్శించాలి

» ఈ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి

» వ్యాపారులతో చర్చలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల హేతుబద్ధీకరణతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్ల ఆదాయాన్ని నష్టపోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయినా పేద, మధ్య తరగతి ప్రజలు, రైతుల మేలు కోసం హేతుబద్ధీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపారులతో చర్చా కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. సవరించిన రేట్లతో చాలా వస్తువులు, ముఖ్యంగా వ్యవసాయ పరికరాలు, ఆహార ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఈ ప్రయోజనాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, వ్యాపారులపై ఉందన్నారు. తగ్గిన వస్తువుల ధరలను వ్యాపారులు తమ దుకాణాల ముందు ప్రదర్శించాలని సూచించారు. సిమెంట్‌పై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీ 18 శాతానికి తగ్గనుందని, ఫలితంగా సిమెంటు ధరలు మరింత దిగి వస్తాయని చెప్పారు. దీంతో నిర్మాణ రంగం పుంజుకునే అవకాశాలు ఉంటాయన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చర్చించడానికి ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయ పెంపుపై నివేదికివ్వండి

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రాష్ట్ర ఆదాయ పెంపుపై లోతుగా అధ్యయనం చేసి, 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ల శాఖతో ముడిపడి ఉన్న హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హౌజింగ్ బోర్డులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం సూచించారు.

హెచ్‌ఎండీఏలో రెండు రీజియన్లు

» ఔటర్ సరిహద్దుగా కోర్ అర్బన్, సబర్బన్‌గా విభజన

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం హెచ్‌ఎండీఏను రెండు రీజియన్లుగా విభజించారు. ఒకటి.. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ కాగా.. మరొకటి ఓఆర్ఆర్ నుంచి హెచ్‌ఎండీఏ పరిధి వరకూ ఉండే సబర్బన్ రీజియన్. హెచ్‌ఎండీఏలో మెరుగైన పట్టణాభివృద్ధికి వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ మార్పులు చేశారు. ఈ రీజియన్లకు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్లను సైతం నియమిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఆర్.ఉపేందర్‌రెడ్డికి హెచ్‌ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (సబర్బన్ రీజియన్)గా, టి.వెంకన్నకు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (కోర్ అర్బన్ రీజియన్, మెట్రో రైల్)గా పోస్టింగులు ఇచ్చింది. వీరంతా హెచ్‌ఎండీఏ కమిషనర్ పర్యవేక్షణలోనే విధులు నిర్వర్తించనున్నారు. వీరి విధులపై త్వరలోనే మార్గదర్శకాలు జారీ కానున్నాయి. అభివృద్ధిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రభుత్వం ఇటీవల హెచ్‌ఎండీఏ పరిధిని 7,257 చదరపు కిలోమీటర్ల నుంచి 10,472.72 చదరపు కిలోమీటర్లకు పెంచిన విషయం తెలిసిందే. రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అవతలి ప్రాంతాలు కూడా ఇందులో కలిశాయి. ఓఆర్ఆర్ పరిధిలోని ప్రాంతమంతా సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉండగా.. ఓఆర్ఆర్ నుంచి హెచ్‌ఎండీఏ పరిధి వరకు గల ప్రాంతం సుమారు 8 వేల చదరపు కిలోమీటర్లు.

మైనార్టీ గురుకులాల టైంటేబుల్ మార్పు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ గురుకులాల టైంటేబుల్ (వేళలు) మారుస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త టైంటేబుల్‌లో.. ఉదయం 5 గంటలకు నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి 9.15 గంటలకు నిద్రకు ఉపక్రమించేవరకు పాటించాల్సిన సమయాల్ని పేర్కొన్నారు. టైంటేబుల్ మార్పుపై ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌ను మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.



సికింద్రాబాద్ సంగీత్ వద్ద మెడికవర్ ఆస్పత్రి ప్రారంభించిన కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ తదితరులు

మన చేతిలోనే మన ఆరోగ్యం

» మెడికవర్ సికింద్రాబాద్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి
» పేదలకు దయతో వైద్య సేవలు చేయండి: బండి సంజయ్
» రోగుల నమ్మకాన్ని నిలబెట్టుకోండి: రాష్ట్ర మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మనం తినే ఆహారంలో రసాయనాలు చేరితే.. పీల్చేగాలి, తాగే నీరు కలుషితమవుతుందని, అందువల్లే రోగాల బారీన పడుతున్నామని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. యూరప్‌లోనే అతిపెద్ద హెల్త్‌కేర్ గ్రూప్ సంస్థ 'మెడికవర్'.. తెలంగాణలో 8వ హాస్పిటల్.. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. శారీరక శ్రమ తగ్గడం, జీవనశైలిలో మార్పుల వల్లే పలువురు వ్యాధుల బారీన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు ఇంటర్ వరకూ వైద్యుడ్ని చూసే అవకాశం రాలేదన్న కిషన్ రెడ్డి.. ప్రస్తుతం తల్లి గర్భంలోనే పిల్లలకు డాక్టర్ల సాయం అవసరమవుతుందన్నారు. అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నందున రాష్ట్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. రోగం కంటే ఆస్పత్రులు వేసే బిల్లులు చూసి పేదోళ్లు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. కనుక ప్రేమతోనూ, దయతోనూ సేవలందించాలని వైద్యులను కోరారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విదేశాలతో పోలిస్తే మనదేశంలో వైద్యులను రోగులు నమ్ముతారని, దాన్ని నిలబెట్టుకునేలా సేవలందించాలన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణలా మార్చాలన్న పొన్నం ప్రభాకర్.. అందులో కార్పొరేట్ ఆస్పత్రులూ భాగస్వాములు కావాలని చెప్పారు. మెడికవర్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ జి. అనిల్ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో తమకిది ఎనిమిదో ఆస్పత్రి అన్నారు. నాలుగు రాష్ట్రాల్లో వైద్య సేవలందిస్తున్న తమ ఆస్పత్రి.. జిల్లాలకు సేవల విస్తరణకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, మెడికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.శరత్ రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఓ ఫ్యూడల్

» ఆయన వల్లే ఎదగలేకపోయాం : చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక ఫ్యూడల్(భూస్వామి) అని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయనవల్లే మనం సింగపూర్‌వంటి దేశాలతో పోటీ పడలేకపోయామని అన్నారు. "సింగపూర్, భారత్‌కు కొద్ది సంవత్సరాల వ్యత్యాసంలోనే స్వాతంత్ర్యం వచ్చింది. సింగపూర్ ట్రేడ్‌యూనియర్ నేత లీక్ లీ కాన్ పోటీదారీ ఆర్థిక విధానాలు అచరించారు. సింగపూర్‌ను అభివృద్ధి చేశారు. మనదేశంలో నెహ్రూ ఫ్యూడల్ (భూస్వామి). ఆయనకు బాగా డబ్బులున్నాయి. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఏ గేటు దగ్గరికి ఆయన వెళ్తే అక్కడికి కారు వచ్చేది. ఆయన అనుసరించిన సోషలిస్టు విధానాల కారణంగా 1947 నుంచి 1991 వరకు సింగపూర్‌తో మనం పోటీపడలేకపోయాం. ఆర్థిక సంస్కరణలు వచ్చాకే ముందుకు రాగలిగాం." అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

అది నేలకొండపల్లి ఎందుకు కాకూడదు!?

» కాకర్తి ఎక్కడుందో గుర్తించకుండానే ఊహలా?
» స్థపతి నాగిరెడ్డి ప్రతిపాదన ఆశ్చర్యకరం
» చరిత్ర పరిరక్షణ వేదిక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల మూల పురుషుడు గుండన జన్మస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని 'కాకర్తి' అని, ఆ గ్రామం ఇప్పుడు కనిపించడం లేదని, కానీ, గత కాలంలో ఎన్నడో ఉండవచ్చని చరిత్రకారులు చెప్పడం ఊహ మాత్రమేనని చరిత్ర పరిరక్షణ వేదిక వ్యాఖ్యానించింది. చరిత్రకు సంబంధించిన ఆధారాల పేరిట కాల్పనిక ఊహలు జోడించడం చరిత్ర వక్రీకరణకు దారి తీస్తుందని పేర్కొంది. 'కొండపల్లి సీమలో కాకతీయం' పేరిట పురావస్తు, చరిత్రకారులను ఉటంకిస్తూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై చరిత్ర పరిరక్షణ వేదిక పేరిట పూర్వ సంపాదకులు కె. రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, ఆద్యకళ మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమలరావు, దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్, పురావస్తు, మ్యూజియం శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఎస్ రంగాచార్యులు, చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్, కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన రామోజు హరగోపాల్, బీవీ భద్రగిరీశ్, కట్టా శ్రీనివాస్, టార్చ్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆర్య, తెలంగాణ పరిరక్షణ వేదికకు చెందిన పసునూరి రవీందర్ ఓ ప్రకటన విడుదల చేశారు. కాకర్తి గ్రామం ఎక్కడ ఉందో గుర్తించకుండానే, శాసన పాఠాలు వెల్లడించకుండానే స్వకపోలకల్పిత చరిత్రను ధ్రువీకరించడం సముచితం కాదని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో లభించిన తామ్ర శాసనాల్లో పేర్కొన్న కొండపల్లిసీమ అంటే విజయవాడ పక్కన ఉన్న కొండపల్లి అంటున్నారని, కానీ, కోదాడకు 15 కిలోమీటర్ల దూరంలోని నేలకొండపల్లి ఎందుకు కాకూడదో మైసూరులోని భారత శాసనాధ్యయన శాఖ అధికారికంగా సమాధానం ఇవ్వాల్సి ఉందని డిమాండ్ చేశారు. కోదాడ శాసనాల్లో పేర్కొన్న గ్రామాల్లో యాతవాకిల్ల, లోచెరువులు, కుడకుడ, ఘట్టికల్లు, మూసీ నది ప్రవాహం సూర్యాపేట జిల్లాలో.. కాకర్తి చుట్టూ ఉన్న పాలేరు, జువ్విపాడు ఖమ్మం జిల్లాలో ఉన్నాయని, మిగతా గ్రామాల పేర్లు కూడా ఆ పరిసర ప్రాంతాల్లోనే పరిశీలిస్తే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. క్రీ.శ. 900 సంవత్సరానికి ముందు కాకర్తి గ్రామం ఉండేదని ఊహించి స్థపతి నాగిరెడ్డి చెప్పడం సరికాదని, అది చరిత్ర ఆధారాలను విస్మరించడమేనని, ప్రతిపాదన తప్పుగా చేసి దాని కోసం ఇప్పుడు సదరు గ్రామాన్ని వెతుకుతున్నామని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందని తప్పుబట్టారు. ఈ అంశం మైసూరులోని భారత పురావస్తు సర్వేక్షణ శాసన విభాగం డైరెక్టర్ మునిరత్నం రెడ్డి అభిప్రాయమా లేదా సంస్థ అధికారిక ప్రకటనా అని ప్రశ్నించారు.

విద్యుత్ ఏడీఈ అక్రమాస్తులు 100 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం నుంచి సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో అంబేద్కర్ బినామీగా అనుమానిస్తున్న సతీశ్ ఇంట్లో రూ.2.18 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో ఐదు అంతస్తుల భవనం, సూర్యాపేటలోని పెన్‌పహాడ్‌లో పది ఎకరాల్లో రసాయన పరిశ్రమ, ఖరీదైన ప్రాంతాల్లో ఆరు ఇళ్ల స్థలాలు, వెయ్యి గజాల మామిడి తోట, రెండు కార్లు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉండవచ్చని అంతర్గత సంభాషణల్లో ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. భార్య సునందతో కలిసి అంబేద్కర్ 2023 ఏప్రిల్ 23న అంతర్ కెమికల్స్ కంపెనీని రూ.3కోట్ల పెట్టుబడితో టీఎన్‌జీవో కాలనీలోని తన ఇంట్లో ప్రారంభించారు. ఆయన విద్యుత్ శాఖలో పనిచేస్తున్నప్పటికీ అంతర్ కెమికల్స్‌లో డైరెక్టర్‌గా ఆర్‌వోసీకి ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. కంపెనీ నిర్వహణ బాధ్యతలను గుర్రం రామకృష్ణకు అప్పగించినట్లు తెలుస్తోంది. అంబేద్కర్ తన అక్రమ ఆదాయంలో చాలా వరకు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. పదేళ్లుగా కీలకమైన ప్రాంతాల్లో (పటాన్‌చెరు, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ, ఇబ్రహీంబాగ్) ఏడీఈగా పనిచేస్తున్న అంబేద్కర్ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. మంగళవారం రాత్రి ఆయనను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచిన తర్వాత కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు.



రూ.78లక్షల బ్యాంకు బ్యాలన్స్..

ఏడీఈ అంబేద్కర్ బ్యాంకు ఖాతాల్లో రూ.78 లక్షల బ్యాలన్స్, షేర్లలో రూ.36లక్షల పెట్టుబడుల వివరాలను గుర్తించామని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. అంబేద్కర్ కారులో రూ.5.50 లక్షల నగదు దొరికిందని, బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని చెప్పారు. బంగారు ఆభరణాలు ఇతరత్రా ఆస్తులకు సంబంధించి త్వరలో వివరాలు వెల్లడిస్తామని, సోదాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమాలు

హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో కొంత మంది విద్యుత్ శాఖ అధికారులు భారీగా అక్రమాలకు పాల్పడుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. శివారు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కొత్త అపార్ట్‌మెంట్లు, భారీగా కమర్షియల్ భవనాలు వెలుస్తుండటం వారికి ఆదాయ మార్గంగా మారుతోంది. దక్షిణ డిస్కమ్‌లో 90 శాతం పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లు చేస్తున్నారు. దీంతో బినామీ పేర్లతో కాంట్రాక్టు పనులు చేపడుతున్న అధికారులు దండిగా వెనకేసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు, ఆర్టిజన్ల పేర్లతో కాంట్రాక్ట్ లైసెన్సులు తీసుకొని పనులు చేస్తున్నారు. అభివృద్ధి పనుల్లో అంచనాలను పెంచడంతో పాటు తమకు సంబంధించిన కాంట్రాక్టర్లకే ఆ పనులు అప్పగించి అందినకాడికి దండుకుంటున్నారు. దక్షిణ డిస్కమ్‌లో 20 మందికి పైగా అధికారులు బినామీ పేర్లతో ప్రైవేట్ కాంట్రాక్టు పనులు చేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొంత మంది అధికారులు రాజకీయ నేతలకు రూ.30-50 లక్షలు ఇచ్చి కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగులు తెచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఆ సొమ్మును వసూలు చేసుకునేందుకు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో పోస్టింగుల కోసం పైరవీలు జోరుగా నడుస్తాయనే చర్చ జరుగుతోంది.

ఆర్టిజన్, లైన్‌మెన్ల అక్రమాలు..

శివారు ప్రాంతాల్లో కొంత మంది లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టిజన్లు స్థానిక అధికారుల అండతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. జీడిమెట్ల, గాజులరామారంలో ఎస్టిమేషన్లు లేకుండా ప్యానెల్ బోర్డులు ఇవ్వడంతో పాటు ఇంటి నంబర్లకు బై నంబర్లు జతచేస్తూ అక్రమంగా 10-12 విద్యుత్ మీటర్లు జారీచేస్తున్నారు. జీడిమెట్ల, పటాన్‌చెరు, సంగారెడ్డి, కొండాపూర్, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, కీసర ప్రాంతాల్లో కొంత మంది విద్యుత్ సిబ్బంది.. స్థానిక అధికారుల అండతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి. అనేక ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలకు విద్యుత్ మీటర్ల జారీకి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. గాజులరామారం, డీపీపల్లిలో ఒక్కో మీటర్ ఇచ్చేందుకు రూ.30-40వేలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అనేక డివిజన్లలో కొంత మంది ఆర్టిజన్లు, లైన్‌మెన్లు స్థానిక అధికారుల సహకారంతో ప్రైవేట్ కాంట్రాక్టు పనులు చేపడుతున్నారు. జీడిమెట్ల పరిధిలో కొంత మంది ప్యానెల్ బోర్డు లేకుండా ఎక్కువ మీటర్లు తీసుకునేందుకు ఇంటి నంబర్లకు బై నంబర్లు, యజమాని పేరులో చిన్న మార్పులు చేస్తూ అదనపు కనెక్షన్లు ఇస్తున్నారు. ఒక్క సీటీ మీటర్ విడుదల చేయాలంటే క్షేత్ర స్థాయి సిబ్బందికి రూ.4-5 వేల వరకు ఇస్తే తప్ప ఫైళ్లు ముందుకు కదలని పరిస్థితులున్నాయనే ఫిర్యాదులున్నాయి.

లంచం సొమ్ము నా ఒక్కదానికే కాదు

» మునిసిపల్ కమిషనర్, లీగల్ అడ్వైజర్, కంప్యూటర్ ఆపరేటర్ కలిసి పంచుకుంటాం
» స్పై కెమెరాలో మణిహారిక సంభాషణ రికార్డు
» డిజిటల్ ఫైల్‌ను కోర్టులో సమర్పించిన ఏసీబీ

హైదరాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) నార్సింగ్ మునిసిపాలిటీలో రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాక మణిహారిక కేసులో కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. లంచం సొమ్ము తనకొక్కదానికే కాదని కమిషనర్, లీగల్ అడ్వైజర్, కంప్యూటర్ ఆపరేటర్ కలిసి పంచుకుంటామని మణిహారిక బాధితుడితో మాట్లాడిన సంభాషణకు సంబంధించిన డిజిటల్ ఫైల్‌ను ఏసీబీ అధికారులు కోర్టులో సమర్పించారు. ఈ కేసులో మునిసిపల్ లీగల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ కీలకపాత్ర పోషించాడని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. మంచిరేవుల గ్రామంలో వెయ్యి గజాల స్థలానికి ఎల్ఆర్ఎస్ కోసం ఓ వ్యక్తి రూ.6,65,002 ఫీజు చెల్లించారు. అయితే, ఆ ఫైల్ క్లియర్ కావాలంటే లంచం కావాల్సిందేనని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణిహారిక పట్టుబట్టారు. మలక్‌పేటలో ఉన్న తమ లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్‌ను కలవాలని చెప్పారు. ఈ క్రమంలో బాధితుడు లక్ష్మణ్‌ను కలిశాడు. ఫైల్ క్లియర్ కావాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలని లక్ష్మణ్ పేర్కొన్నాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు బాధితుడికి సీక్రెట్ కెమెరాను ఇచ్చారు. ఈ క్రమంలో ఇటీవల సదరు వ్యక్తి నార్సింగ్ మునిసిపాలిటీకి వెళ్లి మణిహారికను కలిశాడు. లక్ష్మణ్ అడిగిన రూ.10 లక్షలు ఇవ్వలేనని, కొంత తగ్గించాలని ప్రాధేయపడ్డాడు. దీంతో తనకు రూ.4 లక్షలు, రూ.50 వేలు లక్ష్మణ్‌కు ఇవ్వాలని మణిహారిక సూచించారు. తానొక్కదాన్నే డబ్బు తీసుకోవడం లేదని, నార్సింగ్ మునిసిపల్ కమిషనర్, కంప్యూటర్ ఆపరేటర్ పంచుకుంటామని మణిహారిక పేర్కొన్నారు. అనంతరం బాధితుడు మణిహారికకు డబ్బు ఇవ్వగానే ఏసీబీ అధికారులు ఆమెను పట్టుకున్నారు. ఈ కేసులో నార్సింగ్ మునిసిపల్ కమిషనర్, కంప్యూటర్ ఆపరేటర్ మధు, లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్‌కు సంబంధం ఉందని వెల్లడైన నేపథ్యంలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నామని ఏసీబీ అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

లంచం కేసులో తహసీల్దార్‌కు ఏడాది జైలుశిక్ష

» పట్టుబడ్డ 14 ఏళ్ల తర్వాత తీర్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తి మ్యూటేషన్ కోసం రూ.1 లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన తిర్మలగిరి తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస రాజుకు హైదరాబాద్ ఏసీబీ కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో నెల జైలుశిక్ష అనుభవించాలని కోర్టు స్పష్టం చేసింది. 2011 డిసెంబర్ 30న ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా శ్రీనివాస రాజును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విచారణ తరువాత ఈ కేసులో ఇప్పుడు తీర్పు వెలువడింది.

విద్యార్థులకు అనేక సవాళ్లు

» ఎదిరిస్తూ ముందుకు వెళ్తే మంచి ఫలితాలు
» లఖ్‌నవూలోని ఎస్‌జీపీజీఐఎంఎస్ స్నాతకోత్సవంలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి సూచన

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బయట ప్రపంచంలోకి అడుగుపెట్టే విద్యార్థులకు అనేక సవాళ్లు ఎదురవుతాయని.. వాటిని ఎదిరిస్తూ ముందుకు వెళ్తే మంచి ఫలితాలు వస్తాయని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, ప్రొఫెసర్ డి.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. లఖ్‌నవూలోని సంజయ్‌గాంధీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మంగళవారం నిర్వహించిన 29వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెసిడెంట్‌గా తన శిక్షణ పూర్తయ్యాక హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేరానని.. ఆ సమయంలో ఒక యూరోపియన్ సదస్సులో ఒక సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్.. "నువ్వు ఎండోస్కోపీ చేస్తే టెక్నీషియన్‌లా మారిపోతావు" అని తనతో అన్నారని గుర్తుచేసుకున్నారు. "కానీ నా గురువు డాక్టర్ జంగ్ దిలావారి ప్రేరణతో, నేను థెరప్యూటిక్ ఎండోస్కోపీని నా జీవిత లక్ష్యంగా స్వీకరించాను" అని తెలిపారు. 'నువ్వు సమాజం కోసం ఏం చేశావు? ఏదైనా పరిశోధన చేశావా? ఎవరికైనా శిక్షణ ఇచ్చావా?' అని ఒకరోజు తన తండ్రి ప్రశ్నించారని.. ఆయన ప్రశ్నలు తన జీవితాన్ని మలుపుతిప్పాయని చెప్పారు. అప్పుడే తాను కొద్దిమంది మిత్రులతో కలిసి 'ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ'ని ప్రారంభించానని వెల్లడించారు. ప్రస్తుతం అది 1000 పడకల ఆసుపత్రిగా, ప్రపంచంలోనే అతిపెద్ద ఎండోస్కోపీ యూనిట్‌గా, ప్రత్యేకమైన పరిశోధనా విభాగంతో, గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించే అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ఉత్తర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేశ్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు మార్గదర్శకాలు

(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో వారికి తాత్కాలిక ఉపశమనం కలిగించేలా మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులతో ప్రభుత్వం తాజాగా జీవో 190 జారీ చేసింది. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని స్పష్టమైన ఖాళీలు ఉంటే తాత్కాలిక బదిలీలకు, డిప్యుటేషన్లకు అనుమతించాలని ఆదేశించింది. ఈ బదిలీలు రెండేళ్ల కాలానికి అనుమతిస్తున్నామని, గరిష్ఠంగా మూడేళ్ల వరకు పొడిగించవచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మూడేళ్లు ముగిసిన తర్వాత బదిలీ అయిన ఉద్యోగి తిరిగి తాను పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లాల్సి ఉంటుంది. ఒక ఉద్యోగి ఒకసారి మాత్రమే ఈ అవకాశాన్ని వాడుకోవచ్చని, క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొనే ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం వర్తించదని జీవోలో పేర్కొంది. బదిలీ అయిన ఉద్యోగులకు టీఏ, డీఏలు చెల్లించబోమని తెలిపింది. ఇప్పటికే పదోన్నతి పొందిన వారు, భాగస్వామి, పరస్పర అవగాహన విభాగాల్లో లబ్ధి పొందిన ఉద్యోగులు ఈ వెసులుబాటుకు అనర్హులని స్పష్టం చేసింది. కాగా, ఇది ఉద్యోగ సంఘాలు సాధించిన విజయమని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఉద్యోగులకు తాత్కాలిక బదిలీలకు అనుమతివ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రివర్గ ఉపసంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

కంటితుడుపు చర్యతో ఉపయోగం లేదు

ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు కేవలం కంటితుడుపు చర్యగానే కనిపిస్తున్నాయి. దీనివల్ల ఇతర జిల్లాల్లో ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల సమస్యలు తీరవు. ప్రభుత్వం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కేంద్రం అనుమతి తీసుకొని ఉద్యోగులను సర్దుబాటు చేసి న్యాయం చేయాలి. గతంలో ఇతర జిల్లాకు బదిలీ అయి ఇబ్బంది పడుతున్న వారికి ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. మూడేళ్ల తర్వాత మళ్లీ పాత స్థానంలోకి వెళ్లాల్సి ఉంటుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఉద్యోగులు 317 జీవో వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం దొరకదు.

- చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.